RNI.No. APTEL/2014/57702

ESTD: 1999

www.voodayam.com



వుదయం

సంబరాల జీవితం సౌభాగ్యాల సౌరభం
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
46 Years
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

గుంటూరు | 13-11-2026 శుక్రవారం | సంపుటి : 13 | సంచిక : 235 SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY రూ. 3.00 | పేజీలు : 12 VOODAYAM Telugu DAily

Simultaneously Published from Guntur, Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Warangal Postal Regd. No. GTR/117/2025-27 Follow us on

అప్పులు, ప్రకృతి విపత్తులు ఎదురైనా

ఇందిరమ్మ ఇళ్ల పథకం ఆగదు



లబ్ధిదారుల ఆనందబాష్పాలే మాకు ఆశీస్సులు: మంత్రి పొంగులేటి

వచ్చే దీపావళి నాటికి ఇందిరమ్మ టవర్ల నిర్మాణం పూర్తి

పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

మరో మూడు విడతల్లో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు

పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులు

మైలార్‌దేవుపల్లిలో ఇందిరమ్మ టవర్ల నిర్మాణానికి శ్రీకారం

హైదరాబాద్, నవంబర్ 12 (వుదయం) :

రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయల అప్పులను రాష్ట్రం పై మోపినా, ఎల్‌నినో వంటి ప్రకృతి వైపరీత్యాలు ఎదురైనా పేదల సొంతింటి కలను సాకారం చేసే కార్యక్రమం ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిచిపోదని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే ఇందిరమ్మ టవర్ల నిర్మాణాలను వచ్చే దీపావళి నాటికి పూర్తిచేస్తామని ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో లబ్ధిదారులు తమ సొంత ఇళ్లలోనే దీపావళి పండుగ జరుపుకోవాలన్న సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. రాజేంద్రనగర్, మహేశ్వరం నియోజకవర్గాల పరిధిలోని లబ్ధిదారుల కోసం మైలార్‌దేవుపల్లిలో నిర్మించనున్న ఇందిరమ్మ టవర్ల నిర్మాణానికి గురువారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రంగారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, స్థానిక శాసనసభ్యుడు ప్రకాశ్‌గౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పొంగులేటి మాట్లాడుతూ.. నిరుపేదల జీవితంలో సొంతిల్లు అనేది ఎంతో గొప్ప కల అని, ఆ కలను నెరవేర్చే బాధ్యతను ప్రజాప్రభుత్వం తీసుకుందని పేర్కొన్నారు. ఇప్పటికే ఇళ్ల మంజూరు ప్రక్రియ కొనసాగుతుండగా, మరో మూడు విడతల్లో కూడా ఇళ్లను మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. క్యూర్ పరిధిలోని 23 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులు ఎలాంటి పక్షపాతం లేకుండా పారదర్శకంగా చేపడుతున్నామని చెప్పారు. కులమతాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులైన పేదలకు ఇళ్లు అందిస్తున్నామని వివరించారు. ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్లు పొందిన లబ్ధిదారుల కళ్లలో కనిపిస్తున్న ఆనందం తమకు ఎంతోసంతృప్తినిస్తోందని మంత్రి అన్నారు. ఇళ్లు మంజూరైన మహిళల ఆనందబాష్పాలను చూస్తుంటే తమ కళ్లు కూడా చెమర్చుతున్నాయని, వారి సంతోషమే తమకు లభించే గొప్ప ఆశీస్సులని భావోద్వేగంగా పేర్కొన్నారు. గత పాలకులు పేదల ఇళ్ల నిర్మాణం విషయంలో మాటలకే పరిమితమయ్యారని విమర్శించారు.

జర్నలిజంలో సాంకేతిక విప్లవం

న్యూఢిల్లీ, నవంబర్ 12 (ఎఎంస్) :

మీడియాతో తనకు ఎన్నో ఏళ్లుగా విడదీయరాని అనుబంధం ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. మీడియా రంగంలో అసాధ్యమంటూ ఏదీ లేదని, విపత్తులు, సంక్షోభ సమయాల్లో క్షేత్రస్థాయిలో పనిచేసే విలేకరులు వార్తా కథనాల సేకరణ కోసం ఎంతో శ్రమిస్తారని ప్రశంసించారు. దిల్లీలోని భాజపా ప్రధాన కార్యాలయంలో పాత్రికేయుల కోసం నిర్వహించిన ప్రత్యేక దీపావళి మిలన్ కార్యక్రమంలో ప్రధాని పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మోదీ తన గత అనుభవాలను గుర్తుచేసుకున్నారు. భాజపాలోకి వచ్చిన తొలినాళ్లలో మీడియా కార్యక్రమాలకు హాజరయ్యే వారి కోసం కుర్చీలు ఏర్పాటు చేసే బాధ్యతను తాను నిర్వహించే వాడినని తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటివరకు పాత్రికేయులతో తనకు మంచి అనుబంధం కొనసాగుతోందన్నారు.



గత కొన్నేళ్లుగా జర్నలిజం రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని, సాంకేతిక అభివృద్ధితో వార్తల సేకరణ, ప్రసార విధానాలు పూర్తిగా మారిపోయాయని వివరించారు. ఒకప్పుడు మీడియా సమావేశాలను ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు ప్రత్యేక ప్రసార వాహనాలను వినియోగించేవారని, ప్రస్తుతం చేతిలోని సెల్‌ఫోన్ ఆ బాధ్యతను నిర్వర్తిస్తోందని పేర్కొన్నారు. గతంలో పత్రికా ప్రకటనల ద్వారా సమాచారాన్ని అందించేవారని, ప్రస్తుతం సామాజిక మాధ్యమాల విస్తృతితో క్షణాల్లోనే సమాచారం ప్రజలకు చేరుతోందని, చిన్నచిన్న దృశ్య చిత్రాల ద్వారా కూడా వార్తలు విస్తృత ప్రచారం పొందుతున్నాయని వివరించారు. దేశాభివృద్ధి కోసం తమ ప్రభుత్వం చేపట్టిన పలు కార్యక్రమాలను ఈ సందర్భంగా ప్రధాని ప్రస్తావించారు. పేదరిక నిర్మూలన దిశగా గత పన్నెండేళ్లలో గణనీయమైన పురోగతి సాధించామని వెల్లడించారు. గతంలో పేదరికాన్ని నిర్మూలిస్తామంటూ కేవలం నినాదాలకే పరిమితమయ్యేవారని, తమ ప్రభుత్వం మాత్రం సుమారు 50 కోట్ల మందిని పేదరిక రేఖకు దిగువన ఉన్న పరిస్థితి నుంచి బయటపడేసిందని పేర్కొన్నారు. దేశంలో వివిధ రంగాల్లో అసాధారణ విజయాలు సాధిస్తున్న వ్యక్తులు ఎంతోమంది ఉన్నారని, వారి విజయ ప్రస్థానాలను వెలుగులోకి తీసుకువచ్చి ప్రపంచానికి పరిచయం చేయాల్సిన బాధ్యత పాత్రికేయులపై ఉందని మోదీ సూచించారు. సమాజంలో స్ఫూర్తిని నింపే వ్యక్తుల కృషి, విజయాలను ప్రజలకు తెలియజేయడం ద్వారా మరింత మందికి ప్రేరణ కల్పించవచ్చన్నారు.

పట్టభద్రుల ఓటరు జాబితాపై

ఈసీ ప్రత్యేక దృష్టి

హైదరాబాద్, నవంబర్ 12 (వుదయం) :

పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గాల ఓటరు జాబితా రూపకల్పన ప్రక్రియను పర్యవేక్షించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ ఐఏఎస్ అధికారులను ప్రత్యేక పరిశీలకులుగా నియమించింది. ఆయా జిల్లాల్లో ఓటర్ల నమోదు నిబంధనలకు అనుగుణంగా జరుగుతోందా లేదా అనే అంశాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు సమర్పించాలని ఆదేశించింది. ఈ మేరకు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిశీలకురాలిగా పురపాలక శాఖ కార్యదర్శి టి.కె.శ్రీదేవిని నియమించింది. వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలకు ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, వనపర్తి, జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాలకు రవాణా శాఖ కార్యదర్శి కె.ఇలంబరితికి బాధ్యతలు అప్పగించింది. జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, నల్గొండ జిల్లాల పరిశీలకురాలిగా పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్‌ను నియమించింది. మహబూబాబాద్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు కార్మిక శాఖ కార్యదర్శి దాసరి హరిచందన, వరంగల్, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శి బి.విజయేంద్రను పరిశీలకులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

భారత్ సదస్సుపై రాజకీయ దుమారం

హైదరాబాద్, నవంబర్ 12 (వుదయం) :

నగరంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించ తలపెట్టిన భారత్ సదస్సు తెలంగాణలో రాజకీయ వివాదానికి దారితీసింది. ఈ సదస్సు పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని రాహుల్ గాంధీ రాజకీయ ప్రచారానికి వినియోగిస్తోందని భాజపా నాయకులు ఆరోపించారు. నవంబర్ 14న రాహుల్ గాంధీ హైదరాబాద్ పర్యటనకు వచ్చిన సమయంలో నల్లజెండాలతో నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. తెలంగాణ భాజపా అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు ఈ సదస్సును 'భారత్ వ్యతిరేక సదస్సు'గా అభివర్ణించారు. ప్రభుత్వ నిధులతో రాజకీయ ప్రయోజనాల కోసం కార్యక్రమాలు నిర్వహించడం సరికాదని భాజపా నేతలు విమర్శించారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ ఈ సదస్సు నిర్వహణను సమర్థించింది. దేశ విదేశాలకు చెందిన ప్రతినిధులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి భారత విదేశాంగ విధానం, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి, అంతర్జాతీయ పరిణామాలు, ప్రపంచవ్యాప్తంగా ఎదురవుతున్న సవాళ్లపై చర్చించడమే సదస్సు ప్రధాన ఉద్దేశమని వెల్లడించింది. నవంబర్ 13, 14 తేదీల్లో హైదరాబాద్‌లో ఈ సదస్సు జరగనుంది. మారుతున్న ప్రపంచ రాజకీయ, ఆర్థిక పరిస్థితుల్లో అంతర్జాతీయ వ్యవహారాల్లో భారత్ పోషించాల్సిన పాత్రపై రాహుల్ గాంధీ తన ఆలోచనలు, భవిష్యత్ దృక్పథాన్ని ఈ వేదికగా వివరించనున్నట్లు సమాచారం.

రైతుల చెంతకు భారత్ విస్తార్

సాగు సమస్యలకు సాంకేతిక పరిష్కారాలు
పెట్టుబడి ఖర్చు తగ్గించి
దిగుబడి, ఆదాయం పెంచడమే లక్ష్యం



హైదరాబాద్, నవంబర్ 12 (వుదయం) :

తెలంగాణ రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వ్యవసాయ సేవలను మాతృభాష తెలుగులోనే అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. వ్యవసాయ రంగంలో కృత్రిమ మేధ ఆధారిత సలహాలు, సూచనలను రైతులకు చేరువ చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం రూపొందించిన జాతీయ వ్యవసాయ డిజిటల్ వేదిక భారత్ విస్తార్‌తో రాష్ట్రాన్ని అనుసంధానం చేయనున్నారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర వ్యవసాయ శాఖ, జాతీయ స్మార్ట్ పాలన సంస్థ మధ్య గురువారం సచివాలయంలో అవగాహన ఒప్పందం కుదిరింది. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది.

వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానంతో కొత్త మార్పులు తీసుకురావాలి

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతికతను వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయడం ద్వారా రైతుల సాగు ఖర్చులను గణనీయంగా తగ్గించడంతో పాటు వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చవచ్చని పేర్కొన్నారు. పంటలకు సోకే చీడపీడలు, తెగుళ్లను తొలిదశలోనే గుర్తించి శాస్త్రీయ సూచనలు అందిస్తే పంట నష్టాన్ని నివారించే అవకాశం ఉంటుందని తెలిపారు. వాతావరణ పరిస్థితులు, భూమి స్వభావం, పంటల రకాలు, సాగు సమయం, మార్కెట్ ధరలను సమగ్రంగా విశ్లేషించి రైతులకు అవసరమైన సమయంలో తగిన సలహాలు అందించడంలో కృత్రిమ మేధ కీలకంగా ఉపయోగపడుతుందని వివరించారు. ఎరువులు, పురుగుమందులు, ఇతర వ్యవసాయ అవసరాల కోసం రైతులు అనవసరంగా అధిక మొత్తంలో ఖర్చు చేయకుండా సరైన మోతాదులో వినియోగించేలా మార్గనిర్దేశం చేయవచ్చన్నారు. తద్వారా పెట్టుబడి వ్యయం తగ్గి, పంట దిగుబడులు, రైతుల ఆదాయం పెరిగేందుకు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలోని ప్రాంతాలవారీ వాతావరణ పరిస్థితులు, నేలల లక్షణాలు, పంటల వైవిధ్యం, స్థానిక సాగు విధానాలు, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా భారత్ విస్తార్ వేదికను రూపొందించాలని అధికారులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సేవలతో పాటు రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ పథకాలు, ఉత్తర్వులు, పంటల సాగు విధానాలు, శాస్త్రీయ సలహాలను కూడా ఈ వేదికకు అనుసంధానం చేయాలని ఆదేశించారు.

కోపీహెచ్‌బీ ప్లాట్లకు భారీ ధర.. గజం రూ.2.18 లక్షలు

హైదరాబాద్, నవంబర్ 12 (వుదయం) :

కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు పరిధిలోని ఖాళీ స్థలాలకు బహిరంగ వేలంలో భారీ ధరలు లభించాయి. తెలంగాణ గృహ నిర్మాణ మండలి గురువారం నిర్వహించిన వేలంలో కేపీహెచ్‌బీ 15వ దశలోని ఓపెన్ ప్లాట్లకు కొనుగోలుదారుల నుంచి మంచి స్పందన లభించింది. గరిష్ఠంగా ఒక గజానికి రూ.2.18 లక్షల ధర పలకడం విశేషం. మొత్తం 22 స్థలాలను వేలం వేయాలని నిర్ణయించగా, 11 స్థలాలు మాత్రమే విక్రయమయ్యాయి. వీటి ద్వారా గృహ నిర్మాణ మండలికి రూ.33 కోట్ల ఆదాయం సమకూరింది. మిగిలిన 11 స్థలాలకు కొనుగోలుదారుల నుంచి తగిన స్పందన లేకపోవడంతో వాటి వేలం ప్రక్రియను నిర్వహించలేదు.

సర్పంచ్ స్థానాలపై వైసీపీ గురి!

12 పంచాయతీల్లో పట్టు కోసం వ్యూహాలు.. జడ్పీటీసీ ఓటమిపై ఎమ్మెల్యే సమీక్ష ఉంటుందా? కూటమి నాయకుల్లో అంతర్మథనం

చంద్రగిరి, యర్రావారిపాలెం నవంబర్11(వుదయం ప్రతినిధి):

రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మండలంలోని 12 పంచాయతీలపై వైసీపీ ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ప్రతి పంచాయతీలోనూ తమ బలాన్ని పెంచుకోవడంతో పాటు ఓటర్ల మద్దతు కూడగట్టేందుకు ఇప్పటి నుంచే పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల జరిగిన పరిషత్ ఎన్నికల్లో తమ ఉనికిని చాటుకున్న వైసీపీ నాయకులు అదే తరహాలో పంచాయతీ పోరులోనూ సత్తా చాటాలని వ్యూహరచన చేస్తున్నట్లు సమాచారం.



పరిషత్ ఫలితాలే ప్రాతిపదికగా..

ఇటీవల జరిగిన పరిషత్ ఎన్నికల్లో మండలంలోని ఎనిమిది ఎంపీటీసీ స్థానాల్లో ఆరు స్థానాలు ఏకగ్రీవం కాగా, మరో స్థానంలో టీడీపీ అభ్యర్థి విజయం సాధించారు. దీంతో మొత్తం ఏడు ఎంపీటీసీ స్థానాలను కూటమి ఖాతాలో వేసుకుంది. మరోవైపు చింతగుంట ఎంపీటీసీ స్థానంతో పాటు జడ్పీటీసీ స్థానాన్ని వైసీపీ కైవసం చేసుకుంది. జడ్పీటీసీ అభ్యర్థి రెడ్డమ్మ మెజారిటీతో విజయం సాధించడం వైసీపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. ఈ ఫలితాలే రానున్న పంచాయతీ ఎన్నికల్లో రెండు పార్టీలకు రాజకీయ బలాబలాలను అంచనా వేసుకునే ప్రాతిపదికగా మారాయి.

జడ్పీటీసీ ఓటమిపై ఎమ్మెల్యే సమీక్ష ఉంటుందా?

ఏడు ఎంపీటీసీ స్థానాలను కైవసం చేసుకున్న కూటమి జడ్పీటీసీ స్థానాన్ని మాత్రం చేజార్చుకోవడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే పులివర్తి నాని మండల కూటమి నాయకులను పిలిచి ఎన్నికల ఫలితాలపై సమీక్ష నిర్వహిస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా ఏయే పంచాయతీల్లో కూటమికి ఆశించిన స్థాయిలో ఓట్లు రాలేదు? ఎక్కడ ఓట్ల శాతం తగ్గింది? ఏయే ప్రాంతాల్లో వైసీపీకి అనుకూలంగా ఓట్లు మళ్లాయి? స్థానిక నాయకుల మధ్య సమన్వయం ఏ మేరకు ఉంది? అనే అంశాలపై సమీక్ష జరిగితే ఓటమికి గల కారణాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య సమన్వయ లోపం, స్థానిక రాజకీయ సమీకరణాలు, ఓటర్లను ఏకతాటిపైకి తీసుకురావడంలో ఎదురైన ఇబ్బందులు ఓటమికి కారణమై ఉండవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా జనసేన అభ్యర్థి పోటీ చేసిన చింతగుంట ఎంపీటీసీ స్థానంలో వైసీపీ అభ్యర్థికి భారీ మెజారిటీ రావడం కూడా రాజకీయంగా చర్చకు దారితీసింది. ఈ అంశాలన్నింటినీ పంచాయతీల వారీగా పరిశీలించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు కూటమి వర్గాల్లో వినిపిస్తున్నాయి.

పంచాయతీ పోరు పరిషత్ ఎన్నికలకు భిన్నం..

పరిషత్ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే పంచాయతీ ఎన్నికల్లోనూ పునరావృతమవుతాయని భావించడం సరికాదు. పరిషత్ ఎన్నికల్లో పార్టీ గుర్తులు, రాజకీయ సమీకరణాలు ప్రధాన పాత్ర పోషిస్తే, పంచాయతీ ఎన్నికల్లో స్థానిక అభ్యర్థుల వ్యక్తిగత పరిచయాలు, ప్రజలతో సంబంధాలు, గ్రామ సమస్యలపై అవగాహన, అభివృద్ధి కార్యక్రమాలు కూడా కీలక ప్రభావం చూపుతాయి. అందువల్ల 12 పంచాయతీల్లోనూ గెలుపు లక్ష్యంగా ముందుకు వెళ్లాలంటే రెండు పార్టీలకు గ్రామస్థాయిలో బలమైన వ్యూహం అవసరం.

బొమ్మల కుటుంబానికి మరో అవకాశం దక్కేనా?

మరోవైపు జడ్పీటీసీ ఎన్నికల్లో ఓటమి పాలైన బొమ్మల చంగమ్మకుటుంబం విషయంలోనూ స్థానికంగా చర్చ జరుగుతోంది. చంగమ్మభర్త, మాజీ జడ్పీటీసీ బొమ్మల కుమారస్వామి మండల ప్రజలకు సుపరిచితుడు. గతంలో ప్రజాప్రతినిధిగా పనిచేసిన అనుభవం, స్థానికంగా ఉన్న పరిచయాలు తమకు అనుకూలంగా మారతాయని ఆ కుటుంబం ఆశించినప్పటికీ జడ్పీటీసీ ఎన్నికల్లో ఓటమి ఎదురైంది. ఈ నేపథ్యంలో రానున్న పంచాయతీ ఎన్నికల్లోనైనా లేదా మరేదైనా రాజకీయ పదవిలోనైనా బొమ్మల కుమారస్వామి కుటుంబానికి మరో అవకాశం కల్పించే అంశాన్ని ఎమ్మెల్యే పులివర్తి నాని పరిశీలిస్తారా? అన్నది రాజకీయ వర్గాల్లో చర్చకు వస్తోంది. అయితే దీనిపై ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం వెలువడలేదు.మొత్తానికి పరిషత్ ఎన్నికల్లో సాధించిన విజయాలపై కూటమి ధీమాగా ఉన్నప్పటికీ జడ్పీటీసీ ఓటమి మాత్రం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అంశంగా మారింది. మరోవైపు వైసీపీ కూడా అదే ఫలితాలను ఆసరాగా చేసుకుని పంచాయతీ ఎన్నికలకు సమాయత్తమవుతున్నట్లు తెలుస్తోంది. గత ఎన్నికల ఫలితాలను సమీక్షించుకుని, గ్రామస్థాయిలో ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటూ ముందుకు వెళ్లడం రెండు పార్టీలకు అవసరంగా మారింది. 12 పంచాయతీల్లో రాజకీయ సమీకరణాలు రానున్న రోజుల్లో ఎలాంటి మలుపులు తిరుగుతాయో వేచి చూడాలి.

ఇరాన్ ఒప్పందంపై వెనక్కి తగ్గిన ట్రంప్

వాషింగ్టన్: ఇరాన్‌తో ఒప్పందం కుదుర్చుకునే విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తన వైఖరిని మార్చుకున్నారు. టెహ్రాన్‌తో ఎలాంటి ఒప్పందం చేసుకునే ఉద్దేశం తమకు లేదని స్పష్టం చేశారు. ఈ వ్యవహారం ఇప్పటికే ముగిసిన అధ్యాయమని వ్యాఖ్యానించారు. ఇరాన్‌తో ఒప్పందం కోసం అమెరికా ప్రయత్నించాల్సిన అవసరం ఏమాత్రం లేదని తన సొంత సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు. వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిపై ఇప్పటికే అమెరికా ఆధిపత్యం సాధించిందని ట్రంప్ తన పోస్టులో వెల్లడించారు. అంతేకాకుండా ఇరాన్‌కు చెందిన పందల బిలియన్ల డాలర్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, అమెరికాలో డెమోక్రటిక్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అవినీతి విపరీతంగా పెరిగిపోయిందని ట్రంప్ ఆరోపించారు. ఈ వ్యవహారంపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌ను ఆదేశించారు. ట్రూత్ సోషల్ వేదికగా ఈ మేరకు ఆయన సూచనలు చేశారు. మిన్నెసోటా, కాలిఫోర్నియా, ఇల్లినోయా సహా పలు రాష్ట్రాల్లో భారీ స్థాయిలో అవినీతి జరుగుతోందని ట్రంప్ విమర్శించారు.

ఆధునిక యుద్ధ సవాళ్లపై అప్రమత్తంగా ఉండాలి

డ్రోన్ల యుగంలో సరికొత్త రక్షణ వ్యూహాలు అవసరం
ఆకస్మిక దాడులను తిప్పికొట్టేందుకు సర్వసన్నద్ధంగా ఉండాలి
నిఘా, పర్యవేక్షణ వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలి

న్యూఢిల్లీ, నవంబర్ 12 (ఎఎంస్) :

ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు సరికొత్త రూపాలను సంతరించుకుంటున్న నేపథ్యంలో శత్రువుల నుంచి ఎలాంటి రూపంలో ముప్పు ఎదురైనా తిప్పికొట్టేందుకు భారత సైన్యం అప్రమత్తంగా ఉండాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. ప్రత్యర్థులు అనూహ్యంగా దాడులకు దిగినా వారి వ్యూహాలకు చిక్కకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దిల్లీలో నిర్వహించిన వైమానిక దళ కమాండర్ల సమావేశంలో ఆయన ప్రసంగించారు. మారుతున్న యుద్ధ పరిస్థితులకు అనుగుణంగా రక్షణ, ప్రతిదాడుల వ్యూహాలను ఎప్పటికప్పుడు ఆధునికీకరించుకోవాల్సిన అవసరం ఉందని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. శత్రువుల కదలికలను నిరంతరం గమనిస్తూ నిఘా, పర్యవేక్షణ వ్యవస్థలను మరింత పటిష్ఠం చేసుకోవాలని సూచించారు. ముప్పును ముందుగానే గుర్తించి అప్రమత్తంగా వ్యవహరించడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించవచ్చని తెలిపారు. శత్రువులు కోలుకునే అవకాశం లేకుండా ఎదుర్కొనే స్థాయిలో రక్షణ దళాలు తమ సామర్థ్యాలను పెంచుకోవాలని అన్నారు.



గతంలో తుపాకులు, ఇతర సంప్రదాయ ఆయుధాలకు ప్రాధాన్యం ఉండగా, ప్రస్తుతం మానవ రహిత విమానాలు, గగనతల రక్షణ వ్యవస్థలు యుద్ధ గమనాన్ని ప్రభావితం చేస్తున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆత్మాహుతి తరహా మానవ రహిత విమానాలు, నిఘా విమానాల ద్వారా ఎదురవుతున్న సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు వైమానిక దళం ప్రత్యేక సామర్థ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. అవసరమైతే ఇతర దేశాలతో కలిసి సంయుక్త విన్యాసాలు నిర్వహించాలని, ఇది పరస్పర సహకారాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్‌రష్యా, ఇజ్రాయెల్‌హమాస్ మధ్య కొనసాగిన యుద్ధాలను ప్రస్తావించిన రక్షణ మంత్రి.. ఆధునిక యుద్ధాల్లో సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తోందని వివరించారు.



ఇందిరమ్మ ఇళ్లతో పేదల ఇంట సంతోషం..

అర్హులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- **నూతన గృహాలను ప్రారంభించి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందజేసిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి**

మిడ్జిల్, నవంబర్ 12, వుదయం


పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరుపేద కుటుంబాల్లో కొత్త వెలుగులు నింపుతోందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి అన్నారు. మిడ్జిల్ మండలం వస్పుల గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను గురువారం ఆయన ఘనంగా ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని అర్హులైన లబ్ధిదారులకు నూతన రేషన్ స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలన్నదే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా శాశ్వత గృహవసతి కల్పిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకొని లబ్ధిదారులు నాణ్యతతో కూడిన ఇళ్లను నిర్మించుకోవాలని సూచించారు.ప్రజా ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్లతో పాటు రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ ద్వారా పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు మరింత చేరువవుతున్నాయని పేర్కొన్నారు. రేషన్ స్మార్ట్ కార్డుల ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రజా పంపిణీ వ్యవస్థలో మరింత సౌలభ్యం కలుగుతుందని తెలిపారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా, అర్హులైన వారికే అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీతో వస్పుల గ్రామంలో లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందం నెలకొంది. సొంతింటి కల నెరవేరడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సంబంధిత అధికారులు, గ్రామస్తులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ కార్యక్రమాల అమలులో జిల్లా రాష్ట్రస్థాయిలో మొదటి ఐదు స్థానాల్లో నిలవాలి

అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) మధుసూదన్ నాయక్

మహబూబ్‌నగర్

జిల్లాలో విద్యాశాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ కార్యక్రమాల పురోగతిపై జిల్లా కలెక్టర్ కార్యాలయం లో అదనపు కలెక్టర్ ఛాంబర్ నుండి వెబెక్స్ ద్వారా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) మధుసూదన్ నాయక్ మండల విద్యా శాఖ అధికారులతో (MEOs) సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి (DEO) పాల్గొన్నారు.ఈ సందర్భంగా మండలాల వారీగా విద్యాశాఖ అధికారులు చేపడుతున్న క్షేత్రస్థాయి పర్యటనలు, పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, వాటి పర్యవేక్షణ, పాఠశాలల సందర్శనకు



సంబంధించిన ఫొటోల అప్‌లోడ్, విద్యార్థుల ఆధార్ సీడింగ్, APAAR IDల నమోదు తదితర అంశాలను అదనపు కలెక్టర్ సమీక్షించారు.ప్రతి మండల విద్యాశాఖ అధికారి తమ పరిధిలోని పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శించాలని, పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల నాణ్యత, పురోగతిని క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించాలని ఆదేశించారు. పర్యటనలకు సంబంధించిన ఫొటోలను ఎప్పటికప్పుడు సంబంధిత పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.
విద్యార్థుల ఆధార్ సీడింగ్ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు, అర్హులైన విద్యార్థులందరికీ APAAR IDల నమోదు ప్రక్రియను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న పనులను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.
విద్యాశాఖ కార్యక్రమాల అమలులో అధికారులు సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేస్తూ నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని అదనపు కలెక్టర్ సూచించారు. ప్రతి మండల విద్యాశాఖ అధికారి తమకు కేటాయించిన లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, విద్యాశాఖ కార్యక్రమాల అమలు, పురోగతిలో మహబూబ్‌నగర్ జిల్లాను రాష్ట్రస్థాయిలో మొదటి ఐదు స్థానాల్లో నిలిపేందుకు సమష్టిగా కృషి చేయాలని ఆదేశించారు.
ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి, మండల విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఉప్పల్ నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని PHCల

అప్‌గ్రేడ్‌కు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక చొరవ

కాప్రా(వుదయం ప్రతినిధి)

నవంబర్ 12, మేడ్చల్ జిల్లా

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను (PHC) అప్‌గ్రేడ్ చేయడంతో పాటు, అవసరమైన చోట నూతన భవనాల నిర్మాణం చేపట్టి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు.ఈ రోజు మంత్రి దామోదర్ రాజనరసింహ గారిని కలిశారు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న PHCలలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, ప్రస్తుత భవనాల పరిస్థితిని పరిశీలించడం, అవసరమైన చోట నూతన భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకోవడం, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చూడడం వంటి అంశాలపై ఎమ్మెల్యే దృష్టి సారించారు.
ఈ నేపథ్యంలో మేడ్చల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (DMHO) ఆనంద్ గారిని కలిసి, నియోజకవర్గంలోని PHCల అభివృద్ధి, అప్‌గ్రేడేషన్, నూతన భవనాల నిర్మాణానికి సంబంధించిన అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ కావాలంటే PHCలను బలోపేతం చేయడంతో పాటు, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం ఎంతో ముఖ్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సంబంధిత శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ నియోజకవర్గంలోని అన్ని PHCల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.ప్రజారోగ్యానికి ప్రాధాన్యత.. మెరుగైన వైద్య సదుపాయాలే లక్ష్యం అని తెలిపారు ఈ కార్యక్రమంలో BRS పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, గంధం నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు

రవాణా శాఖ ఆధ్వర్యంలో జీరో ఫాటాలిటీ డిస్ట్రిక్ట్స్ (ZFD)పై

ఒకరోజు అవగాహన కార్యక్రమం





రంగారెడ్డి జిల్లా ,వుదయం

రోడ్డు ప్రమాదాలను తగ్గించి, రోడ్డు ప్రమాద మరణాలు లేని జిల్లాగా రంగారెడ్డి జిల్లాను తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) శ్రీమతి శారదాదేవి పిలుపునిచ్చారు.రంగారెడ్డి జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో సేవ్‌లైఫ్ ఫౌండేషన్ (SaveLIFE Foundation) సహకారంతో జీరో ఫాటాలిటీ డిస్ట్రిక్ట్స్ (Zero Fatality Districts - ZFD) కార్యక్రమంపై ఒకరోజు అవగాహన సదస్సును నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా రెవెన్యూ అధికారి శ్రీమతి శారదాదేవి, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శ్రీమతి అఫ్రీన్ సిద్దిఖీ, జిల్లా రవాణా అధికారి శ్రీ కె. వాసుదేవరావు, రోడ్లు మరియు భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీ పి. రణేష్, రోడ్ సేఫ్టీ కన్సల్టెంట్ శ్రీ ధన్‌రాజ్ గౌడ్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు శ్రీమతి సాయి శ్రుతి, శ్రీమతి బి. స్వాతి, శ్రీ ఎం. రాఘువులు తదితరులు హాజరయ్యారు.
ఈ అవగాహన కార్యక్రమంలో పోలీస్ శాఖ, రోడ్లు మరియు భవనాల శాఖ (R&B), జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (NHAI), వైద్య ఆరోగ్య శాఖలకు చెందిన అధికారులు కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న అంశాల గుర్తింపు, ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాల (బ్లాక్ స్పాట్స్) గుర్తింపు, రహదారుల మౌలిక సదుపాయాల మెరుగుదల, రోడ్డు భద్రతా ప్రమాణాల అమలు, ప్రమాద బాధితులకు సత్వర వైద్య సహాయం అందించే అత్యవసర స్పందన వ్యవస్థలను బలోపేతం చేయడం వంటి అంశాలపై చర్చించారు.రోడ్డు ప్రమాదాల నివారణకు వివిధ శాఖల మధ్య సమన్వయం ఎంతో కీలకమని, ప్రమాదాలు జరిగే ప్రాంతాలను శాస్త్రీయంగా విశ్లేషించి తగిన నివారణ చర్యలు చేపట్టాలని కార్యక్రమంలో వివరించారు. రహదారి భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు, ప్రమాదాల తీవ్రతను తగ్గించే చర్యలను సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరాన్ని అధికారులు నొక్కిచెప్పారు.రంగారెడ్డి జిల్లాను జీరో ఫాటాలిటీ డిస్ట్రిక్ట్‌గా తీర్చిదిద్దడం ద్వారా విలువైన మానవ ప్రాణాలను కాపాడటమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని, ఈ లక్ష్య సాధనకు అన్ని సంబంధిత శాఖలు సమష్టి బాధ్యతతో పనిచేయాలని కార్యక్రమంలో పిలుపునిచ్చారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



కేశంపేట (వుదయం ప్రతినిధి)

నవంబర్ 12)

రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందే విధంగా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే వీర్ల శంకర్ అన్నారు. గురువారం మండలంలోనిదేవునిగుడి తండా, రాగ్య తండా, చింతకుంటపల్లి, పాటిగడ్డ గ్రామాల్లో పలు రేషన్ దుకాణాల ప్రారంభోత్సవం, స్మార్ట్ కార్డుల అందజేత వంటి అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారుఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడం తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. మహిళా సంఘాలను బలోపేతం చేయడంతో పాటు వారు సమావేశాలు నిర్వహించుకోవడానికి అవసరమైన సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమాల్లో కొత్తపేట సింగిల్ విండో చైర్మన్ యెన్నం శ్రీధర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి, ఎంపీడీవో రవిచంద్ర రెడ్డి, తహశీల్దార్ రాజేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్,మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు గూడ వీరేశం,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కరుణాకర్,కల్లు సాయిలు, ఆయా గ్రామాల సర్పంచులు సుజాత, శశిరేఖ, భాస్కర్ గౌడ్, శ్యామల అఖిల్, పోచామొని రమేష్, పల్లె ఆనంద్ కుమార్,నాగేశ్వర్,కొట్టం నరేందర్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గుండె రాణి, మహిళా కాంగ్రెస్ నాయకురాలు అనసూయ, కాంగ్రెస్ పార్టీ నాయకులు జితేందర్ రెడ్డి, కరణకర్ రెడ్డి, గోపానీ భీమయ్య,లింగం,శ్రీనాథ్,రమేష్, వంశీగౌడ్,సుదర్శన్,కృష్ణయ్య,సరికొండ రమేష్,యాదగిరి,కోదూరు రాములు,చిర్ర శ్రీను తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఇచ్చిన హామీ...

నెరవేరిన లబ్ధిదారుని కల



కేశంపేట (వుదయం ప్రతినిధి

నవంబర్ 12)

రేషన్ కార్డు మంజూరు కోసం ప్రజాపాలనలో పెట్టుకున్న, దాని సంబంధించిన పత్రాలను సంబంధిత అధికారులకు సకాలంలో అందజేయక పోవడంతో కొత్త రేషన్ కార్డు మంజూరు కాలేదు .గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు కొత్త రేషన్ కార్డు ఇప్పించాలని మొరపెట్టుకున్నారు. గురువారం వివిధ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు ఎమ్మెల్యే మండల పరిధిలోని దేవుని గుడి తండాకు వెళ్లారు. తండాకు చెందిన కేతావత్ సుగుణ కొత్త రేషన్ కార్డు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నానని, కొత్త రేషన్ కార్డు మంజూరు చేయాలని ఎమ్మెల్యే విర్లపల్లి శంకర్ కు విజ్ఞప్తి చేశారు. తక్షణమే స్పందించి కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని లబ్ధిదారుని కి సూచించారు. రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న మూడు గంటల లోపే కొత్త రేషన్ కార్డు మంజూరు కావడంతో లబ్ధిదారుడు ఎమ్మెల్యే విర్లపల్లి శంకర్ కు కృతజ్ఞతలు తెలిపారు. మంజూరు పత్రాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనుమగల్ల రమేష్ కు తహసిల్దార్ రాజేందర్ రెడ్డి అందజేశారు. ఈ వసందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం కృషి చేస్తూ వారి అభ్యున్నతికి పాటుపడుతున్న ఎమ్మెల్యే శంకర్ కు కృతజ్ఞతలు తెలిపారు. మాట ఇచ్చిన మూడు గంటల లోపే లబ్ధిదారునికి కొత్త రేషన్ కార్డు మంజూరు చేయించడం పట్ల ఆయన ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షులు గూడ వీరేశం, నాయకులు కోదూరు రాములు, భీమయ్య, భాస్కర్ నాయక్, అంజయ్య నాయకులు పాల్గొన్నారు...

TUWJ H-143 వికారాబాద్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

- **TUWJ H-143 వికారాబాద్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక**
- **రాష్ట్ర, జాతీయ స్థాయి కమిటీలకు పలువురు జర్నలిస్టుల నామినేషన్లు**
- **జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, ఐక్యతే ప్రధాన లక్ష్యం**





వికారాబాద్:

తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (TUWJ H143) వికారాబాద్ జిల్లా నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర నాయకులు ఆస్కాని మారుతీ సాగర్, యోగనంద్, అవ్వరి భాస్కర్, తిరుపతి నాయక్ ఎన్నుకున్నారు. జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు రాష్ట్ర, జాతీయ స్థాయి కమిటీలకు పలువురు సీనియర్ జర్నలిస్టులు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.
జిల్లా అధ్యక్షుడిగా ఎం. రవీందర్, ప్రధాన కార్యదర్శిగా ప్రహ్లాద చారి, కోశాధికారిగా బొబ్బిలి రాజును ఎన్నుకున్నారు.
జిల్లా ఉపాధ్యక్షులుగా:
మాలేకాడి మల్కయ్య గౌడ్ (కొడంగల్)
శివశంకర్ (తాండూరు)
సయ్యద్ జావీద్ (వికారాబాద్)
సంయుక్త కార్యదర్శులుగా:
పట్లూర్ నర్సింలు (వికారాబాద్)
ఎం. అశోక్ గౌడ్ (కొడంగల్)
కె. అనంతయ్య (తాండూరు)
కార్యనిర్వాహక కార్యదర్శులుగా:
విశ్వనాథ్ (వికారాబాద్)
అయూబ్ (కొడంగల్)

గౌరవ సలహాదారులుగా:

అల్లీపూర్ వెంకటేష్ (వికారాబాద్)
గోపాల్ రెడ్డి (మొమిన్ పేట్)
నర్సయ్య (ధారూర్) జైదుపల్లి గోపాల్ (వికారాబాద్)
ఫహీం ఖాన్ (తాండూర్
ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా:
ఎం. అశోక్ (కొడంగల్)
దొంత శ్రీకాంత్ (కొడంగల్)
సయ్యద్ అలీ
రమేష్ నాయక్
నక్క చంద్రశేఖర్
అంజిలయ్య
రాష్ట్ర, జాతీయ స్థాయి కమిటీలకు నామినేషన్లు జిల్లా కార్యవర్గం ఏర్పాటు అనంతరం రాష్ట్ర స్థాయి కమిటీకి సీనియర్ జర్నలిస్ట్ బస్వరాజ్, సయ్యద్ జావీద్, సాతాని నర్సింహా నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. అదేవిధంగా జాతీయ స్థాయి కమిటీకి సయ్యద్ ఆసిఫ్ హుస్సేన్, జి. నర్సింహులు నామినేషన్లు సమర్పించారు.ఈ సందర్భంగా టియుడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కానీ మారుతి సాగర్ మాట్లాడుతూ...జర్నలిస్టుల సమస్యల పరిష్కారం,వృత్తిపరమైన భద్రత, సంక్షేమ పథకాల అమలు, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల సాధన, అక్రిడిటేషన్ తదితర అంశాలపై సంఘం తరపున సమిష్టిగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని...జిల్లాలోని అన్ని మండలాల జర్నలిస్టులను ఏకతాటిపైకి తీసుకువస్తూ, వారి సమస్యలకు పరిష్కారం చూపే దిశగా నూతన కార్యవర్గం కృషి చేయాలని ఆకాంక్షించారు. జర్నలిస్టుల ఐక్యతే సంఘం బలమని, హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ సంఘటితంగా ముందుకు సాగాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

రెడ్‌క్రాస్ సేవలను విస్తరించాలి...సభ్యత్వ నమోదును పెంచాలి

- **కలెక్టర్ గరిమ అగ్రవాల్**

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 12 (వుదయం ప్రతినిధి) :

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లాలో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని జిల్లా కలెక్టర్, ఐఆర్‌సీఎస్ జిల్లా అధ్యక్షురాలు గరిమ అగ్రవాల్ సూచించారు, సేవా కార్యక్రమాల్లో మరింత మంది భాగస్వాములయ్యేలా సభ్యత్వ నమోదును పెంచాలనిపిలుపునిచ్చారు.గురువారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ



మేనేజింగ్ కమిటీ సభ్యులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ప్రణాళికాబద్ధంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. రెడ్‌క్రాస్ కార్యాలయం ఏర్పాటు, నూతన బ్లడ్ బ్యాంకు స్థాపన, సభ్యత్వ నమోదు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి, కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో ఐఆర్‌సీఎస్ జిల్లా చైర్మన్ గూడూరి రవీందర్, వైస్ చైర్మన్ ప్రయాకరావు వేణుకుమార్, కార్యదర్శి సీహెచ్ సంతోష్ కుమార్, సలహాదారు ఈవీ శ్రీనివాసరావు, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యుడు పీవీ సంజీవరెడ్డి, కోశాధికారి చంద్రగిరి శ్రీధర్, మేనేజింగ్ కమిటీ సభ్యులు ఎం. అజయ్ బాబు, ఏ. శివప్రసాద్, కే. బాబు, సీహెచ్ శ్రీనివాస్, దేవదాస్, అరుణ, రాజు, సురేంద్రబాబు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోయిల్‌కొండలో 1,078 మందికి

నూతన చేయూత' పింఛన్లు మంజూరు

కోయిల్‌కొండ

నవంబర్ 12, వుదయం

మండల ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. నూతన 'చేయూత' పథకం కింద మండల వ్యాప్తంగా అర్హులైన 1,078 మందికి కొత్త పింఛన్లు మంజూరయ్యాయి. అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించిన అనంతరం అర్హులైన లబ్ధిదారులను గుర్తించారు. ఈ నెల నుంచే లబ్ధిదారులకు పింఛన్ నగదు



అందనుండటంతో, మండలంలోని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

102 మద్యం బాటిళ్ల పట్టివేత



హైదరాబాద్ /శంషాబాద్

వుదయం

ఎయిర్‌పోర్ట్ నుంచి గోవా తో పాటు ఇతర ప్రాంతాల నుంచి మద్యం వస్తుందని సమాచారం మేరకు ఎక్సైజ్ స్టేట్ టాస్క్ ఫోర్స్ సి అండ్ డి టీం ల సిఐ లు వెంకటేశ్వర రెడ్డి,నాగరాజు సిబ్బంది కలిసి పహాడ్ షరీఫ్ వద్ద తనిఖీలు చేపట్టారు.
తనిఖీల్లో 102 మద్యం బాటిలను స్వాధీనం చేసుకున్నారు.
పట్టుబడిన మద్యం బాటిల్లను శంషాబాద్ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు సిఐలు తెలిపారు.

1.1 కేజీల గంజాయి పట్టివేత..

ముగ్గురు పై కేసు నమోదు ఒకరి అరెస్ట్..

హైదరాబాద్/దూల్‌పేట్

వుదయం

లోనిగంగాబౌలిప్రాంతంలోగంజాయి అమ్మకాలు చదువుతున్న మౌనిక(36)ను దూల్‌పేట్ ఎక్సైజ్ సీఐలు సిబ్బంది అరెస్టు చేశారు. నిందితురాలి వద్ద 1.1 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మౌనికతో పాటు జయబాయి, శివాని సింగ్ లపై కూడా కేసు నమోదు చేశారు. వీరిద్దరూ పరారీ



లో ఉన్నట్లు సీఐ ప్రవీణ్ కుమార్, విప్లవ కుమార్ రెడ్డి, వెంకన్న తెలిపారు.
గంజాయి పట్టుకున్న కేసులోసిబ్బంది జనార్దన్ రెడ్డి, రిజ్వాన్, బీరయ్య, సూర్య, సహజ, అనిత, నాగరాజు, నవీన్ లు ఉన్నారు.

మూడు దశాబ్దాల కాంగ్రెస్ సేవకు గుర్తింపు దక్కాలి

- **మార్కెట్ కమిటీ పీఠంపై వసుపుల మనయ్యకు అవకాశం కల్పించాలి.. యువ నాయకుడు మదన్ మోహన్ డిమాండ్**

ఆమనగల్లు, నవంబర్ 12 (వుదయం):

మూడు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీకి అంకితభావంతో సేవలందిస్తూ, కష్టకాలంలోనూ పార్టీని వీడకుండా నిబద్ధతకు మారుపేరుగా నిలిచిన సీనియర్ నాయకుడు వసుపుల మనయ్యకు ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కేటాయించాలని కాంగ్రెస్ యువ నాయకుడు మదన్ మోహన్ డిమాండ్ చేశారు.
గురువారం ఆయన మాట్లాడుతూ.. పదవుల కోసం కాకుండా ప్రజాసేవే లక్ష్యంగా రాజకీయాల్లో కొనసాగుతున్న మనయ్యకు సముచిత గుర్తింపు ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఆమనగల్లు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి విశేష కృషి చేశారని, అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపారని పేర్కొన్నారు.
పార్టీ ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొన్న సమయంలోనూ ఇతర పార్టీల నుంచి ఆహ్వానాలు వచ్చినప్పటికీ వాటిని తిరస్కరించి కాంగ్రెస్‌లోనే కొనసాగడం ఆయన పార్టీ విధేయతకు నిదర్శనమన్నారు. పార్టీ అధిష్ఠానం ఇచ్చిన ఆదేశాలను శిరసావహిస్తూ క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా, ఆమనగల్లు పట్టణంతో పాటు కల్వకుర్తి నియోజకవర్గ స్థాయిలో మంచి గుర్తింపు సంపాదించుకున్నారని తెలిపారు. ఇలాంటి నిబద్ధత కలిగిన నాయకుడికి మార్కెట్ కమిటీ చైర్మన్ బాధ్యతలు అప్పగించడం ద్వారా పార్టీకి అంకితమైన కార్యకర్తలకు గౌరవం దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యువ నాయకులు అశోక్, శ్రీకాంత్, రవి, వగ్గు యాదగిరి, భరత్ నాయక్, సల్ల అఖిల్, తలర్ రవి పాల్గొన్నారు.



పంట వ్యర్థాలను కాల్చొద్దు..

పశువుల మేతగా వినియోగించండి ఏవో ప్రదీప్

- **ఎనిమిది నెలల పాటు పశువులకు మేత కొరత రాకుండా జాగ్రత్త పడండి**

రాజాపూర్, నవంబర్ 12: వుదయం

మండల రైతులు వరి గడ్డి, జొన్న చొప్ప, మొక్కజొన్న చొప్పలను కాల్చకుండా కట్టలుగా కట్టి భద్రపరచుకోవాలని మండల వ్యవసాయ అధికారి ప్రదీప్ సూచించారు. రానున్న ఎనిమిది నెలల పాటు వీటిని పాడి పశువులకు మేతగా వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వాతావరణ మార్పులు, కరువు పరిస్థితుల కారణంగా పశువులకు మేత కొరత ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ముందస్తు జాగ్రత్తగా పంట కోతల



అనంతరం లభించే గడ్డి, చొప్పను వృథా చేయకుండా నిల్వ చేసుకోవాలని సూచించారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల పర్యావరణానికి నష్టం కలగడమే కాకుండా పశువులకు ఉపయోగపడే విలువైన మేతను కోల్పోతామని తెలిపారు.
రైతులందరూ ఈ సూచనలను పాటించి పాడి పశువులను మేత కొరత నుంచి కాపాడుకోవాలన్నారు

రేపు నల్గొండలో చేయూత పెన్షన్ల పంపిణీ

- ముఖ్య అతిథిగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలి
- కలెక్టర్ బి. చంద్రశేఖర్

నల్గొండ, వుదయం ప్రతినిధి

నల్గొండ జిల్లా కేంద్రంలోని ఏచూరి గార్డెన్స్‌లో ఈ నెల 13న నిర్వహించనున్న నల్గొండ నియోజకవర్గ స్థాయి చేయూత పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. పెన్షన్ల పంపిణీకి సంబంధించి అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులను ఆదేశించారు. గురువారం పెన్షన్ల పంపిణీ ఏర్పాట్లను పరిశీలించేందుకు అధికారులతో కలిసి ఏచూరి గార్డెన్స్‌ను సందర్శించారు. నల్గొండ నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాలు, నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పెన్షన్ లబ్ధిదారులందరూ ఈ కార్యక్రమానికి హాజరుకానున్న నేపథ్యంలో వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, పారిశుద్ధ్యం, హెల్ప్ డెస్క్‌లు, ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. మండలాల వారీగా, మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్ల వారీగా లబ్ధిదారుల జాబితాలను సిద్ధం చేయాలని, ఏ కౌంటర్‌లో పెన్షన్ పంపిణీ చేస్తారో లబ్ధిదారులు సులభంగా తెలుసుకునేలా స్పష్టమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, భోజన సదుపాయం తదితర అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు. పెన్షన్ల పంపిణీ కార్యక్రమం గురించి లబ్ధిదారులకు ముందుగానే సమాచారం అందించాలని, అర్హులైన వారికే పెన్షన్లు పంపిణీ చేయాలని, అనర్హులకు ఎట్టి పరిస్థితుల్లోనూ పెన్షన్లు మంజూరు చేయకూడదని స్పష్టం చేశారు. ముందుగానే లబ్ధిదారుల జాబితాలను సిద్ధం చేసి తనకు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో శిక్షణ సహాయ కలెక్టర్ ఎన్. శ్రీకాంత్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ గుమ్మల మోహన్ రెడ్డి, మంత్రి ఆర్ అండ్ బి శాఖ పీఏ మధుసూదన్ రెడ్డి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో ఆదుకుంటాం

బర్రె పూజిత కౌన్సిలర్ - బర్రె జహంగీర్ మాజీ మున్సిపల్ చైర్మన్

యాదాద్రి భువనగిరి జిల్లా. వుదయం ప్రతినిధి .




భువనగిరి పట్టణంలోని ఇందిరానగర్ 23వ వార్డుకు చెందిన దర్గాయి రమేష్ ఆటో డ్రైవర్ కు ముఖ్యమంత్రి సహాయ నిధి (LOC) ద్వారా రూ.4 లక్షలు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే కుంబం అనిల్ కుమార్ రెడ్డి చొరవతో బాధితుడి వైద్య చికిత్సకు ఈ ఆర్థిక సాయం అందించినట్లు కౌన్సిలర్ బర్రె పూజిత – బర్రె జహంగీర్ మాజీ మున్సిపల్ చైర్మన్ తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న దర్గాయి రమేష్ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో Aorto Bifemoral Bypass చికిత్స చేయించుకోవాల్సి ఉండగా, ఆర్థిక ఇబ్బందులను కుటుంబ సభ్యులు కౌన్సిలర్ బర్రె పూజిత – జహంగీర్ ద్వారా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి కార్యాలయానికి సిఫారసు చేయడంతో ఈ నెల 11న రూ.4 లక్షల విలువైన LOC జారీ అయింది. చికిత్సకు ఆర్థిక భరోసా కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఎమ్మెల్యే కుంబం అనిల్ కుమార్ రెడ్డి కౌన్సిలర్ బర్రె పూజిత జహంగీర్ లకు బాధితుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. వారి వెంట వార్డు నాయకులు భూషపాక రవి, బర్రె నరేందర్, గాయపాక వెంకటేష్, బర్రె క్రాంతి, బందారు లింగం వారి కుటుంబ సభ్యులు ఉన్నారు.

కరువు సాయం ఏదీ? ప్రకటనలకే పరిమితమైన ప్రభుత్వం!

- రైతులను పట్టించుకోని కాంగ్రెస్.. దళారులతో కుమ్మక్కు
- ఐకేపీ కేంద్రాలు ప్రారంభించి మద్దతు ధరతో పాటు బోనస్ చెల్లించాలి

: మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్



కోదాడ నవంబర్ 12(వుదయం)

రైతు సంక్షేమమే లక్ష్యమని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను రోడ్డున పడేస్తోందని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ విమర్శించారు. నియోజకవర్గంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై గురువారం తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావంతో పంటలు నష్టపోయిన మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిన ప్రభుత్వం, ఇప్పటివరకు బాధిత రైతులకు ఒక్క రూపాయి కూడా పరిహారం అందించలేదని ఆరోపించారు. మరోవైపు కోతకొచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఐకేపీ కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు రోడ్లపైనే ధాన్యం కుప్పలు పోసుకుని ఎదురుచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు, ప్రభుత్వం దళారులతో కుమ్మక్కై ధాన్యం ధరలను తగ్గిస్తున్నారని ఆరోపించారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు కనీస మద్దతు ధర కూడా లభించక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ధాన్యానికి బోనస్‌ను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. కోదాడ నియోజకవర్గంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించాలని, మద్దతు ధరతో పాటు బోనస్ చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న కరువు పరిహారాన్ని వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

కార్తీక మాసం సందర్భంగా పంచారామ క్షేత్రాలకు భద్రాచలం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

- భక్తుల సౌకర్యార్థం కొత్త సూపర్ లగ్జరీ బస్సుల ఏర్పాటు
- భద్రాచలం ఆర్టీసీ డిపో మేనేజర్ జంగయ్య

భద్రాచలం 12/11/26 వుదయం ప్రతినిధి:


కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ప్రముఖ పుణ్యక్షేత్రాలను దర్శించుకోవాలనుకునే భక్తుల సౌకర్యార్థం భద్రాచలం ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేస్తున్నట్లు భద్రాచలం ఆర్టీసీ డిపో మేనేజర్ జంగయ్య తెలిపారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా కార్తీక మాసంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రసిద్ధ పంచారామ పుణ్యక్షేత్రాల దర్శనానికి కొత్త సూపర్ లగ్జరీ బస్సులను నడపనున్నట్లు గురువారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. భక్తులు ఎలాంటి ప్రయాణ ఇబ్బందులు లేకుండా సౌకర్యవంతంగా, సురక్షితంగా ఐదు పుణ్యక్షేత్రాలను దర్శించుకునేలా ఈ ప్రత్యేక బస్సు సర్వీసులను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రత్యేక బస్సు ప్రతి ఆదివారం రాత్రి 20.00 గంటలకు భద్రాచలం ఆర్టీసీ డిపో నుంచి బయలుదేరి అమరావతి, భీమవరం, ద్రాక్షారామం, పాలకొల్లు, సామర్లకోటలోని ప్రసిద్ధ పంచారామ క్షేత్రాలకు భక్తులను తీసుకువెళ్తుందని తెలిపారు. కార్తీక సోమవారం రోజున ఐదు పుణ్యక్షేత్రాలను దర్శించుకునే విధంగా ప్రయాణ ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. అనంతరం తిరుగు ప్రయాణంలో మంగళవారం తెల్లవారుజామున 4.00 గంటలకు తిరిగి భద్రాచలం చేరుకుంటుందని వివరించారు.

ఈ పంచారామ ప్రత్యేక యాత్రకు పెద్దలకు రూ.2,150, పిల్లలకు రూ.1,100 టికెట్ ధరగా నిర్ణయించినట్లు తెలిపారు. ఒకే ప్రయాణంలో ఐదు పవిత్ర శైవ క్షేత్రాలను దర్శించుకునే అవకాశం కల్పించడం ద్వారా భక్తులకు సమయం ఆదా కావడంతో పాటు ప్రయాణ సౌకర్యం కూడా కలుగుతుందని అన్నారు. అదేవిధంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం సత్యనారాయణ స్వామివారి దర్శనానికి వెళ్లే భక్తుల కోసం కూడా ప్రతి ఆదివారం రాత్రి 21.00 గంటలకు భద్రాచలం నుంచి ప్రత్యేక బస్సు బయలుదేరుతుందని తెలిపారు. అన్నవరం ప్రయాణానికి ఒకవైపు టికెట్ ధర రూ.500 మాత్రమేనని పేర్కొన్నారు. భక్తులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకొని స్వామివారిని దర్శించుకోవాలని సూచించారు. మరోవైపు అయ్యప్ప స్వాముల శబరిమల యాత్ర కోసం కూడా భద్రాచలం ఆర్టీసీ డిపో నుంచి కొత్త సూపర్ లగ్జరీ బస్సులను అద్దె ప్రాతిపదికన అందుబాటులో ఉంచుతున్నట్లు డిపో మేనేజర్ జంగయ్య వెల్లడించారు. అయ్యప్ప మాలధారణ చేసి శబరిమల యాత్రకు వెళ్లే స్వాములకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లతో బస్సులను అందించనున్నట్లు తెలిపారు. ఈ బస్సుల్లో గురుస్వామికి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించబడుతుందని, అదేవిధంగా ఇద్దరు మణికంఠ స్వాములకు, ఇద్దరు వంట వారికి, సామగ్రిని చూసుకునేందుకు ఒక వ్యక్తికి సీటు లేకుండా ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించనున్నట్లు వివరించారు. అయ్యప్ప స్వాముల బృందాలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ శబరిమల యాత్రను సౌకర్యవంతంగా పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. అంతేకాకుండా పాఠశాలలు, కళాశాలలు, వివిధ సంస్థలు, కుటుంబ సభ్యులు, స్నేహితుల బృందాలు నిర్వహించే విజ్ఞాన విహార యాత్రల కోసం కూడా ఆర్టీసీ బస్సులను అద్దె ప్రాతిపదికన అందిస్తున్నట్లు చెప్పారు. కనీసం 40 మంది ప్రయాణికులతో ఒక బ్యాచ్‌గా ఉంటే, వారు కోరుకున్న ప్రాంతాలకు, కోరుకున్న పర్యాటక ప్రదేశాలకు వెళ్లేందుకు ప్రత్యేకంగా బస్సులను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

భక్తులు, అయ్యప్ప స్వాములు, పర్యాటక యాత్రలు నిర్వహించే బృందాలు ఈ ప్రత్యేక బస్సు సౌకర్యాలను ముందుగానే వినియోగించుకోవాలని సూచించారు. కార్తీక మాసంలో పుణ్యక్షేత్రాల దర్శనానికి వెళ్లే భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడమే భద్రాచలం ఆర్టీసీ డిపో ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఆధ్యాత్మిక యాత్రలతో పాటు శబరిమల యాత్రలు, విజ్ఞాన విహార యాత్రలకు కూడా ఆర్టీసీ సేవలను అందుబాటులో ఉంచుతున్నామని, ప్రయాణికులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని భద్రాచలం ఆర్టీసీ డిపో మేనేజర్ జంగయ్య కోరారు.

మెజిస్ట్రేట్ దంతూరి సత్తయ్య గౌడును కలిసిన అఖిల భారత గౌడ సంఘం నాయకులు

యాదాద్రి భువనగిరి జిల్లా, వుదయం ప్రతినిధి



యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పట్టణ కేంద్రంలో రామన్నపేట కోర్టు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ దంతూరి సత్తయ్య గౌడ్ను అఖిలభారత గౌడ సంఘం నాయకులు వారి నివాసంలో మర్యాదపూర్వక ంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి సాల్వతో సన్మానించారు అనంతరం నాయకులు అఖిలభారత గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ దంతూరి సత్తయ్య గౌడ్ రాబోయే రోజుల్లో అంచలంచలుగా ఎదిగి ఎన్నో పదవులు అధిరోహించి గౌడ కులం పేరు ప్రతిష్టలు పెంపొందించారు ఆకాంక్షిస్తూ వారికి అభినందనలు తెలిపారు ఈ కార్యక్రమంలో అఖిలభారత గౌడ సంఘం మహిళా విభాగం జాతీయ కార్యదర్శి చింతలూరి దీప దేవి అఖిలభారత గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నాయన పల్లి శ్రీనివాస్ గౌడ్ రంగారెడ్డి జిల్లా అఖిల భారత్ అధ్యక్షులు పాండాల దశరథ గౌడ్ అఖిల భారత గౌడ సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా ఉపాధ్యక్షులు దంతూరి రాములు గౌడ్ జీవగానే శంకర్ గౌడ్ గ్రేటర్ హైదరాబాద్ మీడియా విభాగం కోకన్వీనర్ పోనీ నవీన్ గౌడ్ తదితరులు మెజిస్ట్రేట్ దంతూరి సత్తయ్య గౌడ్ ని అభినందించారు

తెలంగాణ మండల జిల్లా సమాఖ్య ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే జారె వినతి

సీపీఓ హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని పి ఆర్ & ఆర్ డి కమిషనర్‌కు విజ్ఞప్తి

దమ్మపేట నవంబర్ 12 (వుదయం ప్రతినిధి):



హైదరాబాద్ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మండల / జిల్లా సమాఖ్యలకు చెందిన అకౌంటెంట్స్ ఆపరేటర్స్ అటెండర్స్ మరియు ఇతర ఉద్యోగులతో కలిసి తెలంగాణ పంచాయతీరాజ్ రూరల్ డెవలప్మెంట్ కమిషనర్ దివ్య దేవరాజన్ ను కలిశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లి సి బి ఓ హెచ్ ఆర్ పాలసీని అమలు చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు ఉద్యోగులకు న్యాయం జరిగేలా సంబంధిత సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

గంజాయి చాక్లెట్లకు దూరంగా ఉండాలి

యాదాద్రి భువనగిరి జిల్లా. వుదయం ప్రతినిధి



మాదక ద్రవ్యాలకు అలవాటుపడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, గంజాయి చాక్లెట్లతో పాటు ఎలాంటి మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దని పోలీస్ అధికారులు విద్యార్థులకు పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగంపై పోలీస్ శాఖ ప్రత్యేక నిఘా (Police Surveillance) ఏర్పాటు చేసిందని, ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ, మంగ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆలేరు పట్టణంలోని దినేష్ గార్డెన్‌లో నిర్వహించిన విద్యార్థి యువ సమ్మేళనానికి ఆలేరు పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లోని వివిధ పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాదక ద్రవ్యాల దుష్పరిణామాలు, విద్య ప్రాముఖ్యత, వ్యక్తిత్వ వికాసం, సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఏఎస్పీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. నేటి సమాజంలో మాదక ద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తుకు పెను ప్రమాదంగా మారుతోందన్నారు. డీఎస్పీ పి. శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ.. విద్యార్థులు ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా తల్లిదండ్రులను, విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఎప్పటికీ మర్చిపోవద్దని సూచించారు. తమ కోసం ఎన్నో కష్టాలు పడుతూ విద్యను అందిస్తున్న తల్లిదండ్రులను గౌరవించాలని అన్నారు. తల్లిదండ్రులు ఉన్నత ఉద్యోగాల్లో లేకపోయినా తమ కష్టార్జితంతో పిల్లలను మంచి వ్యక్తులుగా తీర్చిదిద్దుతున్నారని గుర్తుచేశారు. సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలు, ఇతర సామాజిక దుష్ప్రభావాల నుంచి యువత దూరంగా ఉండాలంటే ముందుగా బలమైన వ్యక్తిత్వాన్ని, మంచి నడవడికను అలవర్చుకోవాలని సూచించారు. మానసికంగా దృఢంగా, నైతిక విలువలతో ఉన్న విద్యార్థులు చెడు అలవాట్లకు ఆకర్షితులు కారని పేర్కొన్నారు.ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉద్యోగాలే గొప్పవి కావని, ఎలక్ట్రీషియన్, స్వీపర్, అటెండర్ ఇలా ఏ వృత్తిలో ఉన్నా నిజాయితీగా పనిచేస్తూ సమాజంలో గౌరవంగా జీవించడమే గొప్ప విషయమని అన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగి తల్లిదండ్రులకు, సమాజానికి, దేశానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు.

రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు పులిపలుపుల మహేష్ గౌడ్ మాట్లాడుతూ.. తమ సంస్థ ప్రధాన ఆశయాలు జ్ఞానం, శీలం, ఏకత అని వివరించారు. కేవలం చదువుతోనే కాకుండా మంచి వ్యక్తిత్వం, సామాజిక అవగాహన, ఐక్యతతో కూడిన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు.గత ఆరేళ్లుగా సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అవసరమైన వారికి వైద్య సేవల్లోనూ సహకారం అందిస్తున్నామని చెప్పారు. విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, నైతిక విలువలు పెంపొందించడమే కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని వివరించారు.ఈ కార్యక్రమానికి అవకాశం కల్పించిన మంగ ఫౌండేషన్, రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులకు పోలీస్ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సంస్థ ప్రతినిధులు, అతిథులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట డీఎస్పీ పి. శ్రీనివాస్ నాయుడు, ఏఎస్పీ లక్ష్మీనారాయణ, యాదగిరిగుట్ట సీఐ ఎం. శంకర్ గౌడ్, ఆలేరు ఎస్‌హెచ్‌ఓ ఎస్. ఉదయ కిరణ్, ఎస్ఐ ఎన్. వినయ్, రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు పులిపలుపుల మహేష్ గౌడ్, బిజ్జారి పోశెట్టి, మంగ అరవిందర్, మంగ నరసింహులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు ఆధునిక వ్యవసాయంపై అవగాహన కల్పించడమే అగ్రిషో లక్ష్యం

- 125 స్టాళ్లతో మూడు రోజుల పాటు వ్యవసాయ ప్రదర్శన
- రైతులు, పట్టణ ప్రజలు అగ్రిషోను సందర్శించి సద్వినియోగం చేసుకోవాలి :

మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి

నల్లగొండ నవంబర్ 12.

రైతాంగానికి ఆధునిక వ్యవసాయ పద్ధతులు, శాస్త్రీయ పరిజ్ఞానం, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిచయం చేయడమే లక్ష్యంగా మూడు రోజుల పాటు అగ్రిషో నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నంద్యాల నరసింహారెడ్డి తెలిపారు. ఈ నెల 14, 15, 16 తేదీల్లో నల్లగొండ పట్టణంలోని గడియారం సెంటర్‌లో నిర్వహించే అగ్రిషోను రైతులు, వ్యవసాయ అనుబంధ రంగాల వారు, పట్టణ ప్రజలు సందర్శించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గురువారం నల్లగొండలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, తుమ్మల వీరారెడ్డి, బండ శ్రీశైలం, ఎండీ హషం, పాలడుగు నాగార్జునతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండలో ఈ నెల 15 నుంచి 18 వరకు జరిగే అఖిల భారత రైతు సంఘం (ఏఐకేఎస్) 36వ జాతీయ మహాసభలు, 41వ జీఎం కన్వెన్షన్‌లో భాగంగా అగ్రిషో ఏర్పాటు చేసినట్లు వివరించారు.

125 స్టాళ్లు.. ఆధునిక పరికరాల ప్రదర్శన

ఈ నెల 14వ తేదీ ఉదయం 10 గంటలకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అగ్రిషోను ప్రారంభించనున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు ప్రదర్శన కొనసాగుతుందని చెప్పారు. మొత్తం 125 స్టాళ్లను ఏర్పాటు చేశామని, అవసరమైతే మరిన్ని స్టాళ్లు ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. వ్యవసాయానికి ఉపయోగపడే డ్రోన్లు, ట్రాక్టర్లు, ఆధునిక యంత్రాలు, నూతన విత్తనాలు, ఎరువులు, డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలు, వివిధ సాగునీటి పద్ధతులను ప్రదర్శనలో అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొన్నారు.

నీటి కొరతను అధిగమించే సాంకేతికతపై ప్రత్యేక దృష్టి

ప్రస్తుతం వ్యవసాయ రంగంలో నీటి కొరత ప్రధాన సమస్యగా మారిందని, అందుబాటులో ఉన్న కొద్దిపాటి నీటిని సమర్థంగా వినియోగించుకునే సాంకేతికతపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. డ్రిప్‌తో పాటు స్ప్రింక్లర్లు, జెట్, ఇతర సూక్ష్మ సాగునీటి పద్ధతులను ప్రదర్శనలో చూపించనున్నట్లు తెలిపారు.

జిల్లాలో సుమారు 15 వేల ఎకరాల్లో సాగవుతున్న పామాయిల్ పంటకు నీటి సమస్య పరిష్కార మార్గాలను వివరించేందుకు పామాయిల్ కంపెనీలు, పతంజలి సంస్థల స్టాళ్లను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

శాస్త్రవేత్తలతో నేరుగా సందేహాల నివృత్తి

రైతులకు అవసరమైన సమాచారం, సాంకేతిక పరిజ్ఞానంతో పాటు రుణ సదుపాయాలపై అవగాహన కల్పించేందుకు సీసీ బ్యాంకు స్టాల్ కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నర్సరీలు, హెర్బల్, ఆయుర్వేద ఉత్పత్తులకు సంబంధించిన స్టాళ్లు కూడా ఉంటాయని వెల్లడించారు.

నల్లగొండకు జాతీయ స్థాయి మహాసభల అవకాశం

దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాల నుంచి రైతు సంఘాల ప్రతినిధులు, రైతాంగ అనుభవజ్ఞులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు నల్లగొండకు రావడం జిల్లా రైతాంగానికి మంచి అవకాశమని నంద్యాల నరసింహారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది రైతులు, ముఖ్యంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన రైతులు ఈ కార్యక్రమాల్లో పాల్గొననున్నారని తెలిపారు. రైతులకు ఉపయోగపడే ప్రతి అంశాన్ని ప్రదర్శనలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. రైతులు మాత్రమే కాకుండా పట్టణ ప్రజలు సైతం ప్రదర్శనను సందర్శించి వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులను తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో రాము నాయక్ ఎండి సలీం వెంకట్ రెడ్డి, పుచ్చకాయ నర్సిరెడ్డి,నలపరాజు సైదులు, కొండ వెంకన్న,.పి సత్యనారాయణ కొండ వెంకన్నవి నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కలియుగ ప్రత్యక్ష దైవం స్వర్ణ గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి క్షేత్రం

యాదాద్రి భువనగిరి జిల్లా వుదయం ప్రతినిధి

కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణ గిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో సకల ప్రాణికోటికి ఆహార కొరత లేకుండా ఉండడం.స్వామివారికి జరిపే అన్నకూటోత్సవాన్నే తిరుప్పావడ అంటారు. ప్రతి గురువారం నైవేద్య సమయంలో తిరుప్పావడ జరుగుతుంది.అప్పుడు సుమారు 450 కిలోల అన్నప్రసాదాన్ని,లడ్డు,వడ,తదితర పిండి వంటలను శ్రీవారికి నైవేద్యం చేస్తారు.వేదమంత్రోచ్చారణలతో అర్చించి కర్పూరమంగళ హారతులు సమర్పించారు.



సీఎంని కలిసిన కుంభం అనిల్ కుమార్ రెడ్డి

యాదాద్రి భువనగిరి జిల్లా, వుదయం ప్రతినిధి

యాదాద్రి భువనగిరి జిల్లా శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని హైదరాబాదులోని జూబ్లీహిల్స్ తన నివాసంలో బుధవారం భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి కలిశారు ఈ సందర్భంగా నియోజక వర్గ పరిధిలోని తాజా రాజకీయ పరిస్థితులు పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు మౌలిక వసతుల కల్పన ప్రజా సమస్యల పరిష్కారానికి తగిన నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే గారు తెలిపారు.



ఆర్టిస్ట్ అసోసియేషన్ ఐదవ వార్షికోత్సవం సందర్భంగా పండ్లు పంపిణీ

యాదాద్రి భువనగిరి జిల్లా, వుదయం ప్రతినిధి

యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్టిస్ట్ అసోసియేషన్ ఐదవ వార్షికోత్సవం సందర్భంగా జిల్లా ఆర్టిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సామాజిక సేవలో భాగంగా భువనగిరి ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేయడం జరిగింది. మా కళారంగవృత్తిని నిర్వర్తించుకుంటూ సమాజ సేవలో పాల్గొనుచున్నందుకు చాలా సంతోషంగా ఉన్నది.ఇంకా మున్ముందు ఇలాంటి కార్యక్రమాలు ఎన్నో చేయాలని ఆలోచన చేస్తున్నాం .ప్రభుత్వ ఉద్యోగులు గాని, రాజకీయ నాయకులు గాని,సమాజంలో ఉన్నటువంటి ఏ ఇతర వ్యక్తులైన సరే మా కళాకారులకు సహకారం అందించినచో సమాజంలో ఉన్నటువంటి ప్రమాదాల నివారణ గురించి, నీటిని ఆదా చేయుట గురించి, గుట్కా, పొగాకు, గంజాయి నివారణ గురించి,విద్యుత్ ఆదా గురించి ,పర్యావరణ పరిరక్షణ గురించి ప్రజా చైతన్యం కోసం ఆలోచింప చేసే విధంగా వాల్ పేయింటింగ్స్ చేయడానికి మా అసోసియేషన్ కళాకారులందరం ఎల్లవేళలా ముందుంటాము. ఈ కార్యక్రమములో అసోసియేషన్ అధ్యక్షులు దేవరకొండ పోతులూరాచారి, ప్రధాన కార్యదర్శి తరణి వీరాచారి, కోశాధికారి జల్లా జహంగీర్, సలహాదారులు బోడిగె లింగం గౌడ్, రావులపల్లి బాలాచారి, తుడుం గణేష్, తిప్పారపు మల్లేష్, మరియు మాజీ అధ్యక్షులు కొమ్ము ప్రకాష్, భైరపాక లక్ష్మణ్, సభ్యులు త్రి దండపాణి సింహాద్రి, రాసాల గంగరాజు, కోటగిరి ఉపేందర్, కుక్కల వెంకటేశం, జింక కిషోర్, వలిగొండ వంశీ రామ్, గుండమల్ల నాగరాజు, గంధమల్ల వీరేశం, కట్టా నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రైతులందరూ రీ సర్వేకు సహకరించాలి



కలెక్టర్ బి. చంద్రశేఖర్

నల్గొండ వుదయం ప్రతినిధి

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించాలంటే రైతులందరూ భూముల రీ సర్వేకు సహకరించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. రైతుల మధ్య సమన్వయం ఉంటేనే భూ వివాదాలను పరిష్కరించడం సాధ్యమవుతుందని ఆయన అన్నారు. గురువారం నల్గొండ జిల్లా మునుగోడు మండలం సింగారం గ్రామంలో భూముల రీ సర్వేకు సంబంధించి జారీ చేసిన నోటీసులపై వచ్చిన అభ్యంతరాల పరిష్కారానికి నిర్వహించిన గ్రామసభకు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక తహసిల్దార్, చండూరు ఆర్డీవో శ్రీదేవి వివరాలు వెల్లడిస్తూ.. గ్రామంలో మొత్తం 255 ఖాతాలు ఉండగా, 417 ల్యాండ్ పార్సెల్ మ్యాపులు (ఎల్‌పీఎంలు) జారీ చేసినట్లు తెలిపారు. వాటిపై 59 అభ్యంతరాలు వచ్చినట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించామని, గ్రామకంఠం సరిహద్దులు, ప్రభుత్వ భూములు, రహదారులు, పట్టా భూములను సర్వే చేసి హద్దులు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అభ్యంతరాలు వ్యక్తం చేసిన రైతులతో కలెక్టర్ స్వయంగా మాట్లాడారు. భూ సమస్యల పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం రీ సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని, ఈ ప్రక్రియ ద్వారా పాత సమస్యలు పరిష్కారం కావాలే తప్ప కొత్త సమస్యలు తలెత్తకూడదని అన్నారు. రైతులందరూ సమన్వయంతో ప్రభుత్వానికి సహకరిస్తే గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. చట్ట ప్రకారమే భూముల హద్దులు నిర్ణయించి, అర్హులైన వారికి వారి భూములకు సంబంధించిన పట్టాలు అందజేస్తామని స్పష్టం చేశారు. సాధ్యమైనంత వరకు అభ్యంతరాలను తగ్గించుకోవాలని రైతులకు సూచించారు. రానున్న రోజుల్లో అభ్యంతరాల స్వీకరణకు కేవలం 25 రోజుల గడువు మాత్రమే ఉంటుందని తెలిపారు. రైతులు పక్కనున్న భూముల యజమానులతో సామరస్యంగా చర్చించుకుని, అనవసర వివాదాలకు వెళ్లకుండా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. గ్రామంలో మిగిలిపోయిన సర్వేను పూర్తి చేసేందుకు గ్రామస్తులందరూ సహకరించాలని, అందరి భాగస్వామ్యంతో సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ సహాయ కలెక్టర్ ఎన్. శ్రీకాంత్ రెడ్డి, చండూరు ఆర్డీవో శ్రీదేవి, స్థానిక సర్పంచ్ అండాలు, తహసిల్దార్, సర్వేయర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సకాలంలో రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

- మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి
- బాధిత కుటుంబాలను వెంటనే ఆదుకోమని

మంత్రి తుమ్మలతో ఫోన్ లో మాటామంతి

సత్తుపల్లి నవంబర్ 12 (వుదయం ప్రతినిధి)




ఇంకో రెండు, మూడు రోజుల్లో ఇంటికి వస్తుందనుకున్న ధాన్యం తుఫాను ప్రభావంతో కల్లాల్లోనే కళ్ళముందు నేలకొరిగి పనికిరాకుండా పోయిందని బీజేపీ జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.. తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించేందుకు గురువారం సత్తుపల్లి నియోజకవర్గంలో పర్యటించిన ఆయన స్థానిక వేశ్యకాంతల లోతట్టు ప్రాంతంలో వరద మునిగిన ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు.. బాధితుల గోడు విన్నారు.. తుఫాన్ బాధితులను సకాలంలో ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.. 90 శాతం దెబ్బతిన్న తల్లాడ, సత్తుపల్లి మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంను రాష్ట్రంలో అమలు చేయాలని కోరారు. ఆరు గ్యారెంటీలు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్ల అమలులో పారదర్శకత పాటించాలన్నారు.. సింగరేణి బాధిత గ్రామాల ప్రజలకు రక్షణ కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు.. పెద్ద ఎత్తున వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.. మెగా ఫుడ్ పార్క్ నిధులు, పెట్టుబడులు,ఉద్యోగాల వివరాలు వెల్లడించాలన్నారు.. పంట నష్టంపై యుద్ధ ప్రాతిపదికంగా సర్వే జరిపి బాధితులను ఆదుకోవాలని కోరారు.. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో ఫోన్ లో మాట్లాడుతూ తుఫాన్ బాధిత కుటుంబాలను వెంటనే ఆదుకోమని కోరారు.. ప్రజల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ మడమ తిప్పని పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఏ స్థాయిలో నిర్లక్ష్యం కనిపించినా సహించమన్నారు.. అంతకుముందు అయ్యప్ప స్వామి ఆలయంలో సాగిన దీక్షాదారుల బిక్షలో పాల్గొన్నారు కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి నంబూరి రామలింగేశ్వర రావు, జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరావు, జిల్లా నాయకులు భాస్కర్ని వీరంరాజు, భానోత్ విజయ్, నాయుడు రాఘవరావు, నున్నా రవి తదితరులు పాల్గొన్నారు.

అడ్డగోలు హామీలతో గద్దెనెక్కి.. ఆశాలను నిలువునా ముంచిన కాంగ్రెస్!

మాజీ మంత్రి జగదీశ్ రెడ్డికి వినతిపత్రం అందజేసిన ఆశా కార్యకర్తలు

సూర్యాపేట, నవంబర్ 12 : వుదయం ప్రతినిధి



అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలతో పాటు ఆశా కార్యకర్తలను నిలువునా మోసం చేసిందని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆశా కార్యకర్తలు మండిపడ్డారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 15 నుంచి నిర్వహించనున్న నిరవధిక సమ్మె సందర్భంగా గురువారం మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్రెడ్డికి స్థానిక క్యాంపు కార్యాలయంలో సమ్మె నోటీసు, వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఆశా కార్యకర్తలు మూడేళ్ళుగా ఇచ్చిన హామీలు అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ కంటికి రెప్పలా కాపాడుకుంటే రేవంత్రెడ్డి మాత్రం ఆశాల చావు కోరుతున్నాడన్నారు. జీతాలు సక్కగా ఇవ్వడం చేతకాదు కానీ ప్రమాదభీమా మాకెందుకన్నారు. ఆశా వర్కర్లకు ఇనర్సురెన్స్ 50లక్షలు, మట్టి ఖర్చులు రూ 50వేలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ 5 లక్షలు, రిటైర్మెంట్ తరువాత వేతనంలో 50శాతం పెన్షన్, ప్రతి ఆదివారం, పండుగ రోజులకు సెలవులు, సంవత్సరంలో 20రోజులు క్యాజువల్ లీవ్, 6నెలలు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు, ఏఎన్ఎం జీఎన్ఎం ట్రైనింగ్ చేసిన ఆశాలకు పదోన్నతి, రెండో, పీఆర్సీలో ఆశా వర్కర్లకు కనీస వేతనం 30వేలు కేటాయించి ప్రభుత్వం ప్రకటించిన రెండు డీఏలను ఆశాలకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బేషరతుగా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని ఈ నెల 15 నుంచి నిరవధిక రక సమ్మె నిర్వహిస్తున్నామని హామీలు అమలయ్యే వరకు సమ్మె విరమించేది లేదన్నారు. సమ్మెకు మద్దతిచ్చి ఆశాలకు అండగా నిలువాలని మాజీ మంత్రి జగదీష్ రెడ్డిని కోరారు. ఆశా వర్కర్ల వినతికి సానుకూలంగా స్పందించిన మాజీ మంత్రి జగదీష్ రెడ్డి ఆశా వర్కర్లవి న్యాయమైన సమస్యలని కనీస వేతనంతో పాటు ఇతర సమస్యలపై ప్రశ్నించి అమలుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్, డీఎంహెచ్ కు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ టి యు జిల్లా అధ్యక్షులు వెంపటి గురూజీ, హుజూర్ నగర్ నియోజకవర్గ అధ్యక్షులు పచ్చిపాల ఉపేందర్, బిఆర్టియు జిల్లా కన్వీనర్ మేకల జయమ్మ, ఎఐటియుసి జిల్లా అధ్యక్షురాలు నకిరెకంటి కవిత, సీత, విజయ, అరుణ, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో నాకు సుదీర్ఘ కాలంగా అనుబంధం ఉంది. మీడియా ప్రపంచంలో సాధ్యం కానిదంటూ ఏదీ లేదు. విపత్తులు,సంక్షోభాల సమయంలో క్షేత్రస్థాయిలో పని చేసే రిపోర్టర్లు కథనాల కోసం ఎంతదూరమైన వెళ్తారు. బిజెపిలో చేరిన తొలినాళ్లలో మీడియా ఈవెంట్ల కోసం కుర్చీలు వేసే బాధ్యత నాదే. గడిచిన కొన్నేళ్లలో జర్నలిజంలో ఎన్నో మార్పులు వచ్చాయి. సాంకేతికత ఎంతో అభివృద్ధి జరిగింది. ఒకప్పుడుమీడియా సమావేశాల ప్రసారం కోసం అవుట్ సైడ్ బ్రాడ్‌కాస్ట్ వ్యాన్లను ఉపయోగించేవారు. ఇప్పుడు మొబైల్ ఫోనే ఈ వాహనంగా మారిపోయింది.

- నరేంద్ర మోడీ, ప్రధాని


వే'మన' పద్యం

తప్పలెన్నువారు తండోప తండంబు

లుర్విజనులకెల్ల నుండు తప్ప

తప్పలెన్నువారు తమతప్పలెరుగరు

విశ్వదాభిరామ వినురవేమ



సంపాదకీయం


ట్రంప్‌నకు ప్రజల హెచ్చరిక!

ప్రపంచవ్యాప్తంగా రాజకీయ అధికారం కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమవుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థల స్వతంత్రతకు సవాళ్లు ఎదురవుతున్న ప్రస్తుత తరుణంలో అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాలు రాజ్యాంగ విలువల ప్రాధాన్యతను మరోసారి గుర్తుచేస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో అధికారం శాశ్వతం కాదని, ప్రజల తీర్పే అంతిమమని ఈ ఎన్నికలు చాటిచెప్పాయి. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నాయకత్వంలోని రిపబ్లికన్ పార్టీకి ఎదురైన రాజకీయ ఎదురుదెబ్బను కేవలం ఎన్నికల పరాజయంగా చూడలేం. అది ప్రభుత్వ విధానాలపై ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తికి, అధికారంపై నియంత్రణ ఉండాలన్న ప్రజాస్వామ్య ఆకాంక్షకు ప్రతిబింబం.పెరుగుతున్న జీవన వ్యయం, ద్రవ్యోల్బణం, అంతర్జాతీయ యుద్ధాలు, వాణిజ్య వివాదాలు, భారీ దిగుమతి సుంకాలు అమెరికా ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయి. యుద్ధాలను ముగిస్తానని, అమెరికా ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తానని హామీ ఇచ్చిన ట్రంప్ ఆచరణలో అనుసరిస్తున్న విధానాలు అంతర్జాతీయంగా అనిశ్చితిని పెంచుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తాయి. ప్రజల ఆర్థిక ఇబ్బందులు, ప్రభుత్వ నిర్ణయాలపై అసంతృప్తి ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేశాయి. ప్రజాస్వామ్యంలో పాలకుల విధానాలను సమర్థించాలా, తిరస్కరించాలా అన్న నిర్ణయాధికారం ప్రజల చేతుల్లోనే ఉంటుందని ఈ తీర్పు నిరూపిస్తోంది.ఎన్నికల ఫలితాల అనంతరం కాంగ్రెస్‌లో ప్రతిపక్షానికి లభించే ప్రాధాన్యత అత్యంత కీలకం. ప్రభుత్వ విధానాలను సమీక్షించడం, అధ్యక్షుడి అధికార వినియోగాన్ని ప్రశ్నించడం, ప్రభుత్వ నియామకాలను పరిశీలించడం, పరిపాలనా వ్యవహారాలపై విచారణలు చేపట్టడం వంటి రాజ్యాంగబద్ధమైన బాధ్యతలను కాంగ్రెస్ సమర్థంగా నిర్వహించాలి. ప్రజాస్వామ్యంలో అధికార పార్టీకి సంపూర్ణ స్వేచ్ఛ ఉండదు. అధికార దుర్వినియోగాన్ని నిరోధించే వ్యవస్థలు బలంగా ఉన్నప్పుడే పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం సాధ్యమవుతాయి.

అదే సమయంలో ప్రజల నుంచి లభించిన మద్దతును రాజకీయ విజయంగా మాత్రమే భావించకుండా, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచే విధానాల రూపకల్పనకు ప్రతిపక్షం వినియోగించుకోవాలి.ద్రవ్యోల్బణం, ఉపాధి, ఆరోగ్యం, విద్య, సామాజిక భద్రత వంటి ప్రజా సమస్యలకు పరిష్కారాలు చూపాలి. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణతోపాటు మానవ హక్కులు, పత్రికా స్వేచ్ఛ, న్యాయవ్యవస్థ స్వతంత్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి.ప్రభుత్వాన్ని ప్రశ్నించే మీడియాపై కక్ష సాధింపు చర్యలు, పాత్రికేయులపై దాడులు, ప్రజాస్వామ్య సంస్థలపై రాజకీయ ఒత్తిళ్లు ఏ దేశానికైనా ప్రమాదకరమే. ప్రభుత్వాన్ని ప్రశ్నించే స్వేచ్ఛను కాపాడటం ప్రజాస్వామ్యానికి ప్రాణాధారం.

అంతర్జాతీయ పరిణామాల దృష్ట్యా కూడా ఈ ఎన్నికల ఫలితాలకు ప్రాధాన్యత ఉంది. ముఖ్యంగా ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు,అంతర్జాతీయ వాణిజ్య సంబంధాలు అమెరికా విదేశాంగ విధానాన్ని ప్రభావితం చేస్తున్నాయి. కొత్త కాంగ్రెస్ అంతర్జాతీయ శాంతి, సహకారం, మానవ హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలన్న ఆశాభావం వ్యక్తమవుతోంది. అయితే దేశీయ రాజకీయాల్లో ఎదురైన ఎదురుదెబ్బతోనే అధ్యక్షుడి విదేశాంగ విధానంలో మార్పు వస్తుందని భావించడం సరికాదు. విదేశాంగ, రక్షణ వ్యవహారాల్లో అధ్యక్షుడికి ఉన్న విస్తృత అధికారాలు అంతర్జాతీయ పరిణామాలపై ప్రభావం చూపగలవు.అమెరికా రాజ్యాంగ వ్యవస్థ ప్రత్యేకత అధికారాల విభజన, పరస్పర నియంత్రణ, జవాబుదారీతనంలో ఉంది. శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలు తమ పరిధుల్లో స్వతంత్రంగా వ్యవహరిస్తూ ఒకదానిపై మరొకటి నియంత్రణ కలిగి ఉండటం ప్రజాస్వామ్యానికి రక్షణ కవచం. ఎన్నికలు నిర్వహించడం మాత్రమే ప్రజాస్వామ్యం కాదు. ఎన్నికల ద్వారా ఏర్పడిన ప్రభుత్వం రాజ్యాంగ పరిమితులకు లోబడి పనిచేసేలా చూడటం కూడా అంతే ముఖ్యం. ఈ విషయంలో అమెరికా ఎన్నికలు ప్రపంచ దేశాలకు ఒక ముఖ్యమైన పాఠాన్ని అందిస్తున్నాయి.అమెరికా గొప్పతనం కేవలం సైనిక బలంలోనో, ఆర్థిక ఆధిపత్యంలోనో లేదు. ప్రజాస్వామ్య విలువలను గౌరవించడం, అంతర్జాతీయ సహకారాన్ని ప్రోత్సహించడం, ఇతర దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవించడం, ప్రపంచ శాంతికి కృషి చేయడంలోనే నిజమైన గొప్పతనం ఉంది. ఎన్నికల తీర్పు ద్వారా ప్రజలు పాలకులకు ఇచ్చిన సందేశాన్ని అర్థం చేసుకుని, ఆధిపత్య ధోరణులకు స్వస్తి పలికి సహకారం, సహజీవనం దిశగా అమెరికా అడుగులు వేయాలి. అప్పుడే ఈ ఎన్నికల తీర్పు కేవలం రాజకీయ మార్పునకు కాకుండా ప్రపంచ శాంతికి కూడా నిజమైన

రచనలు పంపండి



వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

దేశవ్యాప్తంగా కమ్ముకున్న మహమ్మారి ! కరువు !

నవంబర్ 2026 నాటికి ఎల్ ని నో ప్రభావం వల్ల భారత దేశంలో రుతుపవనాలు అత్యంత అస్థిరంగా, దారుణంగా మారుతున్నాయని వర్షపాతగణాంకాలు తెలియజేస్తున్నాయి. దేశం లోని వర్షాధార వ్యవసాయంపైతీవ్ర ప్రభావం చూపుతున్నది. దీని తోడు కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వవిధానాలు కరువు విస్తరణను పెంచుతూ ఉంది. ఐ ఐ టి గాంధి నగర్ యొక్కఇండియా డౌట్ మానిటర్ తాజా గణాంకాల ప్రకారం దేశంలోని సుమారు49.6% (దాదాపు సగం)భూభాగం ప్రస్తుతం కరువు పరిస్థితుల్లో ఉంది.రాష్ట్రాల వారిగా ప్రస్తుత కరువు పరిస్థితులు : మహారాష్ట్రమరియు కర్ణాటక, పశ్చిమ మరియు దక్షిణ భారతదేశంలో కరువు తీవ్రతఅత్యధికంగా ఉంది. మహారాష్ట్ర లో 82.4% కరువు ప్రభావానికి గురైంది.మహారాష్ట్ర లో 265 తాలూకాలు, కర్ణాటక లో 217 తాలూకాలను ఇప్పటికేఅధికారికంగా ప్రభుత్వాలు కరువును ప్రకటించాయి. ఆంధ్రప్రదేశ్ లోఖరీఫ్ సీజన్ కు గాను 412 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించగా ,
తెలంగాణలో 365 మండలాలను కరవు మండలాలు ప్రకటించబడ్డాయి.రాయలసీమ మరియు దక్షిణ తెలంగాణ ప్రాంతాల్లో భూగర్భ జలాలు పడిపోయాయి.ఈశాన్య భారతం లో దాదాపు 74% భూభాగం లో తీవ్ర కరువు
పరిస్థితులను నెలకొన్నాయి. ముఖ్యంగా గోవాలో 91.6% భూభాగం,
మణిపూర్ లో 82.7% భూభాగం, అస్సాంలో 82.7% భూభాగం, అరుణాచల్
ప్రదేశ్ లో 84.9% భూభాగం తీవ్ర కరువు పీడిత ప్రాంతంగా ఉంది.రాజస్థాన్ వాయవ్య ప్రాంతంలో వర్షపాత లోటు 22% కి చేరుకోవడంతో
పంట నష్టాలపై సర్వేలు నిర్వహిస్తున్నారు.
ఉత్తరాది రాష్ట్రాల్లో ఇండియా డౌట్ మానిటర్ గణాంకాలప్రకారం 43% మరియు వాయవ్య ప్రాంతంలో 29% భూభాగం అసాధారణ పొడివాతావరణం లేదా కరువు పరిస్థితుల పరిధిలో ఉంది. హర్యానా, పంజాబ్రాష్ట్రాలు దేశంలో కీలక వ్యవసాయ రాష్ట్రాల గా ఉన్నాయి. ఈరాష్ట్రాల్లో తీవ్ర వర్షపాత లోటు ఏర్పడింది. పంజాబ్ లో 80%భూభాగం, హర్యానా లో 76.5% భూభాగం కరువు పరిస్థితుల్లో ఉంది. అక్కడి
రైతులు విస్తృతంగా ట్యూబ్ వెల్స్ మరియు కాల్వల వ్యవస్థ పైఆధారపడి ఖరీఫ్ పంటలను కాపాడుకోగలిగినా ,దాని వల్ల భూగర్భ జలాలుప్రమాద స్థాయికి పడిపోయాయి. బీహార్ రాష్ట్రంలో దాదాపు 32%వర్షపాత లోటుతో కరువు నెలకొని ఉంది.ఇండియా డౌట్ మానిటర్ నివేదికలే కాకుండా ఇంకా అనేక సంస్థలు దేశకరువు పై నివేదికలు ఇచ్చాయి. యూ ఎస్ వ్యవసాయ గ్లోబల్
అగ్రికల్చర్ ఇన్ఫర్మేషన్ నెట్ వర్క్ అంతర్జాతీయ నివేదిక ప్రకారం
భారతదేశం 2001 సంవత్సరం తర్వాత నమోదు అయిన నాల్గవ అత్యల్ప
రుతుపవనాల సీజన్ గా ప్రస్తుత కరువును పేర్కొంది. స్పియర్ ఇండియానివేదికలో కర్ణాటక, మహారాష్ట్ర,, ఆంధ్రప్రదేశ్ వంటిరాష్ట్రాల్లో లక్షలాది హెక్టార్ల లో పంటలకు నష్టం వాటిల్లిందని, గ్రామీణ ప్రాంతాల్లో తాగు నీటి ఎద్దడి పెరిగి బోరుబావులు ఎండిపోయాయని పేర్కొంది.ఎక్కువ కాలం వర్షం పడకపోవడం, ఆ తర్వాత కొద్ది రోజులు భారీవర్షాలు పడి ఆ తర్వాత మరలా వర్షం పడక పోవడం వల్ల భూగర్భ జలాలు
పెరగడం లేదు. ఫలితంగా ఆ వర్షాల వల్ల కరువు పరిస్థితుల్లో మార్పులేవి జరగలేదు. గత మూడు సంవత్సరాల్లో ప్రభుత్వం ఉపాధి హామీ వంటి పథకాల
ద్వారా నీటి సంరక్షణ కోసం 1.34 లక్షల కోట్లకు పైగా ఖర్చుచేసినప్పటికీ తీవ్ర వర్షాభావ సమయాల్లో ఈ నిర్మాణాలు ఆశించిన స్థాయిలో భూగర్భ జలాలను రీఛార్జ్ చేయలేకపోయాయని పరిశోధనలు
తెలుపుతున్నాయి. ఈ ఖర్చు నిరుపయోగంగా మారింది.సేద్యం తగ్గుదల : ఎల్ ని నో ప్రభావం మరియు కరువు పరిస్థితుల
వల్ల సేద్య విస్తీర్ణం అపారంగా తగ్గింది. కేంద్ర వ్యవసాయమంత్రిత్వ శాఖ మరియు అంతర్జాతీయ నివేదికల ప్రకారం దేశంలో ఖరీఫ్ సాగు విస్తీర్ణంలో సుమారు 88 లక్షల హెక్టార్ల సాగు తగ్గింది.రబీసాగు లో కూడా ప్రారంభం లోనే 46% వెనుకబడిన పరిస్థితి ఉంది. 202627
సంవత్సరంలో దేశ ఆహార ధాన్యాల ఉత్పత్తి లక్ష్యం 373.93 మిలియన్ టన్నులుగా ఉంటే, కరువు
పరిస్థితుల వల్ల ఆ లక్ష్యాన్ని తగ్గించారు.
దేశంలో అత్యంత కీలకమైన ప్రధాన ఆహార పంట వరి సేద్యం దేశ వ్యాపితంగా 3.7% తగ్గింది. సేద్య
లక్ష్యం 408.72 లక్షల హెక్టార్లు కాగా, అందులో 14.37 లక్షల హెక్టార్ల సేద్యం తగ్గింది. మొక్కజొన్న గతఏడాది 93.87 లక్షల హెక్టార్లు కాగా నేడు 89.99 లక్షల హెక్టార్లకు తగ్గింది. గోధుమ గత ఏడాది 3.34లక్షల హెక్టార్ల లో విత్తనాలు వేయగా, ఈ సంవత్సరం ఇప్పటికి కేవలం 19 వేల హెక్టార్ల లో మాత్రమే సాగుప్రారంభమైంది. ఆవాలు, నూనె గింజల సాగు వేగంగా పడిపోయింది. ముఖ్యంగా రాజస్థాన్ లో 59.6%,హర్యానా లో 72% లోటుతో, దేశ వ్యాప్తంగా నూనె గింజల సాగు 45.71% తగ్గింది.దేశంలో కరువు ప్రభావం వ్యవసాయాన్ని, పశుపోషణను తీవ్ర సంక్షోభంలోకి నెట్టి వేస్తున్నది.ఫలితంగా ఆహార ధాన్యాల, ఆహార ఉత్పత్తుల కొరత ఏర్పడి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి.ఆకలితో మరణాలు సంభవిస్తున్నాయి. తాగడానికి నీరు కూడా లేని పరిస్థితి ఎర్పడింది. ముఖ్యంగానగరాల్లో తీవ్ర నీటి కొరత ఏర్పడింది. హైద్రాబాద్ నగరంలో నీరు లేక హాస్టళ్ల పిల్లలను ఇంటికిపంపుతున్నారు. మరో వైపు భూమి, ఖనిజాలు, అడవులు, సహజ వనరులు సామ్రాజ్యవాదులకు,కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం వల్ల పర్యావరణ విధ్వంసం జరుగుతున్నది. కరువు మహమ్మారిని
ఎదుర్కోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమైనాయి. పాలకుల విధానాలను వ్యతిరేకిస్తూ,కరువు సహాయక చర్యలు వెంటనే చేపట్టాలని దేశ వ్యాప్తంగా ప్రజలు సంఘడితపడి ఉద్యమించాలి.



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్

నాగలి నుంచి నినాదం వరకు.. రైతాంగ పోరాటం"

నాగలి పట్టిన చేతులే నవ సమాజ నిర్మాతలు!
చెమట చుక్కలతో చరిత్ర రాసిన రైతన్నలు!!
భూమి కోసం.. భుక్తి కోసం.. విముక్తి కోసం!
అన్యాయపు సంకెళ్లపై సమరశంఖం పూరించారు!!
1936లో పురుడు పోసుకున్న కిసాన్ సభ!
కర్షకుల గుండెల్లో ఆశల జ్యోతిని వెలిగించింది!!
దోపిడీ దొరల పెత్తనాన్ని ఎదిరిస్తూ!
రైతు హక్కుల సాధనకు ఉద్యమ బాట పట్టింది!!
వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా గళమెత్తి!
భూస్వామ్య పెత్తనంపై పిడికిలి బిగించి!!
తెలంగాణ గడ్డపై వీర పోరాటం సాగించి!
త్యాగాల చరిత్రలో సువర్ణాక్షర రాలై నిలిచింది!!
ఎర్రజెండా నీడలో రైతన్నల ఐక్యత!
అన్యాయంపై అలుపెరుగని పోరాట శక్తి!!
చలిని లెక్కచేయక.. కష్టాలను సహించక!
2020–21లోనూ రైతాంగం గర్జించింది!!
పండించే వాడికి పంటపై హక్కు కావాలి!
రైతు శ్రమకు తగిన గిట్టుబాటు ధర రావాలి!!
అప్పుల బాధలు తొలగి అన్నదాతలు ప్రాణంతో ఉండాలి!
రైతు కన్నీటి చుక్కలు ఆనంద బిందువులవ్వాలి!!
కిసాన్ సభా! నీ పోరాట స్ఫూర్తి అజరామరం!
రైతు ఐక్యతే సమసమాజ నిర్మాణానికి ఆధారం!!
రైతు బతికితేనే దేశం బతుకుతుంది!
అన్నదాత గెలిస్తేనే భారతం వెలుగుతుంది!!



డా. పూసపాటి వేదాద్రి
9912197694

నవభారత దార్శనికుడు.. చిన్నారుల చాచా!

భారతదేశ చరిత్రలో కొన్ని వ్యక్తిత్వాలు కేవలం పదవులతోనో, రాజకీయ విజయాలతోనో గుర్తుండిపోవు. దేశ భవిష్యత్తుకు వారు వేసిన పునాదులు, సమాజానికి అందించిన ఆలోచనలు తరతరాలపాటు స్ఫూర్తినిస్తాయి. అలాంటి అరుదైన నాయకుల్లో భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఒకరు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, దార్శనికుడిగా, రచయితగా, ఆధునిక భారత నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన నేతగా ఆయనకు ప్రత్యేక స్థానం ఉంది. నవంబర్ 14 ఆయన జయంతి. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా బాలల దినోత్సవాన్ని జరుపుకుంటాం.

1889 నవంబర్ 14న ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్‌లో సంపన్న న్యాయవాది మోతీలాల్ నెహ్రూ, స్వరూపరాణి దంపతులకు జవహర్‌లాల్ నెహ్రూ జన్మించారు. చిన్ననాటి నుంచే విద్య, విజ్ఞానంపై ఆసక్తి చూపిన ఆయన ప్రాథమిక విద్యను ఇంటివద్దే అభ్యసించారు. అనంతరం ఇంగ్లండ్‌లోని హారో పాఠశాలలో, కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యను అభ్యసించారు. ఇన్నర్ టెంపుల్‌లో న్యాయశాస్త్ర విద్య పూర్తిచేసి 1912లో భారతదేశానికి తిరిగివచ్చారు. అయితే న్యాయవాద వృత్తికంటే దేశ స్వాతంత్ర్య పోరాటమే ఆయనను ఎక్కువగా ఆకర్షించింది.

1916లో మహాత్మాగాంధీని తొలిసారిగా కలుసుకున్న నెహ్రూ, ఆయన నాయకత్వంలో స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. రైతులు, కార్మికుల సమస్యలపై పోరాడారు. సహాయ నిరాకరణ ఉద్యమం, శాసనోల్లంఘన ఉద్యమం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించారు. బ్రిటిష్ పాలకులు పలుమార్లు ఆయనను జైలుకు పంపారు. స్వాతంత్ర్యం కోసం తన జీవితంలో సుదీర్ఘకాలాన్ని కారాగారంలోనే గడిపారు. 1929లో లాహోర్‌లో జరిగిన కాంగ్రెస్ మహాసభకు అధ్యక్షత వహించిన ఆయన సంపూర్ణ స్వరాజ్య తీర్మానానికి నాయకత్వం వహించారు.

1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం లభించిన అనంతరం తొలి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నెహ్రూ, అనేక సవాళ్ల మధ్య నవభారత నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక న్యాయం, శాస్త్రీయ దృక్పథం వంటి విలువలకు ప్రాధాన్యతనిచ్చారు. కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా భారతీయులందరూ సమాన గౌరవంతో జీవించాలన్నది ఆయన ఆకాంక్ష. పేదరికం, నిరక్షరాస్యత, సామాజిక అసమానతలను అధిగమించకుండా దేశం నిజమైన అభివృద్ధిని సాధించలేదని ఆయన విశ్వసించారు. ఆర్థిక స్వావలంబన కోసం పంచవర్ష ప్రణాళికలకు ప్రాధాన్యతనిచ్చారు. భారీ పరిశ్రమలు, విద్యుత్ ప్రాజెక్టులు, ఆనకట్టలు, శాస్త్ర సాంకేతిక సంస్థల అభివృద్ధికి కృషి చేశారు. ఐఐటీలు, అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) వంటి ఉన్నత విద్య, వైద్య సంస్థల అభివృద్ధికి ఆయన హయాంలో పునాదులు పడ్డాయి. అంతర్జాతీయంగా పంచశీల సూత్రాలు, అలీనోద్యమం ద్వారా ప్రపంచ శాంతి, దేశాల మధ్య సహకారం, స్వతంత్ర విదేశాంగ విధానానికి ప్రాధాన్యత కల్పించారు. ఆధునిక భారతదేశం శాస్త్ర సాంకేతిక రంగాల్లో ముందుకు సాగేందుకు అవసరమైన సంస్థాగత పునాదుల నిర్మాణంలో ఆయన పాత్ర విశేషమైనది.


నెహ్రూ వ్యక్తిత్వంలో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అంశం పిల్లల పట్ల ఆయనకున్న అపారమైన ప్రేమ. పిల్లలను ఆయన కేవలం కుటుంబాల సంపదగా కాకుండా దేశ భవిష్యత్తును నిర్మించే శక్తిగా భావించేవారు. పిల్లలతో కలిసిమెలిసి మాట్లాడటం, వారితో సమయం గడపడం ఆయనకు ఎంతో ఇష్టం. అందుకే చిన్నారులు ఆయనను ఆప్యాయంగా 'చాచా నెహ్రూ' అని పిలిచేవారు. బాలల పట్ల ఆయన చూపిన ప్రేమాభిమానాలకు గుర్తుగా ఆయన జన్మదినమైన నవంబర్ 14ను భారతదేశంలో బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నాం.

పిల్లల అభివృద్ధికి విద్యే ప్రధాన ఆయుధమని నెహ్రూ బలంగా విశ్వసించారు. బాల్యంలోనే శాస్త్రీయ ఆలోచన, ప్రశ్నించే తత్వం, సృజనాత్మకత, మానవీయ విలువలు అలవడాలని ఆకాంక్షించారు. ప్రతి చిన్నారికి విద్యావకాశాలు అందాలని, పేదరికం కారణంగా ఏ ఒక్కరూ చదువుకు దూరం కాకూడదని భావించారు. పాఠశాలలు, ఉన్నత విద్యాసంస్థల విస్తరణకు ప్రాధాన్యతనిచ్చారు. విద్యతోపాటు ఆరోగ్యం, పోషకాహారం, క్రీడలు, సాంస్కృతిక వికాసం కూడా పిల్లల సమగ్ర ఎదుగుదలకు అవసరమని ఆయన ఆలోచనలు సూచిస్తాయి.

జైలులో ఉన్న సమయంలో తన కుమార్తె ఇందిరా ప్రియదర్శినికి నెహ్రూ రాసిన ఉత్తరాలు ప్రపంచ చరిత్ర, నాగరికతలు, ప్రకృతి, సమాజం, మానవ విలువలపై గొప్ప అవగాహనను కలిగించాయి. ఆ ఉత్తరాలే 'లెటర్స్ ఫ్రమ్ ఎ ఫాదర్ టు హిస్ డాటర్' గ్రంథంగా వెలువడ్డాయి. అంతేకాదు, 'గ్లింప్సెస్ ఆఫ్ వరల్డ్ హిస్టరీ', 'ది డిస్కవరీ ఆఫ్ ఇండియా', 'యాన్ ఆటోబయోగ్రఫీ' వంటి రచనలతో చరిత్ర, సమాజం, ప్రజాస్వామ్యం, మానవ నాగరికతలపై తన ఆలోచనలను ప్రపంచానికి పరిచయం చేశారు. ఆయన రచనల్లో జ్ఞానాన్వేషణ, విశాల దృక్పథం, మానవీయ విలువలు స్పష్టంగా కనిపిస్తాయి.నెహ్రూ 1964 మే 27న కన్నుమూశారు. అయితే ఆయన ఆశించిన బాలల సంక్షేమం, విద్యావ్యాప్తి, సమాన అవకాశాల లక్ష్యాలు నేటికీ మన ముందున్నాయి. బాలల దినోత్సవాన్ని కేవలం వేడుకలు, సాంస్కృతిక కార్యక్రమాలకే పరిమితం చేయడం వల్ల ప్రయోజనం లేదు. దేశంలోని ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, ఆరోగ్య సంరక్షణ, సురక్షితమైన వాతావరణం అందుతున్నాయా లేదా అన్నది ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సందర్భమిది. బాల కార్మికత్వం, బాల్యవివాహాలు, బాలలపై హింస, పోషకాహార లోపం, పాఠశాలలకు దూరమవుతున్న చిన్నారుల సమస్యలను సమాజం తీవ్రంగా పరిగణించాలి.

పిల్లల హక్కులను కాపాడటం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు, పౌర సమాజం కూడా ఇందులో భాగస్వాములు కావాలి. పిల్లల్లో ప్రశ్నించే తత్వాన్ని ప్రోత్సహించాలి. వారి ఆలోచనలకు స్వేచ్ఛనివ్వాలి. కుల, మత, భాషా భేదాలకు అతీతంగా పరస్పర గౌరవం, సహనం, మానవత్వం నేర్పాలి. భయంలేని బాల్యం, వివక్షలేని విద్య, అవకాశాలతో కూడిన భవిష్యత్తు ప్రతి చిన్నారి హక్కుగా మారాలి.

నెహ్రూ రాజకీయ జీవితంపై భిన్నాభిప్రాయాలు ఉండవచ్చు. ఆయన పాలనలోని విజయాలు, వైఫల్యాలపై చారిత్రక విశ్లేషణలు కొనసాగవచ్చు. అయినప్పటికీ బాలల విద్య, శాస్త్రీయ దృక్పథం, ఆధునిక భారత నిర్మాణం పట్ల ఆయన చూపిన నిబద్ధతను విస్మరించలేం. ఒక దేశ ప్రగతిని దాని భవనాల ఎత్తుతోనో, సంపదతోనో మాత్రమే కొలవలేం. ఆ దేశంలోని పిల్లలకు లభిస్తున్న అవకాశాలు, వారి ముఖాల్లో కనిపించే ఆత్మవిశ్వాసం, భవిష్యత్తుపై వారికున్న ఆశలే నిజమైన అభివృద్ధికి కొలమానం. బాలల భవిష్యత్తులోనే దేశ భవిష్యత్తు ఉందన్న నెహ్రూ ఆలోచనను ఆచరణలో పెట్టడమే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి.



1889 నవంబర్ 14న ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్‌లో సంపన్న న్యాయవాది మోతీలాల్ నెహ్రూ, స్వరూపరాణి దంపతులకు జవహర్‌లాల్ నెహ్రూ జన్మించారు. చిన్ననాటి నుంచే విద్య, విజ్ఞానంపై

ఆసక్తి చూపిన ఆయన ప్రాథమిక విద్యను ఇంటివద్దే అభ్యసించారు. అనంతరం ఇంగ్లండ్‌లోని హారో పాఠశాలలో, కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యను అభ్యసించారు. ఇన్నర్

టెంపుల్‌లో న్యాయశాస్త్ర విద్య పూర్తిచేసి 1912లో భారతదేశానికి తిరిగివచ్చారు. అయితే న్యాయవాద వృత్తికంటే దేశ స్వాతంత్ర్య పోరాటమే ఆయనను ఎక్కువగా ఆకర్షించింది.



యం డి. ఉస్మాన్ ఖాన్

దేశాల మధ్య ఇంకా ఏకాభిప్రాయం లేదు



వాతావరణ సదస్సులో ప్రపంచ నేతలు నేడు ద్వైపాక్షిక భేటీలు నిర్వహించనున్నారు. మీథేన్ నుంచి అటవీ ఆర్థిక సహాయం వరకు అంశాలు చర్చకు రానున్నాయి. బ్రిటన్ ప్రధాని ఆండి బర్న్‌హామ్ సదస్సుకు చేరుకున్నారు.

జాతీయ భద్రతపై వాతావరణ ముప్పు హెచ్చరికలను ఎడ్ మిలిబాండ్ గతంలో చేశారు. ఆ హెచ్చరికల నేపథ్యంలో తొలి వాతావరణ భద్రతా సలహాదారును నియమించేందుకు బర్న్‌హామ్ సిద్ధమయ్యారు. బర్న్‌హామ్ బ్రెజిల్ అధ్యక్షుడు లులాతో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు.

అనంతరం యూరప్ నేతలతో కలిసి కృత్రిమ మేధస్సుపై డబ్లిన్ సమావేశానికి వెళ్లనున్నారు. నేతలు ఫొటో అవకాశాల్లో కనిపిస్తుండగా, చర్చాకర్తలు ప్రధాన మందిరాల్లో పత్రాలపై పనిచేస్తున్నారు. వార్షిక పక్షాల సమావేశం ప్రధాన ఫలితం ఆ పత్రాలే.

సదస్సు అజెండాను సోమవారం పెద్ద ఆలస్యం లేకుండా ఆమోదించారు. కవర్ నిర్ణయంపై మాత్రం దేశాలు ఇంకా ఏకాభిప్రాయానికి రాలేదు. సాధారణంగా ప్రతి సదస్సు చర్చల అంశాలను ఒక నిర్ణయంలో సమీకరిస్తుంది.

ఈ నిర్ణయానికి సదస్సుల్లో అధికారిక హోదా ఉంటుంది. చర్చల అనంతరం దానిని గావెల్‌తో ఆమోదిస్తారు. అందులోని తీర్మానాలు దేశాలపై బద్ధతను కలిగిస్తాయి.

కవర్ నిర్ణయం లేకుండా సదస్సును ముగించడం అరుదుగా జరుగుతుంది. అజర్‌బైజాన్‌లోని కాప్29లో అలాంటి అధ్యక్ష నిర్ణయం పలు పక్షాలను ఆగ్రహపరిచింది. ఈ నిర్ణయం ఒకే అంశానికి పరిమితం కాదు.

లింగ సమానత్వం, సమగ్రత వంటి అంశాలు కూడా ఇందులో చేరవచ్చు. వాతావరణ సంక్షోభం ఆరోగ్య ప్రభావాలకు గుర్తింపు ఇందులో దక్కవచ్చు. సముద్రాల పరిస్థితిపై ఆందోళనలకూ స్థానం లభించవచ్చు.

చర్చల్లో ప్రత్యేక స్థానం లేని అంశాలను కవర్ నిర్ణయం చేర్చగలదు. అలంకారిక కృతజ్ఞతలతో పాటు కీలక పురోగతికి ఇది వేదికవుతుంది. గ్లాస్గోలోని కాప్26లో 2021 కవర్ నిర్ణయం బొగ్గు వినియోగాన్ని తగ్గించే తీర్మానానికి దారితీసింది.

దుబాయ్‌లోని కాప్28లో 2023 కవర్ నిర్ణయంలో శిలాజ ఇంధనాల నుంచి మార్పు ప్రతిజ్ఞ చోటుచేసుకుంది. ఈ ఏడాది కవర్ నిర్ణయానికి అపకాశం ఉందని ఆస్ట్రేలియా తెలిపింది. అయితే అరబ్ గ్రూప్, రష్యా, అభివృద్ధి చెందుతున్న దేశాల సమూహం వ్యతిరేకంగా కనిపిస్తున్నాయి. ప్రతిపాదిత అంశాల్లో 2035 నాటికి తుది ఇంధనంలో 35 శాతం విద్యుత్ నుంచి పొందే లక్ష్యం ఉంది. శిలాజ ఇంధనాల నుంచి మార్పుపై బ్రెజిల్ రోడ్‌మ్యాప్ గుర్తింపూ చర్చకు రావచ్చు. 1.5 డిగ్రీల పరిమితి మించడంపై అంశం కూడా ఉంది.

పేద దేశాలకు అనుసరణ ఆర్థిక సహాయం ప్రతిపాదనల్లో మరో అంశం.

విలియమ్స్ పరేడ్ గ్రాండ్ మార్షల్‌గా సునీతా విలియమ్స్

నవంబర్ 11న మాన్‌హాటన్‌లోని ఫిఫ్త్ అవెన్యూలో జరిగిన కార్యక్రమంలో మాజీ సైనికులు, విధుల్లో ఉన్న సైనికులు, మార్చింగ్ బ్యాండ్లు, సైనిక కుటుంబాలు, సమాజ సంస్థలు పాల్గొన్నారు

న్యూయార్క్‌లో సునితా విలియమ్స్ పరేడ్ గ్రాండ్ మార్షల్‌గా వ్యవహరించారు. నగర 107వ వెటరన్స్ డే పరేడ్‌లో ఆమె ఈ బాధ్యత నిర్వర్తించారు. అమెరికా నేవీ మాజీ సైనికురాలైన విలియమ్స్‌కు వేలాది మంది హాజరయ్యారు.

మాజీ సైనికులు, ప్రస్తుతం విధుల్లో ఉన్న సైనికులు కూడా పాల్గొన్నారు. మార్చింగ్ బ్యాండ్లు, దేశభక్తి సంస్థలు, సైనిక వాహనాలు పరేడ్‌లో కనిపించాయి. దేశానికి సేవ చేసినవారిని స్మరించేందుకు వార్షికంగా ఈ కార్యక్రమం జరుగుతుంది.

జోరన్ మమ్దానీ కూడా పరేడ్ సభలో పాల్గొన్నారు. భారతీయ మూలాలున్న మమ్దానీ న్యూయార్క్ నగర మేయర్‌గా ఉన్నారు. విలియమ్స్ 107వ పరేడ్‌లో పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నానన్నారు.

సైన్యంలో చేరినప్పుడు వెటరన్ అవుతానని ఊహించలేదని ఆమె చెప్పారు. యువ వయసులో జీవితం ఎలా నడపాలో ఆలోచించేవారమన్నారు. సైన్యంలో తొలి అడుగులు తన జీవితానికి పునాది వేశాయని తెలిపారు.

ధైర్యం, గౌరవం, నిబద్ధత తనకు దిశ చూపాయని విలియమ్స్ పేర్కొన్నారు. అంతరిక్షంలో ప్రపంచవ్యాప్తంగా వచ్చినవారితో పనిచేసే అవకాశం దక్కిందన్నారు. సైన్యం నేర్పిన పాఠాలను తదుపరి తరానికి అందించాలనుకుంటున్నానన్నారు.

తదుపరి తరం గత కలలకంటే మరింత సాధించగలదని ఆమె చెప్పారు. అన్వేషణ మన హృదయంలో, ఆత్మలో ఉందని విలియమ్స్ అన్నారు. స్వేచ్ఛ ఉచితంగా రాదని ఆమె స్పష్టం చేశారు.

అన్వేషణ, సోదరభావం కోసం అమెరికా సైనికులు ఆదర్శంగా నిలిచారని చెప్పారు. ప్రపంచానికి మార్గదర్శకులుగా వారు పనిచేశారని విలియమ్స్ పేర్కొన్నారు. నేవీలో గడిపిన కాలం తన వ్యక్తిత్వాన్ని మలిచిందన్నారు.



ఆ అనుభవం తరువాతి ప్రతి సవాలుకు సిద్ధం చేసిందని తెలిపారు. ప్రతి తరానికి చెందిన వెటరన్ల సేవను సత్కరించడం గర్వంగా ఉందన్నారు. దేశవ్యాప్తంగా వచ్చిన అమెరికన్లతో కలిసి న్యూయార్క్‌వాసులతో నడవడం గౌరవమన్నారు.

యునైటెడ్ వార్ వెటరన్స్ కౌన్సిల్ అధిపతి మార్క్ ఒట్టో విలియమ్స్‌ను స్వాగతించారు. అమెరికా మెరైన్ కార్ప్స్ మాజీ సైనికుడైన ఒట్టో ఈ విషయం చెప్పారు. అమెరికా 250వ పుట్టినరోజు సందర్భంగా ఆమె నాయకత్వం గర్వకారణమన్నారు.

విలియమ్స్ సేవలు వెటరన్స్ డే విలువలను ప్రతిబింబిస్తున్నాయని తెలిపారు. దేశానికి సేవ చేసినవారి ధైర్యం, త్యాగాన్ని పరేడ్ గుర్తుచేస్తుందన్నారు. విలియమ్స్ నాయకత్వంలో ఈ ఏడాది పరేడ్ ప్రారంభమైందని ఒట్టో చెప్పారు.

సేవల కథలు ఎప్పటికీ మరువకుండా ఈ సంప్రదాయం తోడ్పడుతుందన్నారు. నవంబర్ 11న మాన్‌హాటన్‌లోని ఫిఫ్త్ అవెన్యూ వీధుల్లో పరేడ్ జరిగింది. 2026లో జరిగిన ఈ కార్యక్రమం నగర వార్షిక వేడుకగా కొనసాగింది.

యునైటెడ్ వార్ వెటరన్స్ కౌన్సిల్ పరేడ్‌ను నిర్వహించింది. 107వ పరేడ్‌లో సైనిక కుటుంబాలు, సేవా సభ్యులు పాల్గొన్నారు. సమాజ సంస్థలు, మద్దతుదారులు కూడా కార్యక్రమానికి తరలివచ్చారు.

అమెరికా సైనిక వీరుల ధైర్యం, సేవ, త్యాగాన్ని గుర్తించడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. వెటరన్స్ డే సందర్భంగా పరేడ్ ప్రతి సంవత్సరం జరుగుతుంది. సునీతా విలియమ్స్ నాసా మాజీ వ్యోమగామి, అమెరికా నేవీ మాజీ సైనికురాలు.

పోరాటం ఉధృతం

నవంబర్ 26 నుంచి డిసెంబర్ 20 వరకు దేశవ్యాప్త శాంతియుత నిరసనలు



ప్రజా వ్యతిరేక ఎస్ఐఆర్ వెదిక నవంబర్ 26 నుంచి డిసెంబర్ 20 వరకు దేశవ్యాప్త శాంతియుత నిరసనలకు పిలుపునిచ్చింది. ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణకు వ్యతిరేకంగా పోరాటాన్ని ఉధృతం చేయాలని వేదిక నిర్ణయించింది. పౌరసమాజం, విద్యార్థులు, రైతు సంఘాలు ఈ వేదికలో భాగస్వాములుగా ఉన్నాయి. నిరసనలను సామూహిక సంస్థలతో కలిసి సమన్వయం చేయనున్నారు. ప్రజా వ్యతిరేక ఎస్ఐఆర్ కార్యవర్గం నవంబర్ 12, 2026న సమావేశమైంది. జాతీయ సమన్వయ కమిటీ తీసుకున్న నిర్ణయాల అమలుపై సమావేశం చర్చించింది. ఎస్ఐఆర్‌ను రద్దు చేసి ప్రజాస్వామ్యాన్ని తిరిగి సాధించడమే లక్ష్యమని వేదిక తెలిపింది. ప్రజా పార్లమెంట్, ప్రజాభిప్రాయ సేకరణ, ఓటరు జాబితా ఆడిట్లు నిర్వహించాలని నిర్ణయించారు. భారత ఎన్నికల సంఘం చర్యలను వేదిక ఆలస్యమైన వెనకడుగులుగా అభివర్ణించింది. గత 16 నెలల చర్యల్లో కొన్ని అక్రమ, రాజ్యాంగవిరుద్ధ అంశాలను సవరించేందుకు సంఘం ప్రయత్నించిందని పేర్కొంది. ఆ పరిమిత చర్యలు సామూహిక ఓటుహక్కు తొలగింపు సమస్యను పరిష్కరించలేదని వేదిక తెలిపింది. ఎస్ఐఆర్ స్వభావం ప్రజాస్వామ్యవిరుద్ధమని కూడా స్పష్టం చేసింది. రాజ్యాంగ దినోత్సవాన్ని నవంబర్ 26న నిరసనకారులు పాటించనున్నారు. హక్కుల పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా భారీ ప్రదర్శనలు నిర్వహించనున్నారు. ఓటుహక్కు, జీవనోపాధి హక్కులను ప్రస్తావించనున్నారు. ప్రజా వ్యతిరేక ఎస్ఐఆర్ కూటమి మరిన్ని బహిరంగ సభలు నిర్వహించనుంది. నవంబర్ 26 నుంచి డిసెంబర్ 20 వరకు ర్యాలీలు జరుగుతాయి. దేశవ్యాప్తంగా ఓటరు జాబితాల ఆడిట్లు చేపట్టనున్నారు. ప్రజా వ్యతిరేక ఎస్ఐఆర్ వేదిక ఓటరు జాబితా సవరణను రద్దు చేయాలని కోరింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. ప్రజాస్వామ్యాన్ని, నిరసన హక్కును తిరిగి సాధించడమే కూటమి లక్ష్యమని తెలిపింది. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా విద్యార్థులు, రైతులు, పౌరసమాజ సంస్థలు నిరసనలు కొనసాగిస్తున్నాయి. యోగేంద్ర యాదవ్, అన్నీ రాజా, రైతు సంఘాలు కూడా నిరసనల్లో చేరాయి. అక్టోబర్ 23న జరిగిన ఆందోళనలో 20 మందిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆ ఘటనపై ఒక ఎఫ్ఐఆర్ నమోదైంది.

మోదీ శుభాకాంక్షలు

ఢిల్లీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 12 నవంబర్ 2026న దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. మోదీ ఈ శుభాకాంక్షలను సామ్ పిత్రోదాకు పంపారు.

పిత్రోదా మోదీని, బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తారు. ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ అధ్యక్షుడు పిత్రోదా మోదీని గుజరాతీ స్నేహితుడిగా అభివర్ణించారు.

ఆ వ్యాఖ్యల తరువాత మోదీ నుంచి స్పందన వచ్చింది. ఈ పరిణామం రాజకీయ విభేదాల మధ్య వ్యక్తిగత స్నేహపూర్వకతను చూపించింది.

మోదీ తన సందేశాన్ని ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. సామ్ భాయ్, అంజనా బెన్‌కు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

నూతన సంవత్సర అభినందనలు కూడా మోదీ సందేశంలో ఉన్నాయి. రాబోయే సంవత్సరం ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

చివరగా జై జగన్నాథ్ అని మోదీ పేర్కొన్నారు. సందేశాన్ని సామ్ పిత్రోదా ఖాతాను ప్రస్తావిస్తూ ప్రచురించారు.

సామ్ పిత్రోదా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి సన్నిహిత సహచరుడు. పిత్రోదా మోదీని వ్యక్తిగా గౌరవిస్తున్నానని చెప్పారు.


గుజరాతీ స్నేహితుడిగా మోదీ తనకు పరిచయమని పిత్రోదా పేర్కొన్నారు. గతంలో తాను, తన భార్య మోదీని కలిశామని తెలిపారు.

ఆ సమావేశాల్లో మోదీ తమ పట్ల ఎంతో ఆప్యాయంగా ఉన్నారని చెప్పారు. ఈ వివరాలను పిత్రోదా ఒక వార్తా సంస్థకు వెల్లడించారు.

పిత్రోదా మోదీపై తనకు వ్యక్తిగత వ్యతిరేకత లేదని స్పష్టం చేశారు. గుజరాతీ నాయకుడిగా మోదీని తాను గౌరవిస్తానని అన్నారు.

స్నేహితుడిగా, శ్రేయోభిలాషిగా కూడా మోదీని చూస్తానని చెప్పారు. మోదీ తన పట్ల చాలా ఆప్యాయంగా వ్యవహరించారని పిత్రోదా పేర్కొన్నారు.

ఆ అనుభవాన్ని తాను అభినందిస్తున్నానని ఆయన తెలిపారు. రాజకీయ విమర్శలకు భిన్నమైన వ్యక్తిగత సంబంధాన్ని పిత్రోదా వివరించారు.



గుజరాత్‌లోని మోదీ ఇంటికి పలుమార్లు వెళ్లానని పిత్రోదా చెప్పారు. ఆ పర్యటనలు గతంలోనే జరిగాయని ఆయన వివరించారు.

మోదీతో తన పరిచయం రాజకీయ విమర్శలకే పరిమితం కాలేదని పిత్రోదా వ్యాఖ్యలు సూచించాయి. అయితే బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వంపై తన విమర్శలను ఆయన ఉపసంహరించుకోలేదు.

పిత్రోదా వ్యక్తిగత గౌరవాన్ని రాజకీయ వైఖరితో వేరు చేశారు. ఆ రెండు అంశాలను ఆయన వేర్వేరుగా ప్రస్తావించారు.

మోదీ సందేశం తరువాత మిహిర్ ఝా అనే ఎక్స్ వినియోగదారు స్పందించారు. ఏడుస్తున్న ముఖం గుర్తుతో ఆయన తన అభ్యర్థనను పోస్టు చేశారు.

సామ్ పిత్రోదాకు దీపావళి శుభాకాంక్షలు చెప్పగలిగితే, తమకూ చెప్పాలని కోరారు. ఆ సందేశంలో మోదీని మోదీజీగా సంబోధించారు.

మిహిర్ ఝా వ్యాఖ్య మోదీ పోస్టుకు నేరుగా ప్రతిస్పందనగా వచ్చింది. వినియోగదారు తన వ్యక్తిగత అభ్యర్థనను బహిరంగంగా ఉంచారు.

మిహిర్ ఝా సందేశానికి మోదీ ఎక్స్‌లో సమాధానం ఇచ్చారు. మిహిర్ భాయ్‌కు కూడా దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

పండుగ కాలం ఆనందంగా గడవాలని మోదీ ఆకాంక్షించారు. రాబోయే సంవత్సరం కూడా గొప్పగా ఉండాలని ఆయన పేర్కొన్నారు.

సమాధానం చివరలో నవ్వుతున్న ముఖం గుర్తును జోడించారు. మోదీ స్పందన వ్యక్తిగత వినియోగదారు చేసిన అభ్యర్థనకు వచ్చింది.

దీపావళి శుభాకాంక్షలతో పాటు సూతన సంవత్సర అభినందనలు మోదీ తెలిపారు. సామ్ పిత్రోదా, అంజనా బెన్ ఇద్దరినీ ఆయన సందేశంలో ప్రస్తావించారు.

ఆరోగ్యం, ఆనందంతో కూడిన సంవత్సరం కావాలని ఆకాంక్షించారు. పిత్రోదా గత వ్యాఖ్యల తరువాతే ఈ సందేశం వెలువడింది.

పిత్రోదా మోదీని గుజరాతీ స్నేహితుడిగా పేర్కొన్న విషయం ముందుగా నమోదైంది. ఆ వ్యాఖ్యకు మోదీ బహిరంగ వేదికపై స్పందించారు.

మోదీ, పిత్రోదా మధ్య వ్యక్తిగత పరిచయం ఉందని వివరాలు వెల్లడించాయి. పిత్రోదా రాహుల్ గాంధీకి సన్నిహిత సహచరుడిగా కొనసాగుతున్నారు.

మోదీపై పిత్రోదా రాజకీయ విమర్శకుడిగా కూడా గుర్తింపు పొందారు. అయినా వ్యక్తిగతంగా మోదీని గౌరవిస్తానని పిత్రోదా చెప్పారు.

మిహిర్ ఝా అభ్యర్థనకు మోదీ ప్రత్యేకంగా సమాధానమిచ్చారు. రెండు సందేశాలు ఎక్స్ వేదికపైనే నమోదయ్యాయి. మోదీ సందేశంలో జై జగన్నాథ్ అన్న పదాలు ఉన్నాయి. పిత్రోదా భార్యతో కలిసి మోదీని కలిశారు. మిహిర్ ఝా సందేశంలో ఏడుస్తున్న ముఖం గుర్తుంది. మోదీ సమాధానంలో నవ్వుతున్న ముఖం గుర్తుంది.

గస్తీ మద్దతు



ఫిలిప్పీన్స్‌లో జరగనున్న 49వ ఆసియాన్ శిఖరాగ్ర సదస్సుకు ముందు భారత్ కీలక నిర్ణయం ప్రకటించింది. మలక్కా జలసంధి చుట్టూ సమన్వయ గస్తీకి భారత్ మద్దతు తెలిపింది. విదేశాంగ మంత్రిత్వశాఖ తూర్పు కార్యదర్శి రుద్రేంద్ర టాండన్ ఈ విషయాన్ని వెల్లడించారు. నవంబర్ 12న మలక్కా ప్రోటోకాల్‌పై ఢిల్లీలో ఆయన మాట్లాడారు. మలక్కా జలసంధి ఆసియాన్ దేశాల ప్రాదేశిక జలాల్లో విభజించబడి ఉందని టాండన్ చెప్పారు. భారత్ ఆ ఇరుకైన జలమార్గం వెలుపల ఉందని ఆయన స్పష్టం చేశారు. విస్తారమైన సముద్ర ప్రాంతాన్ని పర్యవేక్షించేందుకు సహకార భద్రతా వ్యవస్థలు అవసరమన్నారు. సమన్వయ గస్తీ సముద్ర పర్యవేక్షణను మెరుగుపరుస్తుందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ ఫిలిప్పీన్స్ పర్యటనలో ఈ అంశం ప్రాధాన్యం పొందనుంది. 49వ ఆసియాన్, 23వ ఆసియాన్‌భారత్ శిఖరాగ్ర సదస్సులు జరగనున్నాయి. 21వ తూర్పు ఆసియా సదస్సులోనూ సముద్ర భద్రత చర్చకు రానుంది. ఢిల్లీ తూర్పు దిశ విధానంలో ప్రాంతీయ అనుసంధానం కీలక అంశంగా ఉంది. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో జూలైలో మరో హెచ్చరిక చేశారు. పశ్చిమాసియాలో అక్రమ సముద్ర దిగ్బంధనాలు ప్రమాదకర దృష్టాంతాన్ని సృష్టిస్తాయని అన్నారు. ఆ ప్రభావం ఇండో పసిఫిక్ సముద్ర మార్గాలకూ విస్తరించవచ్చని రూబియో సూచించారు. ప్రపంచ ఇంధన, వాణిజ్య మార్గాలకు ముప్పు పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఇరాన్‌ను మధ్యప్రాచ్య అస్థిరతకు మూలకారణంగా రూబియో అభివర్ణించారు. హూతీల నుంచి వచ్చే ముప్పుపై అమెరికా సౌదీ అరేబియాతో సమన్వయం చేస్తోందన్నారు. బాబ్‌ఎల్‌మందెబ్ జలసంధి ఎర్ర సముద్రాన్ని అరేబియా సముద్రంతో కలుపుతుంది. ఆ మార్గంలో భద్రతా సవాళ్లు కొనసాగుతున్నాయని రూబియో చెప్పారు. మలక్కా జలసంధి ప్రపంచ వాణిజ్యంలో దాదాపు మూడో వంతును మోస్తోంది. భారత సముద్ర వాణిజ్యంలో 55 శాతానికి పైగా ఈ మార్గంపై ఆధారపడి ఉంది. అండమాన్, నికోబార్ దీవులు జలసంధికి సుమారు 600 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. అందువల్ల ఢిల్లీకి ఈ మార్గం భౌగోళికంగా సమీపం, వ్యూహాత్మకంగా కీలకం. మలక్కా జలసంధి సింగపూర్ జలసంధిని కలిసే చోట సుమారు 10 మైళ్లకు కుంచించుకుంటుంది. మార్గం మూసివేత ప్రపంచ సరఫరా గొలుసులపై ప్రభావం చూపుతుంది. తూర్పు ఆసియా ఇంధన సరఫరాలు, ఆగ్నేయాసియా వాణిజ్యం దెబ్బతినొచ్చు. 2007లో ఏర్పడిన సహకార వ్యవస్థ నౌకాయానం, పర్యావరణ రక్షణపై పనిచేస్తోంది.

ఆల్కెమ్ రెండో త్రైమాసిక నికర లాభం 11.8 శాతం క్షీణించింది

ఆల్కెమ్ ల్యాబొరేటరీస్ సెప్టెంబర్ త్రైమాసికంలో నికర లాభం తగ్గింది. ఏకీకృత నికర లాభం 11.8 శాతం క్షీణించి రూ.675 కోట్లకు చేరింది.

గత ఏడాది ఇదే త్రైమాసికంలో లాభం రూ.765 కోట్లుగా నమోదైంది. ఆర్థిక సంవత్సరం 2027 రెండో త్రైమాసికంలో ఈ ఫలితాలు వచ్చాయి.

నిర్వహణ ఆదాయం 13.8 శాతం పెరిగింది. ఆదాయం రూ.4,552 కోట్లకు చేరింది.

నిర్వహణ ఆదాయం గత ఏడాది రూ.4,001 కోట్లుగా ఉంది. వడ్డీ, పన్ను, తరుగుదల, రుణ విమోచనకు ముందరి ఆదాయం పెరిగింది.

ఈబీఐటీడీఏ 11.3 శాతం వృద్ధితో రూ.1,025 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే కాలంలో అది రూ.921 కోట్లుగా ఉంది.

ఈబీఐటీడీఏ మార్జిన్ 22.5 శాతానికి తగ్గింది. గత ఏడాది మార్జిన్ 23 శాతంగా నమోదైంది.

త్రైమాసికంలో సంస్థకు రూ.35 కోట్ల ఒక్కసారికే లభించిన ఆదాయం వచ్చింది. భారత వ్యాపార విక్రయాలు 9.5 శాతం పెరిగాయి.

దేశీయ విక్రయాలు రూ.3,027.5 కోట్లకు చేరాయి. అంతర్జాతీయ విక్రయాలు 22.3 శాతం ఎగిశాయి.

అంతర్జాతీయ విక్రయాల విలువ రూ.1,454 కోట్లుగా నమోదైంది. దేశీయ వ్యాపారం మొత్తం విక్రయాల్లో 68 శాతం వాటా సాధించింది.

దేశీయ వ్యాపార వాటా గత ఏడాది 70 శాతంగా ఉంది. ఐక్యూవీఐఏ ఎస్ఎస్ఏ గణాంకాల ప్రకారం దేశీయ వ్యాపారం 13.8 శాతం పెరిగింది.

ఈ వృద్ధి భారత ఔషధ మార్కెట్ వృద్ధికి అనుగుణంగా ఉంది. తీవ్రమైన వ్యాధుల విభాగం 12.1 శాతం వృద్ధి సాధించింది.



అదే సమయంలో మార్కెట్ వృద్ధి 12.3 శాతంగా ఉంది.

దీర్ఘకాలిక చికిత్సల విభాగం 22.4 శాతం పెరిగింది.

దీర్ఘకాలిక విభాగం మార్కెట్ వృద్ధిని అధిగమించింది. మార్కెట్ వృద్ధి 16 శాతంగా నమోదైంది.

రెండు వృద్ధుల మధ్య తేడా 640 బేసిస్ పాయింట్లుగా ఉంది.

విటమిన్లు, ఖనిజాలు, పోషకాహారం విభాగాల్లో ఆల్కెమ్ ముందంజలో ఉంది.

నొప్పి నివారణ, మధుమేహ వ్యతిరేక చికిత్సల్లోనూ సంస్థ మెరుగైన ప్రదర్శన చూపింది. హృదయం, మూత్రవ్యవస్థ, శ్వాసకోశ, నరాల చికిత్స విభాగాల్లోనూ అదే ధోరణి కనిపించింది.

చర్మవ్యాధుల చికిత్స కూడా సంస్థ ప్రధాన విభాగాల్లో ఉంది.

అమెరికా విక్రయాలు 2.4 శాతం పెరిగాయి.

అమెరికా విక్రయాల విలువ రూ.783 కోట్లకు చేరింది. మొత్తం విక్రయాల్లో అమెరికా వాటా 17 శాతంగా ఉంది.

గత ఏడాది రెండో త్రైమాసికంలో ఆ వాటా 19 శాతంగా ఉంది. అమెరికా వెలుపలి విక్రయాలు 58 శాతం ఎగిశాయి.

అమెరికా వెలుపలి విక్రయాలు రూ.671 కోట్లకు చేరాయి. ఆక్యుల్యూటెక్‌ను మినహాయిస్తే ఈ వ్యాపార వృద్ధి 28.6 శాతంగా ఉంది.

ఈ విభాగం మొత్తం విక్రయాల్లో 15 శాతం వాటా సాధించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఆ వాటా 11 శాతంగా ఉంది.

అంతర్జాతీయ వ్యాపారంపై అమెరికా ధరల ఒత్తిడి కొనసాగింది. విక్రయ పరిమాణాల పెరుగుదల ఆ వ్యాపారానికి మద్దతిచ్చింది.

గోపాల్ కొఠారీని సంస్థ ప్రధాన ఆర్థిక అధికారి గా నియమించింది. నియామకం డిసెంబర్ 2, 2026 నుంచి అమల్లోకి వచ్చింది.

ఆల్కెమ్ మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ సింగ్ ఫలితాలపై స్పందించారు. భారత వ్యాపారంలో వేగం కొనసాగిందని సింగ్ తెలిపారు.

తీవ్రమైన, దీర్ఘకాలిక చికిత్సా విభాగాల్లో లక్ష్యిత అమలు దోహదపడిందన్నారు. ఆక్యుల్యూటెక్ చేరికతో మెడ్‌టెక్ ఉనికిని విస్తరించామని చెప్పారు.

ఎంజీన్ అమలును మెరుగుపరచడం ప్రాధాన్యమని సింగ్ పేర్కొన్నారు. ఆల్కెమ్ ఎనిమిది ప్రధాన చికిత్సా విభాగాల్లో మార్కెట్‌ను అధిగమించింది. ఎంజీన్ నిర్వహణ పనితీరు మెరుగుదల సంస్థకు ప్రాధాన్యంగా ఉంది. సందీప్ సింగ్ మూల వ్యాపార బలోపేతంపై దృష్టి ప్రకటించారు. సంస్థ మూలధనాన్ని జాగ్రత్తగా వినియోగించనుంది.

వార్డెన్ల ఐదు డిమాండ్లపై ధర్నా; పరిష్కారం లేకపోతే రాష్ట్ర ఉద్యమం



భాటాపారా జిల్లాలోని దశరా మైదానంలో వసతి గృహాల వార్డెన్లు నిరసన చేపట్టారు. జిల్లా వార్డెన్ల సంఘం సభ్యులు ఐదు డిమాండ్లపై ధర్నా నిర్వహించారు. రాష్ట్ర సంఘం పిలుపుతో అధికారులు, సభ్యులు అక్కడికి చేరుకున్నారు. ధర్నా అనంతరం సంఘం నాయకులు కలెక్టర్ ద్వారా వినతిపత్రం సమర్పించారు. ఆదిమజాతి సంక్షేమ శాఖ కార్యదర్శి పేరుతో ఆ పత్రాన్ని పంపించారు. డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు సంఘం తెలిపింది. వార్డెన్ల సమస్యలు చాలాకాలంగా పరిష్కారం కాలేదని సంఘం పేర్కొంది. ఆ పరిస్థితి పల్లే ఉద్యమ మార్గాన్ని ఎంచుకున్నామని తెలిపింది. వసతి గృహాల బడ్జెట్ పెంచాలని సంఘం ప్రధానంగా కోరింది. ఆన్‌లైన్ హాజరు విధానాన్ని రద్దు చేయాలని సంఘం డిమాండ్ చేసింది. వార్డెన్లకు పెండింగ్ పదోన్నతులు కల్పించాలని కోరింది. పని గంటలకు స్పష్టమైన పరిమితి నిర్ణయించాలని కూడా విజ్ఞప్తి చేసింది. మహిళా వసతి గృహాల వార్డెన్లకు సంబంధించిన నిబంధనలు మార్చాలని కోరారు. పురుష బంధువులు ఆశ్రమంలో ఉండే అంశంపై స్పష్టమైన నియమాలు చేయాలని తెలిపారు. పిల్లలకు మెరుగైన, సమయానుకూల వైద్యసేవలు అందించాలని కోరారు. ఐదు డిమాండ్లపై ప్రభుత్వం త్వరగా సానుకూల నిర్ణయం తీసుకోవాలని జిల్లా అధ్యక్షుడు ఛతరామ్ మహేశ్వరి అన్నారు. డిమాండ్లను వినతిపత్రం ద్వారా ప్రభుత్వానికి తెలియజేశామని ఆయన చెప్పారు. పరిష్కారం లేకపోతే రాష్ట్రస్థాయి ఉద్యమం చేపడతామని ప్రకటించారు. డిమాండ్లపై ప్రభుత్వం తీవ్రంగా పరిశీలించి త్వరగా పరిష్కారం చూపాలని సంఘం కోరింది. నిర్ణయం రాకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఉద్యమం చేపడతామని సంఘం హెచ్చరించింది. ఈ నివేదికను సత్యప్రకాశ్ సమర్పించారు.

వుదయం

గురుకుల విద్యార్థినుల ఆరోగ్యం, పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి: కలెక్టర్

వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి నవంబర్ 13



వరంగల్‌లోని ఉర్సు ప్రాంతంలో ఉన్న మహాత్మా జ్యోతిరావు ఫూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు అందిస్తున్న ఆరోగ్య సంరక్షణ సేవలు, పౌష్టికాహారం నాణ్యత, వసతి సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి, వారికి అందిస్తున్న ఆహారం, ఇతర సౌకర్యాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు ఆరోగ్యంగా ఉండేందుకు పౌష్టికాహారం ఎంతో అవసరమని, ఆహార నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం విద్యార్థినులతో కలెక్టర్ ముచ్చటించి, చలికాలంలో ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చలి నుంచి రక్షణ పొందేందుకు వెచ్చని దుస్తులు ధరించాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గురుకులంలో ఏవైనా సమస్యలు, ఇబ్బందులు ఎదురైతే వాటిని తన దృష్టికి తీసుకువచ్చేందుకు ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టెలో తెలియజేయాలని విద్యార్థినులకు సూచించారు. ఎలాంటి సంకోచం లేకుండా తమ సమస్యలను తెలియజేయాలని, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. ఈ పర్యటనలో బీసీ సంక్షేమ శాఖ అధికారి పుష్పలత రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అస్తి పన్ను తగ్గింపుపై సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తాం– కలెక్టర్



ములుగు, నవంబర్ 12 (వుదయం ప్రతినిధి) :

ప్రభుత్వ నిబంధనల మేరకు వాణిజ్య భవనాల అస్తి పన్ను తగ్గింపుపై సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు తెలిపారు. ములుగు మున్సిపాలిటీ పరిధిలో వాణిజ్య భవనాల అస్తి పన్ను పెంపుపై గురువారం కలెక్టరేట్‌లో మున్సిపల్ ప్రజాప్రతినిధులు, అధికారులు, వ్యాపారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనిట్‌కు 30 పైసల చొప్పున నిర్ణయించడంతో అస్తి పన్ను గతంతో పోలిస్తే భారీగా పెరిగిందని, తమపై అదనపు భారం పడుతోందని వ్యాపారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి కలెక్టర్ స్పందిస్తూ.. జీఓ నెం.230 నిబంధనలు, ప్రాంతాల వారీగా పెరిగిన భూముల రిజిస్ట్రేషన్ విలువల ప్రకారం క్యాపిటల్ వాల్యూ ఆధారంగా వాణిజ్య భవనాల పన్ను నిర్ధారించామని వివరించారు. నివాస భవనాల పన్నులో ఎలాంటి మార్పు ఉండదని స్పష్టం చేశారు. వ్యాపారుల అభ్యర్థన మేరకు నిబంధనలకు లోబడి పన్ను తగ్గింపుపై సానుకూలంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చింతని పూల చంద్రకళ, వైస్ చైర్‌పర్సన్ ఆసియా షాహిన్, కమిషనర్ సంపత్, మేనేజర్ రాజేందర్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వ్యాపారులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి: కలెక్టర్

జనగామ, నవంబర్ 12 (వుదయం ప్రతినిధి) :



70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-14 బాలబాలికల రాష్ట్రస్థాయి సెపాక్ తక్రా టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్-2026 పోటీలు గురువారం జనగామలోని ధర్మకంచ మినీ స్టేడియంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా జ్యోతి ప్రజ్వలన చేసి, జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం క్రీడాకారుల మార్చ్‌పాస్ట్ నిర్వహించి, వారితో క్రీడా ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, జట్టుగా పనిచేసే తత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. పాఠ్యపుస్తకాలు నేర్పలేని ఎన్నో జీవిత పాఠాలను క్రీడా మైదానం నేర్పుతుందని, ఓటమి తర్వాత తిరిగి నిలబడే ధైర్యాన్ని ఇస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుతో పాటు కనీసం ఒక క్రీడలో నైనా పాల్గొనేలా ప్రోత్సహించాలని కోరారు. సెపాక్ తక్రా ఎంతో నైపుణ్యం, చురుకుదనం అవసరమయ్యే ఆట అని, ఇందులో ప్రతిభ కనబరిచిన వారికి జాతీయ స్థాయికి ఎంపికయ్యే సువర్ణావకాశం ఉంటుందని చెప్పారు. జిల్లాలో తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ రాష్ట్ర స్థాయి పోటీల్లో 10 జిల్లాల నుంచి 100 మంది బాలబాలికల క్రీడాకారులు, 40 మంది కోచ్‌లు, మేనేజర్లు, 15 మంది సాంకేతిక అధికారులు పాల్గొంటున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు క్రీడాకారులకు వసతి, వైద్యం, భద్రత సహా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. అనంతరం కలెక్టర్ స్వయంగా ఆటను ప్రారంభించారు.కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, ఆర్టీఏ సభ్యులు చిలువేరు అభి గౌడ్, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కిషన్ సింగ్, విద్యా శాఖ ఏడీ శ్రీనివాస్, డీవైఎస్ఓ నర సింహారావు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి గోర్ సింగ్, పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యా, పౌష్టికాహార ప్రమాణాలపై కఠినంగా వ్యవహరిస్తాం– కలెక్టర్

మహబూబాబాద్, నవంబర్ 12 (వుదయం ప్రతినిధి):

వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలి

నరసింహులపేట, పెదనాగారం పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల తనిఖీ



విద్యార్థుల విద్యాసామర్థ్యాల పెంపు, పౌష్టికాహార పంపిణీ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె నరసింహులపేట మండలం పెదనాగారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, కేజీబీవీ (KGBV), నరసింహులపేటలోని ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను విస్తృతంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో నేరుగా ముచ్చటించి, సబ్జెక్టుల వారీగా వారి విద్యాసామర్థ్యాలను స్వయంగా పరీక్షించారు. అనంతరం అధికారులకు, ఉపాధ్యాయులకు పలు కీలక సూచనలు చేశారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలి. ఎఫ్.ఎల్.ఎన్ (FLN), లీప్ (LEAP) ఇంగ్లీష్ లెర్నింగ్ కార్యక్రమాలు, డిజిటల్ తరగతుల ద్వారా పిల్లలకు సులభంగా అర్థమయ్యే రీతిలో బోధించాలి.సబ్జెక్టుల వారీగా సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయాలి.విద్యార్థులకు పక్కాగైడ్ మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం, యూనిఫామ్, పాఠ్యపుస్తకాలను షెడ్యూల్ ప్రకారం అందించాలి. పిల్లల హాజరు శాతాన్ని కచ్చితంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ఆర్.బి.ఎస్.కె (RBSK) సిబ్బందితో విద్యార్థులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలి. ఆరోగ్యం, పౌష్టికాహారం, పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించాలి. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని,తీవ్ర పోషకాహార లోపం (SAM/MAM)ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట ఏజీసీ శ్రీరాములు, ఏఎంఓ అప్పారావు, విజయలక్ష్మి , స్థానిక తహసీల్దార్, ఎంపీడీవో తదితర అధికారులు పాల్గొన్నారు.

సూర్యాపేట జిల్లా పోలీసుల నెలవారీ నేర సమీక్షా సమావేశం

ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు ఉండాలి :

ఎస్పీ నరసింహ, ఐపీఎస్



సూర్యాపేట, నవంబర్ 12 : వుదయం ప్రతినిధి

ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ, ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో సూర్యాపేట డివిజన్ పరిధి పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో నమోదైన గ్రేవ్, మిస్సింగ్, ఎన్‌బీడబ్ల్యూ కేసుల పురోగతిని సమీక్షించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, ముఖ్యంగా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మిస్సింగ్ కేసులను ఛేదించాలని సూచించారు. నాన్ బెయిలబుల్ వారెంట్లను త్వరగా అమలు చేయాలన్నారు. తీవ్రమైన కేసుల్లో శాస్త్రీయ ఆధారాల సేకరణతో నిందితులకు కోర్టులో శిక్ష పడేలా దర్యాప్తు ఉండాలని, అప్పుడే ప్రజల్లో పోలీసులపై నమ్మకం పెరుగుతుందని అన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఇన్వెస్టిగేషన్ సపోర్ట్ సెంటర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో ప్రమాద సూచిక బోర్డులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. వాహనదారులు హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, అతివేగానికి దూరంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలన్నారు.కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం రహత్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ పథకం కింద సూర్యాపేట జిల్లాలో 38 ఆసుపత్రులను గుర్తించామని, రోడ్డు ప్రమాద బాధితులకు ఉచిత అత్యవసర వైద్య సేవలు అందుతాయని తెలిపారు. ఈ పథకంపై విస్తృత ప్రచారం కల్పించాలని అధికారులకు సూచించారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని, ప్రతి గ్రామ ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లలో, ప్రార్థనా స్థలాలు, పరిశ్రమలు, ధాబాలు, పెట్రోల్ బంకుల వద్ద కమ్యూనిటీ సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు రవీందర్ రెడ్డి, సత్యయ్య, ప్రసన్న కుమార్, సైబర్ సెక్యూరిటీ సెల్ డీఎస్పీ రవి, ఎస్పీ ఇన్స్పెక్టర్ రామారావు, సైబర్ ఇన్స్పెక్టర్ శివ కుమార్, డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ మగ్దుం అలీ తదితరులు పాల్గొన్నారు.

ఏ.ఐ.కె.ఎస్.36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి

భూపాలపల్లి నవంబర్ 12 వుదయం ప్రతినిధి



అఖిల భారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిస్తూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రాక్టర్ల ర్యాలీని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పొలం రాజేందర్ ప్రారంభించారు. నవంబర్ 15 నుంచి 18 వరకు నల్గొండలో జరగనున్న 36వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలనే లక్ష్యంతో ఈ ర్యాలీ నిర్వహించారు. రైతాంగ సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, రైతు ఉద్యమానికి ప్రజల మద్దతును కూడగట్టేందుకు ఈ కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా పొలం రాజేందర్ మాట్లాడుతూ దేశానికి వెన్నెముకగా నిలుస్తున్న రైతాంగం నేడు అనేక సమస్యలను ఎదుర్కొంటోందని అన్నారు. వ్యవసాయ పెట్టుబడులు విపరీతంగా పెరగడం, పంటలకు గిట్టుబాటు ధరలు లభించకపోవడం, సాగునీటి సమస్యలు, అప్పుల భారం, ప్రకృతి వైపరీత్యాల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల కష్టానికి తగిన ప్రతిఫలం దక్కాలంటే వ్యవసాయ రంగాన్ని పరిరక్షించడంతో పాటు రైతులకు న్యాయం జరిగే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ముఖ్యంగా ఆదివాసీ, గిరిజన రైతులు ఎదుర్కొంటున్న భూమి, అటవీ హక్కులు, సాగునీరు, జీవనోపాధి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై దేశవ్యాప్తంగా ఐక్య ఉద్యమాలు నిర్మించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.నల్గొండలో జరగనున్న 36వ జాతీయ మహాసభలు దేశ రైతాంగ ఉద్యమానికి నూతన ఉత్సాహాన్ని, దిశానిర్దేశాన్ని అందిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మహాసభల్లో రైతాంగ సమస్యలపై విస్తృత చర్చ జరగాలని, రైతుల హక్కుల సాధనకు భవిష్యత్తు పోరాట కార్యాచరణ రూపొందించాలని ఆకాంక్షించారు. జిల్లాలోని రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో భాగస్వాములై జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దామెర రమేష్, జిల్లా సోషల్ మీడియా ఇంచార్జి తాడగొండ. రమేష్ రైతులు సాగర్, రమేష్, రాకేష్, రజినీకాంత్, వెంకట్, రాజ్యం, భాస్కర్, దామెర నరేష్, దామెర సుదర్శన్, పెద్ది మోహన్, చరణ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రైతులందరూ రీ సర్వేకు సహకరించాలి: కలెక్టర్

నల్గొండ:



భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించాలంటే రైతులందరూ భూముల రీ సర్వేకు సహకరించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. రైతుల మధ్య సమన్వయం ఉంటేనే భూ వివాదాలను పరిష్కరించడం సాధ్యమవుతుందని ఆయన అన్నారు. గురువారం నల్గొండ జిల్లా మునుగోడు మండలం సింగారం గ్రామంలో భూముల రీ సర్వేకు సంబంధించి జారీ చేసిన నోటీసులపై వచ్చిన అభ్యంతరాల పరిష్కారానికి నిర్వహించిన గ్రామసభకు కలెక్టర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్, చండూరు ఆర్డీవో శ్రీదేవి వివరాలు వెల్లడిస్తూ.. గ్రామంలో మొత్తం 255 ఖాతాలు ఉండగా, 417 ల్యాండ్ పార్సెల్ మ్యాపులు (ఎలిపీ ఎంలు) జారీచేసినట్లు తెలిపారు. వాటిపై 59 అభ్యంతరాలు వచ్చినట్లు వివరించారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించామని, గ్రామకంఠం సరిహద్దులు, ప్రభుత్వ భూములు, రహదారులు, పట్టా భూములను సర్వే చేసి హద్దులు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అభ్యంతరాలు వ్యక్తం చేసిన రైతులతో కలెక్టర్ స్వయంగా మాట్లాడారు. భూ సమస్యల పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం రీ సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని, ఈ ప్రక్రియ ద్వారా పాత సమస్యలు పరిష్కారం కావాలే తప్ప కొత్త సమస్యలు తలెత్తకూడదని అన్నారు. రైతులందరూ సమన్వయంతో ప్రభుత్వానికి సహకరిస్తే గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. చట్ట ప్రకారమే భూముల హద్దులు నిర్ణయించి, అర్హులైన వారికి వారి భూములకు సంబంధించిన పట్టాలు అందజేస్తామని స్పష్టం చేశారు. సాధ్యమైనంత వరకు అభ్యంతరాలను తగ్గించుకోవాలని రైతులకు సూచించారు. రానున్న రోజుల్లో అభ్యంతరాల స్వీకరణకు కేవలం 25 రోజుల గడువు మాత్రమే ఉంటుందని తెలిపారు. రైతులు పక్కనున్న భూముల యజమానులతో సామరస్యంగా చర్చించుకుని, అనవసర వివాదాలకు వెళ్లకుండా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. గ్రామంలో మిగిలిపోయిన సర్వేను పూర్తి చేసేందుకు గ్రామస్తులందరూ సహకరించాలని, అందరి భాగస్వామ్యంతో సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయని అన్నారు.ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.పట్టాల ప్రకారమే భూములకు హద్దులు నిర్ణయించాలని కోరారు. అన్నదమ్ముల మధ్య భూముల పంపకాల వివాదాలు, భూమి ఉన్నప్పటికీ పట్టా లేని సమస్యలు, నక్షా మ్యాపులు, సర్వే మ్యాపుల మధ్య తేడాలు, అసైన్డ్ భూములు, పట్టా భూములకు సంబంధించిన వివాదాలను వివరించారు. రీ సర్వే చట్టం ప్రకారం ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని, రైతుల సమస్యలను చట్టబద్ధంగానే పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షణ సహాయ కలెక్టర్ ఎన్. శ్రీకాంత్ రెడ్డి, చండూరు ఆర్డీవో శ్రీదేవి, స్థానిక సర్పంచ్ అండాలు, తహసిల్దార్, సర్వేయర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చౌక ధరల దుకాణంలో తనిఖీ

ఖమ్మం, వుదయం బ్యూరో నవంబర్ - 12

గత 3 నెలల సన్న బియ్యం స్టాక్‌లో 76.76 క్వింటాళ్ల కొరత, డీలర్‌పై 6A కేసు నమోదు...

జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్



సాధారణ తనిఖీలలో భాగంగా, జిల్లాలోని కామేపల్లి మండలం, గరిడేపల్లి గ్రామంలోని చౌక ధరల దుకాణం నెం. 2223009 ను జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్ కుమార్ తమ సిబ్బందితో కలిసి గురువారం తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో చౌక దుకాణంలోని స్టాక్ రికార్డులను, భౌతికంగా ఉన్న నిల్వలతో సరిపోల్చి చూడగా, గత మూడు నెలల సన్న బియ్యం స్టాక్‌కు సంబంధించి ఉండవలసిన 76.76 క్వింటాళ్ల బియ్యం నిల్వలు తక్కువగా ఉన్నట్లు గుర్తించినట్లు పౌరసరఫరాల అధికారి తెలిపారు. పేద ప్రజలకు అందవలసిన సన్న బియ్యాన్ను అక్రమంగా అమ్ముకున్న సదరు డీలర్‌పై శాఖపరంగాను, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని, లబ్ధిదారులకు అందాల్సిన సరుకులు సక్రమంగా పంపిణీ అయ్యేలా తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పౌరసరఫరాల అధికారి హెచ్చరించారు.

మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

రూ.62 లక్షలతో నిర్మించిన శ్రీశక్తి, అంగన్‌వాడీ భవనాలు ప్రారంభించిన ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి



మునగాల, నవంబర్ 12 (వుదయం):

మునగాల మండలంలోని నరసింహపురం, గణపవరం, మునగాల, నారాయణగూడెం, విజయరాఘవపురం గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిధుల నుంచి ఒక్కొక్కటి రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన ఐదు శ్రీశక్తి భవనాలను, నారాయణగూడెం గ్రామంలో రూ.12 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని కోదాడ ఎమ్మెల్యే నల్లమాద పద్మావతి రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సాధికారతతో పాటు గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం దృఢ సంకల్పంతో కృషి చేస్తోందని అన్నారు. ప్రతి గ్రామంలో మొదటి విడతలో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, రెండో విడత ఇళ్లను కూడా త్వరలో మంజూరు చేసి నిరుపేదలైన అర్హులందరికీ అందజేస్తామని తెలిపారు. మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసర్ల కోటేశ్వరరావు, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నల్లపాటి శ్రీనివాస్, ఉప్పుల జానకిరెడ్డి, పోటు అశోక్ కుమార్, ఎలక నరేందర్ రెడ్డి, బుచ్చి పాపయ్య, దేవినేని రవి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తక్కెళ్లపాటి సాయి, మునగాల గ్రామ శాఖ అధ్యక్షుడు కొమ్ము ఈదారావు, జిల్లేపల్లి వెంకటేశ్వర్లు, సెట్టిగిరి, అక్కినపల్లి రవి, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు దేశగాని జ్యోతి, స్టాలిన్ రెడ్డి, అశోక్ రెడ్డి, వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, నాయకులు, సీపీఎం నాయకులు, పంచాయతీ ఏఈ వసంత, ఏడీ హర్ష, వివిధ శాఖల అధికారులు, గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బాధిత కుటుంబానికి అండగా ఏకశిల చైర్మన్

హనుమకొండ, నవంబర్ 12 (వుదయం ప్రతినిధి):



ప్రమాద బాధిత కుటుంబానికి ఏకశిలా విద్యాసంస్థల చైర్మన్ అండగా నిలిచారు. ప్రమాదం కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆ కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న చైర్మన్ తక్షణ సహాయంగా రూ.25,000/- (ఇరవై ఐదు వేల రూపాయలు) ఆర్థిక సహాయం అందించారు. అంతేకాకుండా, ఆ కుటుంబంలోని పెద్ద కుమార్తె చదువుకు ఎలాంటి ఆటంకం కలగకుండా, ఆమె విద్యాభ్యాసం పూర్తయ్యే వరకు అయ్యే ఖర్చులన్నింటినీ తానే భరిస్తానని భరోసా ఇచ్చారు. కష్టాల్లో ఉన్న ఒక కుటుంబానికి ఆర్థిక సహాయం అందించడమే కాకుండా, ఆ కుటుంబంలోని చిన్నారి భవిష్యత్తుకు విద్య ద్వారా భరోసా కల్పించడం ఎంతో గొప్ప విషయం. ఆపద సమయంలో ఆ కుటుంబానికి ధైర్యం చెప్పడంతో పాటు, పిల్లల చదువు మధ్యలో ఆగిపోకుండా చూడాలనే చైర్మన్ గారి నిర్ణయం విద్య పట్ల, సమాజం పట్ల ఆయనకున్న నిబద్ధతకు నిదర్శనం. ఆర్థిక సహాయం ఒక కుటుంబానికి తాత్కాలిక ఉపశమనం కలిగిస్తుంది. కానీ ఒక చిన్నారి చదువు బాధ్యత తీసుకోవడం ఆమె జీవితానికి, భవిష్యత్తుకు గొప్ప భరోసా కల్పిస్తుంది. ఈ ఉదాత్తమైన ఆలోచనతో బాధిత కుటుంబానికి అండగా నిలిచిన డాక్టర్ గౌరు తిరుపతి రెడ్డి సహృదయతను గ్రామస్థులు, స్థానికులు అభినందించారు.సమాజంలో ఆపదలో ఉన్నవారికి తోడుగా నిలవడం, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ ఒక్క చిన్నారి విద్యకు దూరం కాకుండా సహకరించడం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం. ఈ కార్యక్రమంలో ఏకశిలా విద్యాసంస్థల డైరెక్టర్ సువిజ రెడ్డి, నాగారం మాజీ సర్పంచ్ చింతల పాండురంగం, పి. సాంబయ్యతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రులు బాధ్యతాయుతంగా సేవలందించాలి– కలెక్టర్

హనుమకొండ, నవంబర్ 12 (వుదయం ప్రతినిధి):

పీఎం-రాహత్ కింద ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్స

అవసరమైతేనే సిజేరియన్లు.. సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి

హెచ్ఎంఐఎస్ (HMIS) పోర్టల్‌లో వైద్య సేవల వివరాలు తప్పనిసరి



ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల అమలులో ప్రైవేట్ ఆసుపత్రులు బాధ్యతాయుతంగా భాగస్వాములు కావాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశించారు. గురువారం జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలతో నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణమే నగదు రహిత వైద్యం అందించేందుకు PM-RAHAT పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ పథకం కింద అర్హులైన బాధితులకు ఏడు రోజుల పాటు గరిష్టంగా రూ.1.50 లక్షల వరకు ఉచిత చికిత్స అందించి, ఆ వివరాలను టీఎంఎస్ (TMS) పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ఆసుపత్రుల్లో సిజేరియన్ ప్రసవాలు నిష్పత్తిని సమీక్షిస్తూ, కేవలం వైద్యపరమైన అవసరం ఉన్నప్పుడే సిజేరియన్లు చేయాలని, సాధారణప్రసవాలను ప్రోత్సహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన రికార్డులను పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (DMHO) డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ.. అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు తమ రిజిస్ట్రేషన్, ఓపీ, ఐపీ, ప్రసవాల వివరాలను HMIS పోర్టల్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. అలాగే ఐడీఎ స్పీ (IDSP) మార్గదర్శకాల ప్రకారం హెచ్ఐవీ, టీబీ, క్యాన్సర్ వంటి వ్యాధుల వివరాలను సంబంధిత పోర్టళ్లలో నమోదు చేయడంతో పాటు, నవజాత శిశువులకు సకాలంలో టీకాలు అందించాలని సూచించారు.ఈ సమావేశంలో ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ రజిత, డాక్టర్ కృష్ణారావు, డాక్టర్ జ్ఞానేశ్వర్, డాక్టర్ ప్రదీప్ రెడ్డి, ప్రైవేట్ ఆసుపత్రుల ప్రతినిధులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ నూతన చైర్‌పర్సన్‌గా డా. కొత్తపల్లి అనిత

కలెక్టర్ హరిత, సబ్ కలెక్టర్ హరీష్ చౌదరికి మర్యాదపూర్వక భేటీ



ఆసిఫాబాద్, వుదయం: నవంబర్ 12,

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్) కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా నూతన చైర్‌పర్సన్‌గా ఎన్నికైన డా. కొత్తపల్లి అనిత, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యురాలిగా ఎన్నికైన డా. కొత్తపల్లి శ్రీనివాస్ గురువారం జిల్లా కలెక్టర్ కె. హరిత, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ హరీష్ చౌదరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛాలు అందజేశారు. జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టబోయే సేవా కార్యక్రమాలు, సామాజిక కార్యక్రమాలపై వారితో చర్చించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ పోతురాజుల లక్ష్మణ్, కోశాధికారి రతన్ గైన్, జిల్లా కమిటీ సభ్యులు సుమిత్ర, పూల రఘు, డా. ప్రవీణ్, కమలేష్ హాలధర్, పోతురాజుల రమేష్ పాల్గొన్నారు.

రీ సర్వే పనులను పకడ్బందీగా పారదర్శకంగా నిర్వహించాలి

క్షేత్ర స్థాయిలో రీ సర్వే ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి వీలైనంత త్వరగా పూర్తి చేయాలి: అధికారులకు కలెక్టర్ ఆదేశం



జగిత్యాల నవంబర్ 12 (వుదయం ప్రతినిధి)

జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలం జగదేవ్‌పేట గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ గురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహిస్తున్న రీ సర్వే పనుల పురోగతిని సర్వే చేపడుతున్న విధానాన్ని భూ రికార్డులకు సంబంధించిన వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వే ప్రక్రియను ఎలాంటి తప్పులు పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రీ సర్వే ప్రక్రియలో రైతులు భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు భూముల హద్దులు విస్తీర్ణం ఇతర రెవెన్యూ రికార్డుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి ఖచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయాలని తెలిపారు. సర్వే నిర్వహణ సమయంలో రైతుల నుంచి వచ్చే అభ్యంతరాలు సమస్యలను క్షేత్ర స్థాయిలోనే పరిశీలించి పరిష్కరించేలా రెవెన్యూ సర్వే శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. నిర్దేశించిన మార్గదర్శకాలు లక్ష్యాలకు అనుగుణంగా రీ సర్వే పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.


ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి

అనంతరం అదే గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాల ప్రస్తుత స్థితిగతులను పనుల పురోగతిని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అర్హులైన పేదలకు సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పనులను ఎలాంటి జాప్యం లేకుండా వీలైనంత త్వరగా పూర్తి చేసేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి ఇంటి నిర్మాణ పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని లబ్ధిదారులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అందాల్సిన సహాయ సహకారాలు సకాలంలో అందేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఇళ్ల నిర్మాణంలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని అర్హులైన లబ్ధిదారులు త్వరగా తమ సొంత ఇళ్లలో నివసించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్ హౌసింగ్ అధికారి భాస్కర్ ల్యాండ్ సర్వే ఏడీ ఎంపీఓ మండల తహసీల్దార్ సంబంధిత అధికారులు సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేర సమీక్షా సమావేశం నిర్వహణ

శాంతిభద్రతల పరిరక్షణ, కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి

పోలీసు కమీషనర్ గౌష్ ఆలం



కరీంనగర్ నవంబర్ 12 (వుదయం ప్రతినిధి):

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో అక్టోబర్-2026 నెలకు సంబంధించిన నేర సమీక్షా సమావేశం కమిషనరేట్ ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో నిర్వహించబడింది. కమిషనరేట్ పరిధిలోని పోలీస్ అధికారులు, సిబ్బంది హాజరైన ఈ సమావేశంలో ప్రధానంగా శాంతిభద్రతల పరిరక్షణ, పెండింగ్ కేసుల పురోగతి మరియు రాబోయే పండుగల బందోబస్తుపై సమగ్ర సమీక్ష చేపట్టారు.

మహిళా భద్రత & తీవ్ర నేరాల నియంత్రణ

మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, పోక్సో కేసులు, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

కొత్త చట్టాల అమలు & సాంకేతికత వినియోగం

నూతన నేర న్యాయ చట్టాల అమలు తీరు, ఆన్‌లైన్ ఎఫ్ఐఆర్‌లు, ఈ-సమ్మన్స్ ఈ-సాక్ష్య అప్లికేషన్ల వినియోగం మరియు సీసీటీఎన్ఎస్ 2.0 వ్యవస్థపై విస్తృతంగా సమీక్షించారు.

సైబర్ నేరాల నియంత్రణ & సి ఇ ఐ ఆర్ పోర్టల్

పెరుగుతున్న సైబర్ మోసాల పట్ల ప్రజల్లో అవగాహన పెంచాలని, బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని సూచించారు. మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితుల కోసం సి ఇ ఐ ఆర్ పోర్టల్' ద్వారా ఫోన్లను గుర్తించి రికవరీ చేసే ప్రక్రియను మరింత వేగవంతం చేయాలన్నారు.

అక్రమ రవాణా, మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం

గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణా, పీడీఎస్ బియ్యం అక్రమ తరలింపు, ఇసుక అక్రమ రవాణా మరియు జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

విద్యార్థుల మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలి-కలెక్టర్

మంచిర్యాల /నవంబర్ 12 (వుదయం ప్రతినిధి)

ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేస్తూ ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని, ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని కాసిపేట మండలంలోని ప్రాంతాలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు,కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థలలో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించి, నాణ్యమైన విద్య, మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పాఠశాలలలో చేపట్టిన అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, పెండింగ్ లో ఉన్న పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేయాలని తెలిపారు. పాఠశాలలకు అవసరమైన బెడ్స్ ఇంకా అందుబాటులోకి రాలేదని గుర్తించి, సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే బెడ్స్ సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే అందుబాటులోకి వచ్చిన పరుపులతో పాటు బెడ్స్‌ను కూడా త్వరగా ఏర్పాటు చేయాలని తెలిపారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సదుపాయాలు కల్పించాలని, వంటశాల, భోజనశాలను పరిశుభ్రంగా నిర్వహించాలని, అవసరమైన అన్ని వసతులు సమకూర్చుకోవాలని



సూచించారు. మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో కొనసాగుతున్న భూ రీ సర్వే ప్రక్రియను నాయబ్ తహసిల్దార్ అంజయ్యతో కలిసి పరిశీలించి, సర్వే పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రీ సర్వే సిబ్బంది ఉదయం వేళల్లోనే క్షేత్రస్థాయికి చేరుకొని పనులు ప్రారంభిస్తే ఎక్కువ భూమిని సర్వే చేయడానికి అవకాశం ఉంటుందని, తద్వారా పనులు త్వరగా పూర్తవుతాయని తెలిపారు. సర్వే సిబ్బందికి అవసరమైన సహకారం అందించాలని తహసిల్దార్లకు సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అక్రమ భూ ఆక్రమణలకు అవకాశం కల్పించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అదేశించారు. దేవాపూర్ గ్రామంలోని బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను పరిశీలించారు. వంటశాలను తనిఖీ చేసి ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందించడంపై విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని తరగతి గదులు, వసతి గదులు, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి సదుపాయాలు కల్పించాలని, సెలవుల అనంతరం విద్యార్థులందరూ తిరిగి పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం బెల్లంపల్లి మండల కేంద్రంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సబ్ కలెక్టర్ మనోజ్ తో కలిసి మండలాల తహసిల్దార్లతో భూ రీ సర్వే, జి.ఓ.నంబర్ 59, 76 అమలు, భూభారతి డిజిటల్ ప్రక్రియ తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్ లో ఉన్న భూ సంబంధిత దరఖాస్తులు, సర్వే పనులను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. సింగరేణి ప్రాంతానికి సంబంధించిన భూ సమస్యలు, జి.ఓ.నంబర్ 76 క్రింద చేపట్టవలసిన చర్యలపై సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. భూ రీ సర్వే పనులు వేగంగా పూర్తయ్యేలా తహసిల్దార్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని, సర్వే సిబ్బంది ఉదయాన్నే గ్రామాలకు చేరుకొని పనులు ప్రారంభించేలా సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆయా మండలాల తహసీల్దార్లు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు అందేలా కృషి చేస్తా: ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, నవంబర్ 12 :



అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండల ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన చేయూత పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు పెన్షన్ పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఏళ్ల తరబడి పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకుని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న నిరుపేదల ఇబ్బందులు బాధాకరమన్నారు. ముఖ్యంగా దివ్యాంగులు, నడవలేని స్థితిలో ఉన్నవారు పెన్షన్ల కోసం ఎదురు చూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులకు పెన్షన్లు మంజూరు చేయాలని అసెంబ్లీలో పలుమార్లు ప్రస్తావించినట్లు గుర్తుచేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కారణంగా ఇబ్బందులు ఉన్నాయని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, ఇతర ఖర్చులు తగ్గించైనా అర్హులకు పెన్షన్లు అందించాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు.గ్రామాల్లో పర్యటించినప్పుడు ఒంటరి మహిళలు, వితంతువులు, చిన్న వయసులోనే భర్తలను కోల్పోయిన మహిళలు, నిరుపేద కుటుంబాలు పెన్షన్ల కోసం దరఖాస్తులు అందజేస్తున్నారని పేర్కొన్నారు. పెన్షన్ వారికి ఎంతో కొంత ఆర్థిక భరోసా కల్పిస్తుందన్నారు. పెన్షన్ల మంజూరు ప్రక్రియపై ప్రతి వారం డీఆర్డీఏ పీడీతో మాట్లాడి వివరాలు తెలుసుకునేవాడినని చెప్పారు.ఇంకా దరఖాస్తు చేసుకోని అర్హులను గుర్తించి దరఖాస్తు చేయించాలని సర్పంచులకు సూచించారు. ఒంటరి మహిళలు, డయాలసిస్ రోగులు, హెచ్ఐవీ బాధితులు తదితర అర్హులు పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ పెన్షన్లు మంజూరయ్యేలా ప్రభుత్వంతో మాట్లాడి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ రవీందర్ రాథోడ్, డీపీఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు అందించేందుకు చర్యలు: కలెక్టర్




నిర్మల్ జిల్లా (వుదయం ప్రతినిధి)12 నవంబర్ 2026

అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు అందించడంతో పాటు, లబ్ధిదారులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.గురువారం సోన్ మండలం సంగెంపేట్ గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యుత్, రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర మౌలిక వసతులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇళ్లకు అవసరమైన అన్ని సదుపాయాలను త్వరితగతిన కల్పించాలని సూచించారు.ప్రతి ఇంటికి ఇంకుడు గుంత నిర్మించాలని, తద్వారా వర్షపు నీటిని భూమిలోకి ఇంకింపజేసి భూగర్భ జలాల సంరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అవసరమైన సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.అలాగే, జాబ్ కార్డులు కలిగిన ప్రతి ఒక్కరూ విబిజి రామ్ జీ పథకం ద్వారా ఉపాధి పనులు పొందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంతోష్, ఎంపీడీవో రామకృష్ణ, హౌసింగ్ డీఈ గంగాధర్, సర్పంచ్ విలాస్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధను దిగమింగి..ప్రజల ముఖాల్లో చిరునవ్వులు నింపిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్.!

రాజన్న సిరిసిల్ల, వేములవాడ నవంబర్ 12 (వుదయం ప్రతినిధి):



కాలికి గాయమైనా...కర్తవ్యానికి సెలవు ఇవ్వని ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తన బాధను దిగమింగుతూ చేయూత పెన్షన్ పత్రాల పంపిణీకి హాజరై ప్రజల పట్ల తనకున్న నిబద్ధతను మరోసారి చాటిచెప్పారు. ప్రజాసేవకు అంకితమైన మనసుకు శారీరక బాధలు అడ్డుకావు..ప్రజల సంక్షేమమే లక్ష్యంగా అడుగులు వేసే నాయకుడికి గాయాలు సైతం కర్తవ్యాన్ని ఆపలేవు.దీనికి నిదర్శనంగా నిలిచారు ప్రభుత్వ విప్,వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్. బుధవారం నియోజకవర్గంలోని ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన కాలికి గాయమై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నప్పటికీ తన ఆరోగ్య సమస్యను పక్కనపెట్టి ప్రజల సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమానికి హాజరై మరోసారి తన ప్రజాసేవా నిబద్ధతను చాటుకున్నారు.ఈ సందర్భంగా గురువారం వేములవాడ పట్టణంలో నిర్వహించిన చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు.ఒకరోజు ముందే కథలాపూర్ మండలం ఇప్పపల్లి వద్ద ఆయన కాలికి బలమైన గాయమైంది, దీంతో వేములవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. దాదాపు వారం రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని డాక్టర్లు చెప్పారు.గాయమైన నిన్నటి నుండి వేలాది మంది అభిమానులు ఆయనను చూడడానికి పెద్దఎత్తున తన నివాసంలో క్యూ కట్టారు. గాయం కారణంగా చేయూత కార్యక్రమం రద్దు చేద్దామని స్వయంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ తెలిపిన కూడా ప్రజల కోసం ఆ కార్యక్రమాన్ని రద్దు చేయలేదు. నిబద్ధతతో కార్యక్రమానికి హాజరై కలెక్టర్ గరిమా అగ్రవాల్ తో కలిసి ప్రజలకు చేయూత మంజూరు పత్రాలు పంపిణీ చేసి దాదాపు 30 నిమిషాలకు పైగా నిలబడి ప్రసంగాన్ని కొనసాగించారు. కాలికి గాయమైన ప్రజలకు అందాల్సిన సంక్షేమ పథకాల కార్యక్రమానికి దూరంగా ఉండకుండా లబ్ధిదారుల మధ్యకు వచ్చి ఆయన గొప్ప మనసును చూపించుకున్నారు. తన నొప్పి కంటే పేదల సంతోషమే ముఖ్యమని భావించారు.ఒకవైపు కాలికి గాయం,మరోవైపు వైద్య చికిత్స అవసరం...అయినా సరే తన కోసం ఎదురుచూస్తున్న పింఛన్ లబ్ధిదారుల ముఖాల్లో చిరునవ్వు చూడాలనే తపన ఆయనను కార్యక్రమానికి తీసుకొచ్చింది.పింఛన్ మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందిస్తూ వారి సంక్షేమం పట్ల తనకున్న శ్రద్ధను చాటుకున్నారు.వృద్ధాప్యంలో ఆసరా కోసం ఎదురుచూసే వృద్ధులు, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొనే నిరుపేదలు, దివ్యాంగులు,ఇతర అర్హులైన లబ్ధిదారులకు పింఛన్ అనేది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదు.వారి జీవితాలకు ఒక భరోసా.అలాంటి భరోసాను అందించే కార్యక్రమంలో స్వయంగా పాల్గొనడం ద్వారా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రజల పట్ల తన బాధ్యతను మరోసారి గుర్తుచేశారు.పదవి కోసం కాదు..ప్రజల కోసం పనిచేసే తత్వం..రాజకీయాల్లో పదవులు రావచ్చు..పోవచ్చు కానీ ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకోవాలంటే ప్రజల కష్టాల్లో తోడుగా నిలవాలి.ప్రజల అవసరాలను గుర్తించి వారి సమస్యలకు స్పందించాలి.ఈ క్రమంలో తన ఆరోగ్య పరిస్థితిని సైతం లెక్కచేయకుండా ప్రజా కార్యక్రమానికి హాజరైన ఆది శ్రీనివాస్ తీరుపై పార్టీ శ్రేణులు,అభిమానులు,నియోజకవర్గ ప్రజల ప్రశంసలు అందుకుంటోంది.ప్రజాప్రతినిధిగా తనకు అప్పగించిన బాధ్యతను ఒక పదవిగా కాకుండా ప్రజలకు సేవ చేసే అవకాశంగా భావించే నాయకత్వ లక్షణం ఈ ఘటనలో కనిపిస్తోందని ప్రజలంతా అభిప్రాయపడుతున్నారు. గాయం కాలికి తగిలింది..ప్రజాసేవకు వేసే అడుగులను ఆపలేకపోయింది..నాయకుడంటే కేవలం ఎన్నికల సమయంలో ప్రజల మధ్య కనిపించేవాడు కాదు.ప్రజల అవసరాల సమయంలో సంక్షేమ కార్యక్రమాల వేళ వారికి అండుబాటులో ఉండేవాడే నిజమైన ప్రజానాయకుడు, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తన గాయాన్ని సైతం లెక్కచేయకుండా చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి హాజరుకావడం ఈ భావనకు అద్దం పడుతోంది.

ప్రజల పట్ల ఉన్న బాధ్యతకు,సేవ చేయాలనే సంకల్పానికి కాదు! ప్రజల సంక్షేమమే ప్రథమ కర్తవ్యం..ప్రజల మధ్యే తన ప్రయాణం అనే సందేశాన్ని మరోసారి చాటిన ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు రాష్ట్ర వ్యాప్తంగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

సిపిఎస్ విధానాన్ని రద్దు పరచి ఓపిఎస్ విధానాన్ని పునరుద్ధరించాలి:

బిటియఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామ్ రాజయ్య



కరీంనగర్ నవంబర్ 12 (వుదయం ప్రతినిధి):

తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను వెంటనే పరిష్కరించాలని పెండింగ్ లో ఉన్న డి.ఏ. బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పి.ఆర్.సి ని తక్షణమే ప్రకటించాలని, సిపిఎస్ విధానాన్ని రద్దు పరచి ఒపిఎస్ పెన్షన్ ను పునరుద్ధరించాలని టి జి బిటియఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాం.రాజయ్య "డిమాండ్" చేశారు.అదే విధంగా ఢిల్లీ నుంచి తక్షణమే ఏకీకృత సర్వీసు రూల్స్ తెప్పించే విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని, నెలవారీ పదోన్నతుల జీవోను కార్యాచరణ రూపంలో పెట్టాలని కోరారు. టి.జి. బి.టి.యఫ్ ఉపాధ్యాయ సంఘ నాయకులు రాం.రాజయ్య పెండింగ్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించని ఎడల రాజధానిని ముట్టడించే దిశగా అడుగులు వేస్తామని హెచ్చరించారు.

కోటిలింగాల ఆలయ పునర్నిర్మాణ పనులు, గోదావరి పుష్కరాల ఏర్పాట్లను పరిశీలన జిల్లా కలెక్టర్

జగిత్యాల నవంబర్ 12 (వుదయం ప్రతినిధి)



జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలం కోటిలింగాల శ్రీ కోటేశ్వర స్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న ఆలయ పునర్నిర్మాణ పనులను రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని చేపడుతున్న అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ గురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని ఇప్పటివరకు పూర్తయిన పనులను ప్రస్తుతం కొనసాగుతున్న పనులను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. రానున్న గోదావరి పుష్కరాలకు భక్తులు పెద్ద సంఖ్యలో కోటిలింగాల పుణ్యక్షేత్రానికి వచ్చే అవకాశం ఉన్నందున పుష్కరాల ఏర్పాట్లలో భాగంగా చేపట్టాల్సిన పనులు ఎంతవరకు పూర్తయ్యాయి. ఇంకా చేపట్టాల్సిన పనులు ఏమిటనే అంశాలను పరిశీలించారు.

పుష్కరాల ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి

గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. పుష్కర ఘాట్ల అభివృద్ధి భక్తులకు రాకపోకలకు అనువైన రహదారులు తాగునీటి సౌకర్యం పారిశుద్ధ్యం విద్యుత్ పార్కింగ్ వైద్య సదుపాయాలు భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పుష్కరాల సమయంలో భక్తులు సురక్షితంగా గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని మహిళలు వృద్ధులు చిన్నారులు దివ్యాంగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక సౌకర్యాలు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఆలయ పునర్నిర్మాణ పనులతో పాటు పుష్కరాల సందర్భంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేస్తూ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని నిర్దేశించిన గడువులోగా పనులన్నీ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కోటిలింగాల పుణ్యక్షేత్రానికి ఉన్న చారిత్రక ఆధ్యాత్మిక ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని ఆలయ అభివృద్ధి పుష్కరాల ఏర్పాట్లను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్ మండల తహసీల్దార్ ఎంపీఓ ఏఈలు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ధర్మపురి బీజేపీ పట్టణ మోర్చా అధ్యక్షుల నియామకం



ధర్మపురి, నవంబర్12 (వుదయం ప్రతినిధి):

ధర్మపురి పట్టణంలో భారతీయ జనతా పార్టీ మోర్చా అధ్యక్షులను ఎన్నుకున్నట్లు బీజేపీ పట్టణ అధ్యక్షుడు గాజు భాస్కర్ తెలిపారు.జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు, జిల్లా మోర్చాల ఇన్‌చార్జి, రాష్ట్ర నాయకులు దామెర. రామ్ సుధాకర్ రావు, పట్టణ సీనియర్ నాయకులు,కార్యకర్తల అభిప్రాయం మేరకు ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని వెల్లడించారు. కిసాన్ మోర్చా అప్పం శ్రీనివాస్, ఓబీసీ మోర్చా కొత్తకొండ రాజు, మహిళా మోర్చా కొంపల పద్మ, ఎస్టీ మోర్చాబోగిని సిద్ధాలు ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు, అభివృద్ధికి అందరూ సమన్వయంతో పనిచేసి రాబోయే కాలంలో అధికారమే లక్ష్యంగా అడుగులు వేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులు తిరుమందాస్ సత్యనారాయణ, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు సోమిశెట్టి శివసాయి, పట్టణ అధ్యక్షుడు మండలోజీ సూరజ్, జిల్లా కార్మిక విభాగం కో-కన్వీనర్ కాసరపు వెంకటేష్, పట్టణ ఉపాధ్యక్షులు సుంకు మధు సూదన్, అప్పం మల్లేష్,సోషల్ మీడియా ఇన్‌చార్జ్ కాశెట్టి హరీష్ తదితరులు పాల్గొన్నారు.



కాంపౌండ్ వాల్ విషయంలో వాగ్వాదం

- సర్పంచ్, ఉపసర్పంచ్‌పై దాడికి యత్నం.
- ఉపసర్పంచ్‌ను కులం పేరుతో దూషించినట్లు ఆరోపణ
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు

బషీరాబాద్ (వుదయం నవంబర్ 12):
ఇంటి కాంపౌండ్ వాల్ గ్రామకంఠం పరిధిలోకి వచ్చిందన్న విషయమై మండల పరిధిలోని నీళ్ళపల్లి గ్రామంలో వివాదం నెలకొంది. ఈ వ్యవహారంపై నీళ్లపల్లి గ్రామ సర్పంచ్ వేణుగోపాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ రాజు నాయక్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పికె. రాములు నిర్మిస్తున్న ఇంటి కాంపౌండ్ వాల్ గ్రామ కంఠం పరిధిలోకి వస్తుందని కొందరు కాలనీవాసులు పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి సంబంధిత ఇంటి వారిని ప్రశ్నించినప్పటికీ స్పందన లేకపోవడంతో కాలనీవాసులు సర్పంచ్, పంచాయతీ కార్యదర్శికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ ఫిర్యాదు నేపథ్యంలో సర్పంచ్ వేణుగోపాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ రాజు నాయక్ పికె. రాములు ఇంటికి వెళ్లి కాంపౌండ్ వాల్ నిర్మాణంపై వివరాలు అడిగినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి వాగ్వాదం చోటు చేసుకున్నట్లు ఫిర్యాదులో తెలిపారు. తమపై దాడికి యత్నించడంతో పాటు ఉపసర్పంచ్ రాజు నాయక్‌ను కులం పేరుతో దూషించినట్లు ఆరోపించారు. ఈ ఘటనకు బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సర్పంచ్, ఉపసర్పంచ్ పోలీసులను కోరారు. మండల పార్టీ అధ్యక్షుడు నర్సిరెడ్డి ఆధ్వర్యంలో సర్పంచ్ వేణుగోపాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ రాజు నాయక్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు అందజేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు వివరాలు సేకరించి విచారణ చేపట్టినట్లు సమాచారం.

భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రతి నిర్ణయం ఆచితూచి తీసుకోవాలి: జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్‌నగర్
సరోజినీ రాములమ్మ ఫార్మసీ కళాశాల 25వ గ్రాడ్యుయేషన్ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరు చదువుకున్న కళాశాలకు, జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు పిలుపువిద్యార్థులు విద్యాభ్యాసం పూర్తిచేసుకుని వృత్తి జీవితంలోకి అడుగుపెడుతున్న సమయంలో తమ భవిష్యత్తుకు సంబంధించిన ప్రతి నిర్ణయాన్ని ఎంతో ఆలోచించి, ఆచితూచి తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు. యువత తీసుకునే నిర్ణయాలే వారి భవిష్యత్తు జీవితానికి బలమైన పునాదిగా నిలుస్తాయని పేర్కొన్నారు.మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సరోజినీ రాములమ్మ ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన 25వ గ్రాడ్యుయేషన్ వేడుకలకు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై, విద్యాభ్యాసం పూర్తిచేసుకున్న విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థి దశలో కళాశాల అందించిన క్రమశిక్షణ,



విజ్ఞానం, నైపుణ్యాలను జీవితంలో ఆచరణలో పెట్టాలని సూచించారు. కళాశాల వాతావరణం నుంచి బయటకు వచ్చి వాస్తవ ప్రపంచంలోకి అడుగుపెట్టిన తర్వాత ఉద్యోగ, వ్యాపార రంగాల్లో వ్యక్తుల సామర్థ్యం, పనితీరు, ఫలితాలే వారి ప్రతిభకు కొలమానాలుగా నిలుస్తాయని తెలిపారు. కొత్త వాతావరణానికి అలవాటు పడేందుకు కొంత సమయం పట్టినా, ఆత్మవిశ్వాసం, పట్టుదల, క్రమశిక్షణతో లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు.

వచ్చే పదేళ్లు జీవితానికి కీలకం
ప్రస్తుతం పట్టాలు అందుకుంటున్న వి



ద్యార్థులు 23 నుంచి 26 ఏళ్ల వయస్సులో ఉన్నారని, ఈ దశలో తీసుకునే నిర్ణయాలు వారి రాబోయే జీవితంపై ఎంతో ప్రభావం చూపుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా వచ్చే పదేళ్లు వారి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో అత్యంత కీలకమని అన్నారు. ఇతరుల ఒత్తిడికి, తాత్కాలిక భావోద్వేగాలకు లోనై తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని హితవు పలికారు. జీవితంలో ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే ముందు తల్లిదండ్రులు, గురువులు, శ్రేయోభిలాషుల సలహాలు తీసుకుని, సరైన అవగాహనతో ముందుకు సాగాలని సూచించారు. చెడు అలవాట్లకు, చెడు స్నేహాలకు దూరంగా ఉంటూ లక్ష్యసాధనపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.
సరోజినీ రాములమ్మ ఫార్మసీ కళాశాలలో విద్యనభ్యసించిన పలువురు పూర్వ విద్యార్థులు నేడు దేశ, విదేశాల్లోని ప్రముఖ ఫార్మాస్యూటికల్ సంస్థల్లో ఉన్నత స్థానాల్లో కొనసాగుతుండటం గర్వకారణమని కలెక్టర్ అభినందించారు. అదే స్ఫూర్తితో ప్రస్తుతం పట్టాలు అందుకున్న విద్యార్థులు కూడా తమ ప్రతిభతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. తాము చదువుకున్న కళాశాలకు, మహబూబ్‌నగర్ జిల్లాకు, తెలంగాణ రాష్ట్రానికి, భారతదేశానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అనంతరం బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, ఫార్మ్ డి పూర్తిచేసుకున్న 90 మంది విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు.
ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. మంగీలాల్, కార్యదర్శి పద్మలత, చైర్మన్ డాక్టర్ పి. బాలరాజ్, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశం

సంగారెడ్డి, నవంబర్ 12:వుదయం.
సంగారెడ్డి జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు జి. అంజయ్య, కార్యదర్శి ఎం. మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు .ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి, డిప్యూటీ డైరెక్టర్ (వయోజన విద్య), జిల్లా పంచాయతీ అధికారి పాల్గొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ పరిధిలోని అన్ని శాఖా గ్రంథాలయాలకు అవసరమైన ఫర్నిచర్, పుస్తకాలు, ప్రింటింగ్ స్టేషనరీ, సాధారణ స్టేషనరీ కొనుగోళ్లకు సమావేశం ఆమోదం తెలిపింది.
అలాగే 202627 ఆర్థిక సంవత్సరానికి పౌర గ్రంథాలయ శాఖ సంచాలకులు హైదరాబాద్ నుంచి మంజూరైన వార్షిక బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు. జిల్లాలోని జహీరాబాద్, మునిపల్లి, కంగ్టి, పుల్కల్, మానూరు శాఖా గ్రంథాలయాలకు నూతన భవనాల నిర్మాణం చేపట్టేందుకు సంచాలకుల ఆమోదం పొందడానికి అనుమతి ఇచ్చారు.బడ్జెట్ పరిమితులకు లోబడి జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు శాఖా గ్రంథాలయాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కూడా సమావేశం ఆమోదం తెలిపింది.

అసిస్టెంట్ కుక్ పోస్టుకు ఆహ్వానం

కొండపాక ,వుదయం
మండలంలోని ఆదర్శ పాఠశాలలో బాలికల హాస్టల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ కుక్ పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురువారం రోజు పాఠశాల ప్రిన్సిపాల్ నాగార్జునసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 15వ తారీఖు వరకు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులకు కనీస అర్హతగా ఏడో తరగతి ఉత్తీర్ణులై ఉండి, కొండపాక మండలానికి చెందినవారై ఉండాలన్నారు.ఇట్టి పోస్ట్ కుజీతం 6500 గా చెల్లిస్తారని, ఆసక్తి ఉన్న వాళ్ళు నేరుగా ఆదర్శపాఠశాలకు వచ్చి కలవాలని తెలిపారు.

గ్రంథాలయ భవన నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక

నారాయణపేట నవంబర్ 12 (వుదయం ప్రతినిధి)
నారాయణపేట జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయ భవన పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా అన్ని పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సిహెచ్. ప్రియాంక సంబం ధిత అధికారులను ఆదేశిం చారు.గురువారం జిల్లా కేంద్రంలోని ఎర్ర గుట్ట వద్ద నూతన గ్రంథాలయ భవన నిర్మాణ పనులను జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ వార్ల విజయ్ కుమార్, సంబంధిత శాఖల అధికా రులతో కలిసి కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా భవనంలోని వివిధ గదులు, రీడింగ్ రూమ్, స్టోర్ రూమ్, ఇతర మౌలిక సదుపాయాల పను ల పురోగతిని అధికారుల ను అడిగితెలుసుకున్నారు.
ఈ సందర్భంగా అధికారు లు మాట్లాడు తూ తెలంగా ణ ప్రభుత్వం పాఠకులకు, విద్యార్థులకు, యువతీ యువకులకు మెరుగైన గ్రంథాలయ సౌకర్యాలు అందించాలనే ఉద్దేశంతో నారాయణ పేట జిల్లా కేంద్ర గ్రంథాలయ భవన నిర్మాణా నికి రూ.1.53 కోట్ల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఇప్పటి వరకు సుమారు రూ.90 లక్షల విలువైన



పనులు పూర్తయ్యాయని, మిగిలిన పను లుకొనసాగుతున్నాయని వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లా డుతూ గ్రంథాలయ భవనం నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఇంజనీ రింగ్ అధికారులు రూపొం దించిన ప్రణాళిక ప్రకారం నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులన్నీ పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. భవన నిర్మాణంలో వాస్తు, సౌకర్యవం తమైన నిర్మాణ విధానాల ను పరిగణనలోకి తీసుకోవ డంతో పాటు పాఠకులకు ఆహ్లాదకరమైన వాతావ రణం కల్పించేలా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు.
ప్రత్యేకంగా రీడింగ్ రూమ్ ను విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు, పాఠకులు సౌకర్యవంతంగా కూర్చొని చదువుకునే విధంగా ఆకర్షణీయమైన డిజైన్‌తో అభివృద్ధి చేయాలని ఆదే శించారు. స్టోర్ రూమ్‌తో పాటు గ్రంథాలయానికి సంబంధించిన మిగిలిన గదులు, అంతర్గత పను లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. భవనానికి అవసరమైన గ్లాస్ ఫ్యాబ్రికేషన్ పనులను ఇంజనీ రింగ్ ప్లాన్ ప్రకారం నాణ్య తతో చేపట్టాలని, భవనం పై అంతస్తు (మిద్దె)పై చేప ట్టాల్సిన పనులను కూడా వెంటనే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. గ్రంథాలయానికి వచ్చే పాఠకులు, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, గాలి, వెలు తురు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించా రు. నిర్మాణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.అదేవిధంగా గ్రంథాలయ భవనం పక్కనే నిర్మాణంలో ఉన్న నీటి ట్యాంకు పనులను కూడా పరిశీలించిన కలెక్టర్, వాటి ని డిసెంబర్ నెలలోగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సంబంధి త అధికారులను ఆదేశిం చారు.

శిథిలావస్థలో ఉన్న పాత ఏరియా ఆసుపత్రి భవనం పరిశీలన...
అనంతరం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయానికి ఎదురుగా సివిల్ లైన్ ప్రాంతంలో ఉన్న పాత ఏరియా ఆసుపత్రి భవనాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ప్రస్తుతం శిథిలావస్థకు చేరిన భవనం పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, భవనానికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. భవనం ప్రస్తుత స్థితి, భవిష్యత్తులో చేపట్టాల్సిన చర్యలకు సంబంధించి అవసరమైన వివరాలను సేకరించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ వార్ల విజయ్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేతా సత్య యాదవ్, పబ్లిక్ హెల్త్ ఈఈ విజయభాస్కర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్, పబ్లిక్ హెల్త్ ఏఈ జ్ఞానేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరువు రైతులకు మానవతా దృక్పథంతో రుణ ఉపశమనం అందించాలి: అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్

- జిల్లాలో 8 కరువు మండలాల గుర్తింపు.. రుణాల పునర్వ్యవస్థీకరణ, వాయిదాల మినహాయింపుపై ఆదేశాలు
- జిల్లా వార్షిక రుణ ప్రణాళికలో 46.56 శాతం పురోగతి.. రూ.5,507.38 కోట్ల రుణాల మంజూరు

సిద్దిపేట, నవంబర్ 12 (వుదయం బ్యూరో)
సిద్దిపేట జిల్లాలో ఖరీఫ్ 2026 కాలంలో కరువు ప్రభావానికి గురైన రైతులకు భారతీయ రిజర్వ్ బ్యాంకు నిబంధనలు, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సకాలంలో రుణ ఉపశమన చర్యలు అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీ కిరణ్ బ్యాంకర్లను ఆదేశించారు. గురువారం స్థానిక సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ



సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రత్యేక జిల్లా స్థాయి సంప్రదింపుల కమిటీ సమావేశంలో ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల (సంఖ్య 03, తేదీ 24.10.2026) ప్రకారం జిల్లాలో 8 మండలాలను (ఒకటి తీవ్ర కరువు, ఏడు మధ్యస్థ కరువు) కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించారని తెలిపారు. అర్హులైన రైతులకు పాత పంట రుణాల పునర్వ్యవస్థీకరణ, రుణ చెల్లింపులపై తాత్కాలిక విరామం (మారటోరియం), గడువు పొడిగింపుతో పాటు తిరిగి వ్యవసాయ కార్యకలాపాలు కొనసాగించేందుకు అదనపు రుణాలు మంజూరు చేయాలని స్పష్టం చేశారు. వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ, గొర్రెలు, మేకలు, కోళ్లు, చేపల పెంపకంపై ఆధారపడిన లబ్ధిదారులకు కూడా అవసరమైన రుణ సహకారం అందించాలన్నారు. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు బ్యాంకులతో సమన్వయం చేసుకుని కరువు ప్రభావిత రైతుల జాబితాను అందించి, అర్హులందరికీ ప్రయోజనాలు అందేలా చూడాలని సూచించారు. ఇదే సమావేశంలో 202627 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన జిల్లా రుణ ప్రణాళిక పురోగతిని సమీక్షిస్తూ, బ్యాంకులు ఇప్పటివరకు మొత్తం రూ.5,507.38 కోట్ల రుణాలు మంజూరు చేసి నిర్దేశించిన వార్షిక లక్ష్యంలో 46.56 శాతం పురోగతి సాధించాయని వెల్లడించారు. ఇందులో ప్రాధాన్యతా రంగం కింద రూ.3,905.08 కోట్లు (40.36 శాతం), ప్రాధాన్యతేతర రంగం కింద రూ.1,602.30 కోట్ల (74.37 శాతం) రుణాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా వ్యవసాయం, సూక్ష్మచిన్న తరహా పరిశ్రమలు, మహిళా స్వయం సహాయక సంఘాలు, విద్య, గృహ నిర్మాణ రంగాలకు రుణాల మంజూరులో మరింత వేగం పెంచాలని బ్యాంకర్లను ఆదేశించారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో పాటు రైతులు, యువ పారిశ్రామికవేత్తలు, చిన్న వ్యాపారులకు మరింత సహకారం అందిస్తూ నిర్దేశించిన వార్షిక లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో వివిధ బ్యాంకుల ప్రాంతీయ అధికారులు, జిల్లా సమన్వయకర్తలు, బ్యాంకు శాఖల ప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలు.
ఇరిగేషన్ డీఈఈపై ఏసీబీ సోదాలు



- నాగర్‌కర్నూల్‌లోని కార్యాలయంతో పాటు 10 చోట్ల ఏకకాలంలో తనిఖీలు

నాగర్ కర్నూల్, నవంబర్ 12 (వుదయం బ్యూరో):
ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణలపై నాగర్‌కర్నూల్ ఇరిగేషన్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (డీఈఈ) సత్యనారాయణ గౌడ్‌పై ఏసీబీ అధికారులు గురువారం సోదాలు నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి ఏకకాలంలో 10 ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు.నాగర్‌కర్నూల్‌లోని ఇరిగేషన్ కార్యాలయంలో ఆయన ఛాంబర్‌తో పాటు హైదరాబాద్‌లోని నివాసం, వనపర్తి జిల్లా ఖిల్లా ఘనపురం మండలం సోలిపూర్‌లోని స్వగ్రామ నివాసంలోనూ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్తులకు సంబంధించిన కీలక పత్రాలు, రికార్డులను పరిశీలించి వివరాలు సేకరించినట్లు సమాచారం. ఆదాయ వనరులు, కూడబెట్టిన ఆస్తుల వివరాలపై అధికారులు విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. సోదాల్లో స్వాధీనం చేసుకున్న పత్రాలు, గుర్తించిన ఆస్తుల విలువకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది.


ఇరిగేషన్ కార్యాలయంలో సోదాలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు

ఎల్ నినో గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించాలి

- కరువు పరిస్థితులపై ప్రజలకు అవగాహన కల్పించాలి.. ఇందిరమ్మ ఇళ్లు, జలసిరి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి
- ఉపాధి హామీ పనుల ద్వారా కూలీలకు విస్తృతంగా పని కల్పించాలి
- అధికారులతో సమీక్షలో అదనపు కలెక్టర్ నగేష్ ఆదేశాలు

మెదక్, నవంబర్ 13 (వుదయం ప్రతినిధి):
జిల్లాలో ఎల్ నినో గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించి, కరువు పరిస్థితులపై ప్రజలకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ నగేష్ అధికారులను ఆదేశించారు. గ్రామసభల నిర్వహణలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.గురువారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయం నుంచి జిల్లా



గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్, సంక్షేమ శాఖల అధికారులతో పాటు ఎంపీడీవోలతో గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్ నినో గ్రామసభల నిర్వహణ, ఇందిరమ్మ ఇళ్ల పురోగతి, జలసిరి పనులు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణం తదితర అంశాలపై మండలాల వారీగా సమీక్షించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఎల్ నినో ప్రభావం, కరువు పరిస్థితులపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు సంబంధిత శాఖల అధికారులు గ్రామసభల్లో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. జలసిరి పథకం కింద కొన్ని మండలాల్లో కొత్త పనుల ప్రారంభం, గ్రౌండింగ్, పనుల పూర్తిలో ఆశించిన స్థాయిలో పురోగతి లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మంజూరైన పనులను వెంటనే ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.
కమ్యూనిటీ సోక్‌పిట్ల నిర్మాణంలోనూ పురోగతి పెంచాలని, వచ్చే వారం నాటికి నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని స్పష్టం చేశారు. గ్రామసభల్లో ప్రతి శాఖకు సంబంధించిన కార్యక్రమాలు, అభివృద్ధి పనులపై తప్పనిసరిగా చర్చించాలని సూచించారు.

రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో భూ సమస్యలు, అభ్యంతరాల పరిష్కారానికి ప్రత్యేక గ్రామ సభలు

వనపర్తి నవంబర్ 12 వుదయం ప్రతినిధి
జిల్లాలో భూముల సమగ్ర రీసర్వే ప్రక్రియ పూర్తయిన గ్రామాల్లో 9(2) నోటీసులపై వచ్చిన అభ్యంతరాలు, ఇతర భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ నేడొక ప్రకటనలో తెలిపారు. మొదట అమరచింత మండలం చింతరెడ్డిపల్లి, మదనాపూర్ మండలం అమరావతి నగర్ గ్రామాల్లో రీసర్వే అనంతరం జారీ చేసిన 9(2) నోటీసులపై రైతులు, భూ యజమానుల నుంచి వచ్చిన అభ్యంతరాలను శుక్రవారం ఉదయం 9:30 గంటలకు ఈ గ్రామ సభల్లో పరిశీలించడంతో పాటు, గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలపై రైతులు, భూ యజమానులతో నేరుగా చర్చించి పరిష్కార మార్గాలను చూపడం జరుగుతుందని పేర్కొన్నారు. కావున చింతరెడ్డిపల్లి, అమరావతి నగర్ గ్రామాల



ప్రజలు, రైతులు, భూ యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని శుక్రవారం ఉదయం 9:30 గంటలకు నిర్వహించే ప్రత్యేక గ్రామ సభలకు పెద్ద సంఖ్యలో హాజరై తమ భూ సమస్యలు, అభ్యంతరాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారంలో భాగస్వాములు కావాలని అదనపు కలెక్టర్ కోరారు. ఈ గ్రామ సభలకు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్, ఆర్డీఓ సుబ్రహ్మణ్యం స్వయంగా హాజరై రైతులు, భూ యజమానుల నుంచి అభ్యంతరాలు, సమస్యలను స్వీకరించి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టనున్నారు.

నాగులాపల్లి 2BHK కాలనీపై ప్రభుత్వ నిర్లక్ష్యం.. ప్రజలు వలసబాట.!
హాస్పిటల్ లేదు.. అంగన్‌వాడీ లేదు.. బస్సులు లేవు..

వుదయం, తెల్లాపూర్ ప్రతినిధి (నవంబర్ 12)
నాగులాపల్లి 2BHK డబుల్ బెడ్‌రూమ్ హౌసింగ్ కాలనీ ఫేజ్-3లో కనీస మౌలిక సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నివాసాల కోసం ఇళ్లు కేటాయించిన ప్రభుత్వం, అక్కడ జీవించడానికి అవసరమైన సౌకర్యాలు కల్పించడం మరిచిపోయిందా? అనే ప్రశ్నలు లబ్ధిదారుల నుంచి వ్యక్తమవుతున్నాయి.కాలనీలో హాస్పిటల్ లేదు, అంగన్‌వాడీ కేంద్రం లేదు, సరైన బస్సు సౌకర్యం లేదు. కనీస వసతులు లేకపోవడంతో పలువురు కుటుంబాలు కాలనీని వదిలి వలస వెళ్తున్న పరిస్థితి నెలకొంది. మరోవైపు విద్యార్థుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. 64 మంది విద్యార్థులకు



కేవలం ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే అందుబాటులో ఉన్నారు. పాఠశాలలో కనీసం వాష్‌రూమ్‌లు, బెంచీలు, తాగునీటి సౌకర్యం కూడా లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇచ్చామని చెప్పుకుంటున్న ప్రభుత్వం, ఆ ఇళ్లలో ప్రజలు ఎలా జీవిస్తున్నారో ఒక్కసారి పరిశీలించలేదా? విద్యార్థులకు కనీస వసతులు కల్పించలేని పరిస్థితి ఎందుకు? ప్రజారోగ్యం, విద్య, రవాణా వంటి మౌలిక సదుపాయాలపై పాలకులకు బాధ్యత లేదా? అని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అభివృద్ధి పనులు కొనసాగిస్తుందో, లేదో వేచి చూడాల్సిందే.



అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే భరోసా

- అధైర్యపడొద్దు.. మీకు అండగా ఉంటా.. ప్రభుత్వ పరంగా, వ్యక్తిగతంగా ఆదుకుంటా" – బీ ఎం రెడ్డి

తాండూరు, నవంబర్ 12 (వుదయం ప్రతినిధి):
ప్రమాదం రూపంలో కష్టాలు ఎదురైనా.. బాధిత కుటుంబానికి అండగా నిలుస్తానంటూ తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి భరోసా కల్పించారు. పెద్దేముల్ మండలం గిర్మాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో సమ్మమ్మ అనే గృహిణి ఇంట్లో గురువారం ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇంట్లోని వస్తువులు దగ్ధమై బాధిత కుటుంబానికి నష్టం వాటిల్లింది.ఈ విషయం స్థానిక కాంగ్రెస్ నాయకులు లోంక నర్సింహులు, గ్రామ సర్పంచ్ శివరాం నాయక్ ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. బాధిత కుటుంబానికి జరిగిన నష్టంపై ఆవేదన వ్యక్తం చేస్తూ వెంటనే ఫోన్ ద్వారా సమ్మమ్మ కుటుంబ సభ్యులతో మాట్లాడి పరామర్శించారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబాన్ని ఓదారుస్తూ "అధైర్యపడవద్దు.. మీకు నేను అండగా ఉంటా.. కష్టకాలంలో ఒంటరిగా వదిలిపెట్టను" అంటూ ధైర్యం చెప్పారు. ప్రభుత్వం తరపున అందాల్సిన ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తానని, బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించడంతో పాటు వ్యక్తిగతంగానూ అవసరమైన సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు.ప్రజలకు ఆపద వచ్చినప్పుడు స్పందించడం, బాధితులకు భరోసా కల్పించడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని ఎమ్మెల్యే పేర్కొన్నట్లు సమాచారం. అగ్నిప్రమాదంతో నష్టపోయిన కుటుంబానికి ప్రభుత్వపరంగా, వ్యక్తిగతంగా అండగా ఉంటానని ఎమ్మెల్యే ఇచ్చిన భరోసా స్థానికంగా చర్చనీయాంశమైంది.



రూ.26 వేల వేతనం చెల్లించాల్సిందే!

- ప్రభుత్వ ఆసుపత్రుల కాంట్రాక్టు కార్మికుల గర్జన
- గద్వాల ఆసుపత్రి ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా.. పెండింగ్ హామీలు అమలు చేయాలని డిమాండ్

గద్వాల, నవంబర్ 12 వుదయం బ్యూరో)
ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏళ్ల తరబడి సేవలందిస్తున్న కాంట్రాక్టు కార్మికులకు నెలకు రూ.26 వేల వేతనం చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం గద్వాల ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 10 నుంచి 20 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులకు నాలుగేళ్లుగా వేతనాలు పెంచకపోవడం అన్యాయమన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీనే



జీతాలు చెల్లించాలని, చట్టబద్ధమైన సెలవులు, ఏడాది బోనస్, రెండు జతల యూనిఫారాలు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వేతనాల నుంచి ఈఎస్ఐ, పీఎఫ్ పేరుతో నగదు మినహాయిస్తున్నప్పటికీ కార్మికుల ఖాతాల్లో నిబంధనల ప్రకారం జమ చేయడం లేదని ఆరోపించారు. గతంలో ఆగస్టు 9న డీఎంఈ కార్యాలయం ఎదుట నిర్వహించిన ఆందోళన సందర్భంగా ఇచ్చిన వేతనాల చెల్లింపు హామీ కూడా అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నూతన కాంట్రాక్టర్లను ఆహ్వానించి, కార్మికులకు మెరుగైన వేతనాలు, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్మికుల హక్కుల సాధన కోసం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ ధర్నాలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి. ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి రంగన్న, మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరామిరెడ్డి, ఆశన్న, కృష్ణ, ప్రవీణ్, వెంకటేష్ తదితర నాయకులు, ఆసుపత్రి కార్మికులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయ పంటలను పరిశీలించిన వ్యవసాయ అధికారులు



వట్టిపల్లి నవంబర్ 12 (వుదయం ప్రతినిధి)
మండల పరిధిలోని ఖాదిరాబాద్ గ్రామంలో సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతుల వరి, కంది పంట పొలాలను వ్యవసాయ అధికారులు సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా పంటల సాగు విధానం, సేంద్రియ వ్యవసాయ పద్ధతుల గురించి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నావ్య ఫీల్డ్ ఇన్‌స్పెక్టర్ పరిమళ, వ్యవసాయ విస్తరణ అధికారి సురేఖ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.



దేపల్లి గ్రామంలో భూ రీసర్వే పనులను

క్షేత్రస్థాయిలో పరిశీలించిన అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.ఎల్.బి. హరిప్రియ


మహబూబ్‌నగర్
దేపల్లి గ్రామంలో భూ రీసర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.ఎల్.బి. హరిప్రియమహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలం దేపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీమతి జె.ఎల్. బి. హరిప్రియ సంబంధిత రెవెన్యూ, సర్వే అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రామంలో భూ రీసర్వే పనుల పురోగతిని సమీక్షించారు. పట్టా వ్యవసాయ భూములు, ప్రభుత్వ భూములు, ఇతర భూములకు సంబంధించిన వివరాలను పరిశీలించారు. ఇప్పటికే ఉన్న రెవెన్యూ రికార్డులను క్షేత్రస్థాయి పరిస్థితులతో సరిపోల్చి భూముల విస్తీర్ణాలు, సరిహద్దులను తనిఖీ చేశారు. సర్వే నంబర్లు, భూముల విస్తీర్ణాలు, భూముల వర్గీకరణ వివరాలను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఖచ్చితంగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రైతులతో మాట్లాడి భూ రీసర్వే ప్రక్రియపై అవగాహన కల్పించారు. రైతులకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. రీసర్వే నిర్వహించే తేదీ, సమయాన్ని ముందుగానే పట్టాదారులకు తెలియజేయాలని, సర్వే సమయంలో వారు తమ తాజా భూ రికార్డులతో అందుబాటులో ఉండేలా చూడాలని సర్వే బృందానికి సూచించారు. సర్వే పూర్తయిన అనంతరం సంబంధిత పట్టాదారులకు వారి భూముల తుది సర్వే విస్తీర్ణాలను తెలియజేయాలని ఆదేశించారు. రైతులతో సమన్వయం చేసుకుంటూ, సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి భూ రీసర్వే ప్రక్రియను పూర్తి పారదర్శకతతో, ఖచ్చితత్వంతో నిర్వహించాలని స్పష్టం చేశారు. భవిష్యత్తులో భూ సంబంధిత వివాదాలకు ఆస్కారం లేకుండా సర్వే పనులను పకడ్బందీగా, నిర్ణీత పద్ధతిలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈ పరిశీలనలో జిల్లా సర్వే మరియు భూ రికార్డుల సహాయ సంచాలకులు (AD S&LR) అశోక్, నవాబుపేట తహసీల్దార్ సురేష్, .డిప్యూటీ తహశీల్దార్ సువర్ణ,డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే (Dy. IOS) మూసా,మండల సర్వేయర్ అహ్మద్, సంబంధిత సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్లక్ష్య రాజ్యం- రోగుల ప్రాణాలతో సిబ్బంది చెలగాటం

- విధి సమయం ముగియకముందే నర్సుల నిష్క్రమణ?
- మరుగుదొడ్లలో దుర్వాసన.. లీకేజీలతో వృథాగా నీరు
- సూపరింటెండెంట్ పర్యవేక్షణ ఏది?

ఝరాసంగం నవంబర్-12(ఉదయం ప్రతినిధి)
పేదల ప్రాణాలకు భరోసా కల్పించాల్సిన ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్లక్ష్యం తాండవిస్తోందా? వైద్యం కోసం వచ్చిన రోగులను పట్టించుకోవాల్సిన సిబ్బంది విధులను పక్కనపెట్టి కబుర్లలో మునిగిపోతున్నారా? రోగుల ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాల్సిన సమయంలో సెల్‌ఫోన్లలో కాలక్షేపం చేస్తున్నారా? సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చోటుచేసుకున్నట్లు చెబుతున్న పరిణామాలు ఈ ప్రశ్నలకు తావిస్తున్నాయి.
జిల్లా నలుమూలల నుంచి అత్యవసర చికిత్స కోసం వచ్చే పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రే పెద్ద దిక్కు. అలాంటి ఆసుపత్రిలోని వయోవృద్ధుల వార్డులో సోమవారం మధ్యాహ్నం విధులకు హాజరైన కొందరు హెడ్ నర్సులు, ట్రైనింగ్ నర్సులు, ఇతర సిబ్బంది వ్యవహారశైలిపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాల్సిన సిబ్బంది గుంపులుగా కూర్చొని మాట్లాడటం,





బీపీ, పల్స్ పరీక్షించే సమయంలోనూ సెల్‌ఫోన్లు చూస్తూ నవ్వుకుంటూ రిపోర్టులు రాస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పరీక్షల వివరాలు తప్పుగా నమోదు చేస్తే రోగుల ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

డ్యూటీ సమయం ముగియకముందే వెళ్లిపోయారా?
సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు విధులకు వచ్చిన నర్సులు సాయంత్రం 7.40 గంటల సమయంలోనే వెళ్లిపోయారని, ఆ సమయంలో వార్డులో ఒక్క ట్రైనింగ్ నర్సు మాత్రమే ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నైట్ డ్యూటీ సిబ్బంది బాధ్యతలు స్వీకరించే వరకు రోగుల





పరిస్థితి ఏమిటి? అత్యవసర పరిస్థితి ఎదురైతే బాధ్యత ఎవరిది? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

వార్డుల్లో దుర్వాసన.. నీటి వృథా!
వైద్య సేవలే కాదు.. ఆసుపత్రి పారిశుద్ధ్య నిర్వహణ కూడా అధ్వానంగా ఉందనే విమర్శలు ఉన్నాయి. వయోవృద్ధుల వార్డులోని మరుగుదొడ్లు, స్నానపు గదులకు సంబంధించిన పైపులు, కుళాయిల్లో లీకేజీలు ఏర్పడి 24 గంటలూ నీరు వృథాగా పోతున్నట్లు తెలుస్తోంది. ఇక ఎమర్జెన్సీ వార్డులోని మరుగుదొడ్ల పరిస్థితి మరింత దారుణంగా ఉందని రోగుల బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తలుపులు లేకపోవడం, నీరు నిలిచిపోయి మురుగు గుంటల్లా మారడం, భరించలేని దుర్వాసనతో రోగులు, సహాయకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మహిళలు, పురుషులు ఒకే వాష్‌రూమ్‌ను ఉపయోగించుకోవాల్సిన దుస్థితి నెలకొందని విమర్శలు వినిపిస్తున్నాయి.
అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?
కొత్త భవనాలు నిర్మించినా కనీస సౌకర్యాలు కల్పించలేని పరిస్థితి ఎందుకు ఏర్పడింది? సిబ్బంది విధుల నిర్వహణను పర్యవేక్షించాల్సిన అధికారులు ఏం చేస్తున్నారు? ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు ఈ సమస్యలు కనిపించడం లేదా? జిల్లా కేంద్రంలోని ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిలోనే ఇలాంటి పరిస్థితులు ఉంటే మండల స్థాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఆసుపత్రి సూపరింటెండెంట్ స్పందించి ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవడంతోపాటు పారిశుద్ధ్యం, నీటి లీకేజీలు, మరుగుదొడ్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. పేదల ప్రాణాలకు భరోసా ఇవ్వాల్సిన ప్రభుత్వ ఆసుపత్రి నిర్లక్ష్యానికి నిలయంగా మారకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

మరికల్ నవంబర్ (12 ఉదయం ప్రతినిధి)
మరికల్ మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో పెద్ద చింతకుంట పల్లె గడ్డ గురువారం ఐకెపి ఆధ్వర్యంలో వారి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు ఈ సందర్భంగా ఏపీఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ రైతులు వరి కొనుగోలు కేంద్రాలలోని అమ్ముకోవాలని మరియు ఏమని ఇబ్బందులు అయితే మాకు వెంటనే సంప్రదించాలని ఆయన కోరారు ఈ కేంద్రాలని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు రైతులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

రేషన్ డీలర్ల సమస్యలపై ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు వినతిపత్రం



- రూ.5 వేల గౌరవ వేతనం.. క్వింటాలుకు రూ.300 కమిషన్ ఇవ్వాలి
- రూ.600 కోట్ల విలువైన పాత బియ్యం పురుగులు, ఎలుకల పాలైంది.. డీలర్లపై తరుగుభారం మోపడం సరికాదు

సంగారెడ్డి, నవంబర్ 12 (ఉదయం):
ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రేషన్ డీలర్లకు నెలకు రూ.5 వేల గౌరవ వేతనం, క్వింటాలుకు రూ.300 కమిషన్ తక్షణమే అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను కలిసి తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సదాశివపేట అధ్యక్షుడు కె. బసంతప్ప, నిజాంపూర్ ప్రధాన కార్యదర్శి ఎం. మంతయ్య, కంది ప్రతినిధి ప్రభాకర్ తదితరులు డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.
16 నెలలుగా గోదాముల్లోనే పాత బియ్యం రాష్ట్రవ్యాప్తంగా గోదాములు, ఎంఎల్ఎస్ పాయింట్లు, రేషన్ షాపుల్లో సుమారు రూ.600 కోట్ల విలువైన పాత దొడ్డు బియ్యం 16 నెలలుగా నిల్వ ఉండటంతో పురుగులు, ఎలుకలు, పందికొక్కుల బారిన పడి పాడవుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. బియ్యం తరుగును కూడా డీలర్ల జేబుల నుంచి చెల్లించాలని అధికారులు ఒత్తిడి చేయడం సరికాదన్నారు. సంగారెడ్డి జిల్లాలో 5 నుంచి 6 క్వింటాళ్ల వరకు తరుగును డీలర్లే భరించాలంటూ వేధిస్తున్నారనే ఆరోపణలపై అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు.

రూ.100 కోట్ల క్యాంప్ ఆఫీస్‌కు నిధులున్నాయి.. డీలర్లకు లేవా?
ముఖ్యమంత్రి కొత్త క్యాంప్ ఆఫీస్‌కు రూ.100 కోట్లు, కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.18 కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం.. రాష్ట్రంలోని 17,200 మంది రేషన్ డీలర్లకు నెలకు రూ.10 కోట్లు ఖర్చు చేసి రూ.5 వేల గౌరవ వేతనం ఇవ్వలేదా అని చింతా ప్రభాకర్ ప్రశ్నించారు. రేషన్ డీలర్లకు రూ.300 కమిషన్ చెల్లించాలన్న డిమాండ్‌ను కూడా ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.

పేదలకు అదనపు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలి
ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల నేపథ్యంలో పేద కుటుంబాలను ఆదుకునేందుకు రేషన్ షాపుల ద్వారా మరిన్ని నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని సూచించారు. రేషన్ షాపులను మినీ సూపర్ మార్కెట్లుగా మారుస్తామన్న హామీని కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు.గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రేషన్ బియ్యం పరిమాణాన్ని పెంచడంతో పాటు డీలర్ల కమిషన్‌ను రూ.140కు పెంచిన విషయాన్ని గుర్తుచేశారు. అప్పట్లో రూ.300 కమిషన్ ఇవ్వాలని డిమాండ్ చేసిన ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రస్తుతం పౌరసరఫరాల శాఖ మంత్రిగా ఉండి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.
డీలర్లు అధైర్యపడవద్దని, వారి సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ భరోసా ఇచ్చారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో రేషన్ డీలర్ల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి నిలదీస్తామని తెలిపారు.

బస్వాపూర్‌లో ఘనంగా సదర్ సమ్మేళనం

యాదవుల ఐక్యతకు చాటిన ప్రతీక

- కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ స్టేట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం బిక్షపతి

సంగారెడ్డి జిల్లా/ పుల్కల్ ఉదయం:
మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామంలో యాదవ సోదరుల ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ సమ్మేళనం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి తెలంగాణ స్టేట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం బిక్షపతి ముఖ్య అతిథిగా హాజరై యాదవ సోదరులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సదర్ సమ్మేళనం యాదవుల సంస్కృతి, సంప్రదాయాలు, ఆత్మగౌరవం, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో సోదరభావాన్ని, ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో బస్వాపూర్ గ్రామ సర్పంచ్ భూమిరెడ్డి, ముదిమాణిక్యం సర్పంచ్ రమేష్, అందోల్ మండల మాజీ ఎంపీపీ రామ గౌడ్, మాజీ సర్పంచ్ విష్ణయ్య, ఆత్మ కమిటీ మాజీ డైరెక్టర్ మహేష్ యాదవ్, గంగ గౌడ్, రవి, మల్లేశం యాదవ్ తదితర నాయకులు, యాదవ సోదరులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



పారిశుద్ధ్యంపై అధికారుల నిర్లక్ష్యం..

ప్రజలకు తప్పని ఇబ్బందులు!

- గ్రామం మధ్యలో నిలిచిన మురుగునీరు.. బురద, దుర్వాసనతో ప్రజల అవస్థలు

కోహీర్, నవంబర్ 12 (ఉదయం ప్రతినిధి):
సంగారెడ్డి జిల్లా కోహీర్ మండల పరిధిలోని బిలాల్‌పూర్ గ్రామంలో పారిశుద్ధ్య పరిస్థితులు పూర్తిగా అస్తవ్యస్తంగా మారాయి. గ్రామం మధ్యలో మురుగునీరు నిలిచిపోవడంతో పరిసర ప్రాంతాలు బురదమయంగా మారాయి. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిలిచిన మురుగునీటిలో క్రిమికీటకాలు పెరగడంతో పాటు పందులు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. మురుగునీటి నుంచి వెలువడుతున్న దుర్వాసనతో ఇళ్లలో ఉండలేని పరిస్థితి నెలకొందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమలు, ఇతర కీటకాల బెడద రోజురోజుకూ పెరుగుతోందని, దీంతో అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు పారిశుద్ధ్య లోపం కారణంగా వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలో పరిశుభ్రతను కాపాడాల్సిన సంబంధిత అధికారులు సమస్యను పట్టించుకోవడం లేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.గ్రామపంచాయతీ అధికారులు ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాల్సి ఉన్నప్పటికీ పరిస్థితుల్లో మార్పు కనిపించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో నిలిచిన మురుగునీటిని తొలగించాలని, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని కోరుతున్నారు.కేవలం తాత్కాలిక చర్యలతో సరిపెట్టకుండా మురుగునీరు నిల్వ ఉండకుండా శాశ్వత పరిష్కారం చూపాలని బిలాల్‌పూర్ గ్రామస్తులు సంబంధిత అధికారులను డిమాండ్ చేస్తున్నారు.



నీటిని వృథా చేస్తే కుళాయి కనెక్షన్ కట్!



- అక్రమ వినియోగంపై జరిమానాలు.. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- ఎల్‌నినో ప్రభావంతో నీటి కొరత ముప్పు – అయిజ మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ రావు హెచ్చరిక

అయిజ, నవంబర్ 12 ఉదయం ప్రతినిధి
ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యత తగ్గి భవిష్యత్తులో నీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించాలని అయిజ మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ రావు సూచించారు. మున్సిపల్ పరిధిలో తాగునీటి వృథాను అరికట్టేందుకు ప్రత్యేక నిబంధనలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి నీటిని దుర్వినియోగం చేసే వారిపై జరిమానాలతో పాటు కుళాయి కనెక్షన్లు తొలగించే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మున్సిపల్ అనుమతి లేకుండా ఎవరూ కొత్త కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేసుకోరాదని స్పష్టం చేశారు. మున్సిపల్ పైపులైన్లకు మోటార్లు బిగించి నీటిని తోడితే రూ.5 వేల జరిమానా విధిస్తామని తెలిపారు. కుళాయి నీటితో కార్లు కడిగితే రూ.5 వేలు, ద్విచక్ర వాహనాలు కడిగితే రూ.2 వేలు, ఇంటి ముందు నేలను కడిగితే రూ.2 వేల జరిమానా విధించనున్నట్లు పేర్కొన్నారు.ప్రతి కుళాయి కనెక్షన్‌కు తప్పనిసరిగా బిబ్ ట్యాప్ ఏర్పాటు చేసుకోవాలని, నీటి వినియోగం పూర్తయిన వెంటనే కుళాయిని బిగించాలని సూచించారు. నీటిని వృథా చేయడం, అక్రమంగా వినియోగించడం వంటి చర్యలకు పాల్పడితే కుళాయి కనెక్షన్‌ను నిలిపివేస్తామని హెచ్చరించారు. ఎక్కడైనా నీటి వృథా లేదా అక్రమ వినియోగం కనిపిస్తే వెంటనే మున్సిపల్ నీటి సరఫరా సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు. భవిష్యత్తులో నీటి కొరతను నివారించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి, నీటి సంరక్షణలో మున్సిపాలిటీకి సహకరించాలని కమిషనర్ చంద్రశేఖర్ రావు విజ్ఞప్తి చేశారు.

దేశంలోనే తొలి ఏఐ పోలీస్ స్టేషన్ గా పంజాగుట్ట

- డిసెంబర్ మొదటివారంలో పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభం
- ఫిర్యాదుల నుంచి ఛార్జ్‌షీట్ వరకు కృత్రిమ మేధతోనే!
- పంజాగుట్ట పీఎస్‌లో సీపీ సజ్జనర్ ఆకస్మిక తనిఖీ.. సాంకేతిక పనుల పరిశీలన

హైదరాబాద్ ఉదయం
దేశంలోనే మొట్టమొదటి ఏఐ ఆధారిత పోలీస్ స్టేషన్‌గా పంజాగుట్ట ఠాణా రూపుదిద్దుకుంటోందని నగర పోలీస్ కమిషనర్ శ్రీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ గారు తెలిపారు. గౌరవ డీజీపీ శ్రీ సీవీ ఆనంద్, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు పైలట్ ప్రాజెక్టు కింద ఈ ఠాణాలోని అన్ని సేవలను అత్యాధునిక ఏఐ సాంకేతికతతో అనుసంధానిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.బుధవారం పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌ను సీపీ గారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో ఆయన నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఠాణాలోని ప్రతి ఒక్క సిబ్బంది పనితీరును, వారు నిర్వహిస్తున్న విధులను వివరంగా అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లో జరుగుతున్న ఏఐ సాంకేతిక ఏర్పాట్లను ఏసీపీ మురళీకృష్ణ, ఇన్‌స్పెక్టర్ జహంగీర్‌తో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు.డిసెంబర్ నెల మొదటి వారంలో గౌరవ డీజీపీ గారి చేతుల మీదుగా ఈ ఏఐ ఠాణాను పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇక్కడి ఫలితాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అన్ని స్టేషన్లలోనూ ఈ విధానాన్ని అమలు చేస్తారని వివరించారు. ఇప్పటికే ఠాణా రిసెప్షన్ వద్ద ఏర్పాటు చేసిన 'సేతు' కియోస్క్ ద్వారా బాధితులు దాదాపు 10 భాషల్లో తమ ఫిర్యాదులు ఇవ్వొచ్చని, ఏఐ సాంకేతికత వాటిని స్థానిక భాషలోకి తర్జుమా చేసి క్షణాల్లో సంబంధిత అధికారులకు పంపుతుందని వివరించారు. ఎఫ్ఐఆర్ నమోదు మొదలుకుని కేసు డైరీ, దర్యాప్తు నివేదికలు, ఛార్జ్‌షీట్ రూపకల్పన వరకు అన్నీ ఏఐ ఆధారంగానే సాగుతాయన్నారు. పంజాగుట్ట పరిధిలోని రద్దీ, హాస్టళ్లు, వాణిజ్య సముదాయాలు, నేరాల చరిత్ర తదితర వివరాలను విశ్లేషించి బ్లాక్‌స్పాట్స్,
పెట్రోలింగ్ వ్యవస్థను మరింత సమర్థంగా నడిపిస్తామని, సాంకేతికత వినియోగంపై సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని నగర సీపీ శ్రీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ గారు పేర్కొన్నారు.





బాలానగర్‌లో గుమ్మల్ల కృష్ణారెడ్డికి ఘన నివాళులు..

కుటుంబ సభ్యులకు పరామర్శ

- దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ యువనేత చించోడ్ అభిమన్యు రెడ్డి

బాలానగర్ నవంబర్ 12, ఉదయం
సర్పంచ్ వెంకటేశ్వర రెడ్డి తండ్రి గుమ్మల్ల కృష్ణారెడ్డి దశదినకర్మ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సి. లక్ష్మారెడ్డి, జడ్చర్ల బీఆర్ఎస్ పార్టీ యువనేత చించోడ్ అభిమన్యు రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా గుమ్మల్ల కృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ, ఈ కష్ట సమయంలో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, బంధుమిత్రులు పాల్గొని గుమ్మల్ల కృష్ణారెడ్డికి నివాళులర్పించారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను సకాలంలో చెల్లించాలి అదనపు కలెక్టర్

- వేతనాల చెల్లింపులో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలి
- పెండింగ్ వేతన బకాయిల వివరాలు సమర్పించాలి

మహబూబ్‌నగర్
ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా వివిధ ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల వేతనాల చెల్లింపులో ఎదురవుతున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) మధుసూదన్ నాయక్ ఆదేశించారు.ఈ మేరకు ఐడీఓసీ (IDOC) లో ఎంప్లాయిమెంట్ ఆఫీసర్‌తో కలిసి వివిధ ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల ప్రతినిధులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.
ఈ సమావేశంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెల చెల్లించాల్సిన వేతనాలు, చెల్లింపుల్లో జరుగుతున్న జాప్యం, ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ఏజెన్సీల వారీగా పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిల వివరాలపై సమగ్రంగా సమీక్షించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, వివిధ ప్రభుత్వ శాఖల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తున్నారని, వారికి అందాల్సిన వేతనాలను చట్టబద్ధమైన నిబంధనల ప్రకారం నిర్ణీత గడువులోగా తప్పనిసరిగా చెల్లించాలని ఏజెన్సీల ప్రతినిధులను ఆదేశించారు. వేతనాల చెల్లింపులో ఎలాంటి జాప్యానికి తావులేకుండా చూడాలని, ఉద్యోగుల వేతన సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలని స్పష్టం చేశారు.
ప్రతి ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ తమ పరిధిలో పని చేస్తున్న ఉద్యోగుల పూర్తి వివరాలతో పాటు, వారికి చెల్లించాల్సిన వేతనాలు, ఇప్పటికే చెల్లించిన వేతనాలు, పెండింగ్‌లో ఉన్న బకాయిలకు సంబంధించిన వివరాలను సమర్పించాలని సూచించారు. ఉద్యోగుల సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించకుండా, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పారదర్శకంగా వ్యవహరించాలని తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేతనాల చెల్లింపును సక్రమంగా పర్యవేక్షించాలని, పెండింగ్ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు, ఏజెన్సీలు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు.
ఈ సమావేశంలో ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ మైత్రీ ప్రియ, వివిధ ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



దేవరకద్ర నియోజకవర్గంలోని పలు సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో చర్చించారు.

మహబూబ్‌నగర్
ఈ సందర్భంగా దేవరకద్ర పట్టణంలో డిగ్రీ కళాశాల నిర్మాణానికి అవసరమైన భూమిని కేటాయించాలని, స్టేడియం నిర్మాణం కోసం అదనంగా 3 ఎకరాల 30 గుంటల భూమిని కేటాయించాలని కలెక్టర్‌ను కోరారు.
అలాగే చిన్నచింతకుంట జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణానికి సంబంధించిన అంశాలను చర్చించారు. భూత్పూర్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రాబోయే రోజుల్లో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, అవసరమైన ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యాల కల్పనకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని కోరారు.ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ప్రస్తావించిన అంశాలపై జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సానుకూలంగా స్పందించారు.




హలో రైతన్న.. నవంబర్ 15న చలో నల్లగొండ!

- 36వ ఆల్ ఇండియా కిసాన్ మహాసభలను జయప్రదం చేయండి : కెవిపిఎస్

బిజినపల్లి, నవంబర్ 12 (ఉదయం ప్రతినిధి) :
నవంబర్ 15 నుంచి 18 వరకు నల్లగొండ పట్టణంలో నిర్వహించనున్న 36వ ఆల్ ఇండియా కిసాన్ మహాసభలను జయప్రదం చేయాలని బిజినపల్లి మండల కేంద్రంలో గోడ పత్రికలు విడుదల చేశారు.ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గుంపల్లి అశోక్ మాట్లాడుతూ.. నాలుగు రోజులపాటు జరిగే ఈ మహాసభలకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి రైతు సంఘం ప్రతినిధులు, జాతీయ నాయకులు హాజరవుతారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి రైతు సంఘం నాయకులు, కార్యకర్తలు, రైతులు, వ్యవసాయ కార్మికులు, కష్టజీవులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.దేశవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వ్యవసాయ రంగం సంక్షోభం, రైతులకు గిట్టుబాటు ధరలు, పంటల నష్టాలు, రైతుల హక్కులు తదితర అంశాలపై మహాసభల్లో విస్తృతంగా చర్చించి, భవిష్యత్తు రైతాంగ ఉద్యమ కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. నవంబర్ 15న రైతులంతా నల్లగొండకు తరలివచ్చి 36వ ఆల్ ఇండియా కిసాన్ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా నాయకులు మల్లేష్, రాములు, మల్లేష్, వెంకటేష్, శివ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కళతో లబ్ధిదారులలో ఆనందం




కేశంపేట (ఉదయం ప్రతినిధి నవంబర్ 12)
రాష్ట్ర ప్రభుత్వం ఇల్లు లేని పేద వారికి సొంత ఇంటి కల నెరవేరడమే ప్రభుత్వ లక్ష్యం అని తొమ్మిది రేకలు సర్పంచ్ బీసా కవిత కరుణాకర్ రెడ్డి అన్నారు. గురువారం గ్రామానికి చెందిన పోలేమోని ఉమామహేశ్వరి రాజారాం నూతన ఇంటిని ప్రారంభించారు .ఈ సందర్భంగా కవిత కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ఇప్పటికే నాలుగు ఇల్లు పూర్తిస్థాయిలో ప్రారంభించడం జరిగిందన్నారు. ఇంకో 10 ఇండ్లు వివిధ దశలలో నిర్మాణాలు జరుగుచున్నవి నూతనంగా మరో ఐదు ఇండ్లు మంజూరు అయినాయి ఇంకా మిగిలిపోయిన ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇల్లు నిర్మించే ఇచ్చే బాధ్యత మా యందు ఉందని తెలిపారు. ఉమామహేశ్వరి రాజారాం నూతనంగా ఇల్లు మంజూరు చేయించిన షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గ్రామ సర్పంచ్ కవితా కరుణాకర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు లచ్చిరామ్ నాయక్, కావాలి వసంత, నాయకులు చిట్టి రెడ్డి వెంకట్ రెడ్డి, నర్సింహారెడ్డి, రాంరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, చెన్నయ్య, కావలి లక్ష్మయ్య, చంద్రయ్య, రవి గ్రామస్తులు పాల్గొన్నారు

వుదయం

చక్కని ఆరోగ్యం

విటమిన్ సి అధికంగా ఉంటే వృద్ధాప్యంలో మెదడు చురుగ్గా పనిచేస్తుంది..




ఆరోగ్యకరమైన వృద్ధాప్యానికి సరైన ఆహారం కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు ఎప్పటి నుంచో చెబుతున్నారు. ముఖ్యంగా మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో కొన్ని పోషకాలు ప్రత్యేక ప్రాధాన్యం కలిగి ఉంటాయి. రోగనిరోధక శక్తిని పెంచడం, చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, ఐరన్ శోషణకు సహాయపడటం వంటి ప్రయోజనాలతో ప్రసిద్ధి చెందిన విటమిన్ సి ఇప్పుడు మెదడు ఆరోగ్యానికి కూడా ఉపయోగకరమని తాజా పరిశోధన వెల్లడించింది. రక్తంలో విటమిన్ సి స్థాయిలు ఎక్కువగా ఉన్నవారిలో మెదడు నిర్మాణం మరింత ఆరోగ్యకరంగా ఉండే అవకాశాలు ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. జపాన్‌లో నిర్వహించిన ఈ అధ్యయనంలో 64 సంవత్సరాల పైబడిన 2,044 మంది వృద్ధులపై పరిశోధనలు చేపట్టారు. పాల్గొన్న వారి రక్తంలో విటమిన్ సి స్థాయిలను కొలవడంతో పాటు అధిక నాణ్యత కలిగిన ఎంఆర్ఐ స్కాన్ల ద్వారా మెదడు నిర్మాణాన్ని పరిశీలించారు. వయస్సు, లింగం, రక్తపోటు, మధుమేహం, ధూమపానం, వ్యాయామం వంటి ఇతర అంశాల ప్రభావాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని విశ్లేషణ చేపట్టారు. పరిశోధనలో రక్తంలో విటమిన్ సి స్థాయిలు ఎక్కువగా ఉన్నవారిలో గ్రే మ్యాటర్ పరిమాణం కూడా అధికంగా ఉన్నట్లు తేలింది. గ్రే మ్యాటర్ అంటే జ్ఞాపక శక్తి, సమాచార ప్రాసెసింగ్, నిర్ణయాలు తీసుకోవడం వంటి కీలక మెదడు కార్యకలాపాలను నిర్వహించే భాగం. విటమిన్ సి స్థాయిలు తక్కువగా ఉన్నవారిలో ఈ భాగం పరిమాణం తగ్గినట్లు గుర్తించారు. అలాగే మెదడులోని డిఫాల్ట్ మోడ్ నెట్‌వర్క్ (డీఎంఎన్) అనే కీలక నాడీ వ్యవస్థతో విటమిన్ సి కి సంబంధం ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు, గత జ్ఞాపకాలను గుర్తు చేసుకునేటప్పుడు లేదా ఆలోచనల్లో మునిగిపోయినప్పుడు ఈ నెట్‌వర్క్ చురుకుగా పనిచేస్తుంది. అల్జీమర్స్ వంటి వ్యాధుల ప్రారంభ దశల్లో ఈ నెట్‌వర్క్ బలహీనపడటం సాధారణం. అయితే విటమిన్ సి స్థాయిలు ఎక్కువగా ఉన్నవారిలో ఈ నెట్‌వర్క్ లోని అనుసంధానాలు మరింత బలంగా ఉన్నట్లు ఎంఆర్ఐ స్కాన్లు చూపించాయి. రక్తపోటు, మధుమేహం, ధూమపానం లేదా శారీరక వ్యాయామం లేకపోవడం వంటి ప్రమాదకర అంశాలు ఉన్నప్పటికీ, విటమిన్ సి స్థాయిలు ఎక్కువగా ఉండటం మెదడు ఆరోగ్యానికి స్వతంత్రంగా ప్రయోజనం చేకూర్చినట్లు అధ్యయనం వెల్లడించింది. అంటే ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నా, తగిన స్థాయిలో విటమిన్ సి ఉండటం మెదడు నిర్మాణాన్ని సంరక్షించడంలో సహాయపడుతుందని పరిశోధకులు సూచిస్తున్నారు. విటమిన్ సి ప్రభావం పరిమిత స్థాయిలో ఉన్నప్పటికీ, మెదడు క్షీణతను తగ్గించడంలో దీని పాత్ర రక్తపోటు, రక్తంలో అధిక చక్కెర స్థాయిలు కలిగించే ప్రతికూల ప్రభావాలకు సమానంగా ఉంటుంది. అయితే మెదడు ఆరోగ్యం కేవలం ఒకే పోషకంపై ఆధారపడదని, నాణ్యమైన నిద్ర, క్రమమైన వ్యాయామం, ధూమపానం నివారణ, సమతుల్య ఆహారం వంటి జీవనశైలి అంశాలు కూడా సమానంగా ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. విటమిన్ సి ఒక శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్. ఇది మెదడు కణాలను ఆక్సిడేటివ్ నష్టాల నుంచి రక్షించడంలో సహాయపడుతుంది. నారింజ, నిమ్మకాయలు, జామపండ్లు, కివీ, స్ట్రాబెర్రీలు, క్యాప్సికం, బ్రోకోలీ వంటి ఆహార పదార్థాల్లో ఇది సమృద్ధిగా లభిస్తుంది. అందువల్ల రోజువారీ ఆహారంలో వీటిని చేర్చుకోవడం ద్వారా వయస్సు పెరిగే కొద్దీ మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకునే అవకాశాలు మెరుగుపడతాయని పరిశోధన సూచిస్తోంది. రోజువారీ ఆహా రపు అలవాట్లు మెదడు ఆరో గ్యంపై దీర్ఘకాలిక ప్రభావం చూపుతాయని ఈ అధ్యయనం మరోసారి స్పష్టం చేసింది.

ఆరుబయటే ఆరోగ్యం!



జిమ్‌కి వెళ్లాలి. అది కుదరలేదంటే ఇంట్లోనే కసరత్తులు మొదలుపెడతారు ఆడవాళ్లు. అలాకాకుండా వీలుంటే ఆరుబయటే చేయండి. ఊహించనంత ఆరోగ్యం మీ సొంతం అంటున్నారు నిపుణులు. చుట్టూ పచ్చదనం... ఒత్తిడి, ఆందోళనలను తగ్గిస్తుంది. ఆ వాతావరణం ఆనందంతోపాటు ప్రశాంతతనీ పంచుతుందట. పైగా ఏ పార్క్‌లోనో అయితే చుట్టూ నలుగురు చెమటోడుస్తుంటే రోజూ చేయాలన్న ప్రేరణ కూడా కలుగుతుంది. అంతేనా, ఉదయాన్నే సూర్యుడి నులివెచ్చని కిరణాలు మేనికి తగులుతాయి. దీంతో విటమిన్ డి అందుతుంది. ఎముక ఆరోగ్యానికి తోడు రోగనిరోధకత పెరుగుతుంది. ఇంకా కాస్త ఎత్తయిన ప్రదేశాలు, సరిగాలేని దారులు వంటివి ఎంచుకుని చూడండి. కాస్త ఇబ్బంది పడతామన్న మాట వాస్తవమే కానీ... ఈ క్రమంలో కండరాలు దృఢంగా మారతాయి, బ్యాలెన్సింగ్ వస్తుంది. ముఖ్యంగా గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. స్వచ్ఛమైన గాలి, పచ్చని మొక్కలు శరీరంలోని ఇన్‌ఫ్లమేషన్‌ని తగ్గించి, ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి. చుట్టూ ఉన్న పరిసరాల్ని పరిశీలిస్తూ వెళ్తాం కదా! ఏకాగ్రత కుదురుతుంది. మెమరీ పెరుగుతుంది. మానసిక అలసట తగ్గుతుంది. కాబట్టి, నడక, జాగింగ్, సైక్లింగ్, యోగా ఏదైనా అమ్మో అందరూ ఉంటారు అన్న భయం వీడి... ఆరుబయట చేయడానికే ప్రాధాన్యం ఇవ్వండి.

చాలామంది ఊబకాయం (Obesity) సమస్యతో బాధపడుతున్నారు. కొందరికి ఊబకాయం లేకపోయినా లావుపొట్టతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లావుపొట్ట కారణంగా కుదురుగా కూర్చోవాలన్నా, వంగాలన్నా చాలా కష్టంగా ఉంటుంది. ఇలాంటి వారు పొట్ట తగ్గించుకోవడానికి రకరకాల పద్ధతులను పాటిస్తుంటారు. అయినా ఫలితం లేక విసిగిపోతారు. కానీ ఈ డ్రింక్ (Drink) ను రోజుకు రెండు సార్లు తాగితే మీ పొట్ట ఇట్టే కరిగిపోతుందని నిపుణులు (Experts) చెబుతున్నారు. మరి ఆ డ్రింక్ ఏమిటి..? దాన్ని ఎలా చేసుకోవాలి..? అనే వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం.. ఒక స్పూన్ అల్లం పేస్టు, రెండు అంగుళాల దాల్చిన చెక్క, ఒక నిమ్మకాయ, అర స్పూన్ మిరియాలతో ఈ స్పెషల్ డ్రింక్‌ను తయారు చేసుకోవచ్చు. ఇందుకోసం ముందుగా పొయ్యి మీద ఒక గిన్నె పెట్టుకోవాలి. అందులో రెండు గ్లాసులు నీళ్లు పోయాలి. తర్వాత అందులో అల్లం పేస్టు, దాల్చిన చెక్క, స్పూన్ మిరియాలు కచ్చాపచ్చాగా దంచుకుని కలుపుకోవాలి. తర్వాత నిమ్మకాయలో సగాన్ని నాలుగు ముక్కలుగా కోసి అందులో వేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ఓ పది నిమిషాలపాటు మరిగించుకోవాలి. ఆ తర్వాత ఈ నీటిని వడకట్టి ఒక పరిశుభ్రమైన పాత్రలోకి తీసుకోవాలి. అంతే మీ పొట్టను తగ్గించే స్పెషల్ డ్రింక్ రెడీ అయినట్టే. ఈ స్పెషల్ డ్రింక్‌ను ఉదయాన్నే ఒకసారి, సాయంత్రం ఒకసారి వరుసగా గోరువెచ్చగా తాగితే 15 రోజుల్లోనే చక్కటి ఫలితం కనిపిస్తుంది. ఒంట్లోని అదనపు కొవ్వు కరిగి బరువు తగ్గుతారు. బానపొట్ట నాజూగ్గా మారుతుంది.



ఈ డ్రింక్ రోజుకు రెండుసార్లు తాగితే ..!

ప్రోటీన్లు ఉండే ఆహారాలను రోజూ తింటే ఎన్నో లాభాలు..

బరువు తగ్గాలనుకునే వారికి అధిక ప్రోటీన్ ఆహారం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయి. ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారం ఆకలిని తగ్గించడమే కాకుండా ఎక్కువ సేపు కడుపు నిండిన భావనను కలిగిస్తుంది. అంతేకాకుండా శరీరం రోజులో ఖర్చు చేసే కేలరీల సంఖ్యను పెంచడంలోనూ సహాయపడుతుంది. దీని వల్ల శరీరంలోని కొవ్వు తగ్గి కండరాల దృఢత్వం పెరుగుతుంది. ముఖ్యంగా దీర్ఘకాలం పాటు అధిక ప్రోటీన్ ఆహారాన్ని కొనసాగించే వారిలో తిరిగి బరువు పెరిగే అవకాశాలు తక్కువగా ఉంటాయని పరిశోధనలు చెబుతున్నాయి. వే ప్రోటీన్ బరువు తగ్గడంలో ప్రముఖ పాత్ర పోషించే ప్రోటీన్లలో ఒకటి. పాల నుంచి లభించే ఈ ప్రోటీన్ త్వరగా కడుపు నిండిన భావనను కలిగిస్తుంది. ఇతర ప్రోటీన్ మూలాలతో పోలిస్తే ఆకలిని సమర్థంగా నియంత్రిస్తుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. అలాగే శరీర నిర్మాణాన్ని మెరుగుపరచడంలోనూ ఇది సహాయపడుతుంది. ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారాలు కూడా బరువు తగ్గడంలో కీలక పాత్ర పోషిస్తాయి. గుడ్లు, చికెన్, చేపలు, పాలు, పనీర్, చీజ్, పప్పుధాన్యాలు, క్వినోవా, నట్స్ వంటి ఆహారాలు ఎక్కువసేపు ఆకలి వేయకుండా చేసి రోజంతా అనవసరంగా తినాలనే కోరికను తగ్గిస్తాయి. సోయా ప్రోటీన్ కూడా బరువు నియంత్రణలో సహాయపడే మొక్కల ఆధారిత ప్రోటీన్‌గా గుర్తింపు పొందింది. సోయాబీన్స్ నుంచి తయారయ్యే ఈ ప్రోటీన్‌లో శరీరానికి అవసరమైన ముఖ్యమైన అమైనో ఆమ్లాలు ఉంటాయి. అయితే బరువు తగ్గడంలో దీని ప్రభావాన్ని పూర్తిగా నిర్ధారించే బలమైన శాస్త్రీయ ఆధారాలు ఇంకా పరిమితంగానే ఉన్నాయి. కేసిన్ ప్రోటీన్ కూడా పాల నుంచే లభించే మరో ముఖ్యమైన ప్రోటీన్. ఇది నెమ్మదిగా జీర్ణమవడం వల్ల ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలుగుతుంది. అందువల్ల తరచూ ఆకలి వేయకుండా ఉండటంతో బరువు తగ్గడంలో సహాయపడుతుంది. బఠానీ ప్రోటీన్ లేదా పీ ప్రోటీన్‌లో కూడా శరీరానికి అవసరమైన అమైనో ఆమ్లాలు ఉంటాయి. ఇవి తృప్తి భావనను పెంచి ఎక్కువసేపు ఆకలిని నియంత్రిస్తాయి. అలాగే శరీర నిర్మాణాన్ని మెరుగుపరచడంలోనూ కొంత మేర ప్రయోజనం కలిగిస్తాయి. రైస్ ప్రోటీన్ మరో మొక్కల ఆధారిత ప్రోటీన్. ఇందులో అన్ని అవసరమైన అమైనో ఆమ్లాలు లేకపోయినా, సాధారణంగా పీ ప్రోటీన్‌తో కలిపి ఉపయోగిస్తారు. ఇది శరీరంలోని కొవ్వును తగ్గించి కండరాల పరిమాణాన్ని పెంచడంలో తోడ్పడుతుంది. హెంప్ ప్రోటీన్‌లో ఒమెగా-3 కొవ్వు ఆమ్లాలు, పీచుపదార్థం సమృద్ధిగా ఉంటాయి. అయితే ఇందులో అన్ని అవసరమైన అమైనో ఆమ్లాలు లేకపోవడం వల్ల దీనిని పూర్తి ప్రోటీన్‌గా పరిగణించరు. అయినప్పటికీ సమతుల ఆహారంలో భాగంగా తీసుకుంటే ప్రయోజనకరంగా ఉంటుంది. బోన్ బ్రోత్ ప్రోటీన్ జంతువుల ఎముకలను నీటిలో మరిగించడం ద్వారా తయారవుతుంది. ఈ ప్రక్రియలో ఎముకలలోని కొన్ని పోషకాలు ద్రవంలోకి వస్తాయి. అయితే ఇది కూడా పూర్తి ప్రోటీన్ కాదు. అయినప్పటికీ కొందరు దీనిని ప్రోటీన్ సప్లిమెంట్‌గా వినియోగిస్తారు. అయితే బరువు తగ్గడానికి కేవలం ప్రోటీన్ మాత్రమే సరిపోదు. సమతుల ఆహారం, క్రమమైన వ్యాయామం, తగినంత నిద్ర, ఆరోగ్యకర జీవనశైలి కూడా సమానంగా అవసరం. అధిక ప్రోటీన్ ఆహారం తీసుకునే ముందు వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నిపుణుల సలహా తీసుకోవడం మంచిది.



అరటి ఆకులపై భోజనం చేయడం రుచికరం, ఆరోగ్యకరం..

అరటి ఆకులపై భోజనం చేయడం అత్యంత తక్కువ ఖర్చుతో కూడుకున్న పద్ధతిగా చెప్పవచ్చు. పెద్ద ఎత్తున పాత్రలను కొనుగోలు చేయాల్సిన అవసరం ఉండదు. ఆకులను శుభ్రంగా కడిగి నేరుగా ఉపయోగించవచ్చు. దీంతో పెద్ద కార్యక్రమాల్లో కూడా ఖర్చును తగ్గించుకోవచ్చు. పర్యావరణ పరిరక్షణ పరంగా కూడా అరటి ఆకులు ఉత్తమ ప్రత్యామ్నాయంగా నిలుస్తాయి. ప్లాస్టిక్ డిస్పోజబుల్ ప్లేట్లతో పోలిస్తే ఇవి పూర్తిగా సహజసిద్ధంగా కరిగిపోతాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణానికి హాని కలిగిస్తుండగా, అరటి ఆకులు ఎలాంటి కాలుష్యాన్ని సృష్టించవు. అంతేకాకుండా పాత్రలు కడగడానికి ఉపయోగించే రసాయనాల అవసరం కూడా తగ్గుతుంది. పరిశుభ్రత పరంగా కూడా అరటి ఆకులకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది. సాధారణ పాత్రలను సబ్బుతో కడిగిన తర్వాత కూడా కొన్ని సార్లు రసాయన అవశేషాలు మిగిలిపోయే అవకాశం ఉంటుంది. అయితే అరటి ఆకులను నీటితో శుభ్రం చేసిన తర్వాత నేరుగా ఉపయోగించవచ్చు. వీటి ఉపరితలంపై ఉండే సహజమైన మైనపు పొర దుమ్ము, ధూళి సులభంగా అంటకుండా చేస్తుంది. అంతేకాకుండా అరటి ఆకులపై వడ్డించిన ఆహారానికి స్వల్పమైన సహజ సువాసన, ప్రత్యేక రుచి కూడా వస్తుంది. అందువల్ల భోజనం మరింత రుచికరంగా అనిపిస్తుంది. ఆరోగ్యం, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, సంప్రదాయం వంటి అనేక అంశాలను కలగలిపిన అరటి ఆకుపై భోజనం చేసే పద్ధతి ఇప్పటికీ భారతీయ సంస్కృతిలో ప్రత్యేక తను నిలబెట్టుకుంటోంది.



పెదాలు పొడిబారుతుంటే..

ఒక్కోసారి సీజన్‌తో సంబంధం లేకుండా పెదవులు పొడిబారి నిర్జీవంగా కనిపించడం సహజం. ఇది అందాన్ని దెబ్బతీస్తుంది. ఇలాంటప్పుడు కొన్ని ఇంటి చిట్కాలు మేలు చేస్తాయంటున్నారు నిపుణులు. చెంచా తేనె, అరచెంచా దానిమ్మ రసం తీసుకొని బాగా నిలిచి ఉంటుందంటున్నారు నిపుణులు. తేనె పెదాలకు తేమనందిస్తే.. దానిమ్మ రసం వల్ల పెదాలకు గులాబీ మెరుపు వస్తుందట. కొంతమంది పెదవులు నల్లగా కనిపిస్తాయి. అలాంటప్పుడు నిమ్మరసం, తేనె చెంచా చొప్పున తీసుకొని బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని పెదవులకు అప్లై చేసి పూర్తిగా ఆరనివ్వాలి. తర్వాత తడిగా ఉన్న వస్త్రంతో తుడిచేసుకోవాలి. అనంతరం పెదాలకు పెట్రోలియం జెల్లీ లేదా లిప్‌బామ్ రాసుకోవాలి. ఈ చిట్కాను క్రమం తప్పకుండా పాటించడం వల్ల అధరాల రంగులో మార్పు కనిపించే అవకాశం ఉందంటున్నారు నిపుణులు. పొడిబారిన పెదాల చర్మంపై మృతకణాలు ఎక్కువగా ఉంటాయి. వాటిని తొలగించుకోవడానికి స్క్రబ్ చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం.. పంచదార, తేనె, ఆలివ్ ఆయిల్, పెట్రోలియం జెల్లీ.. వంటివి చెంచా చొప్పున తీసుకోవాలి. మొదట ఒక బౌల్‌లో తేనె, పంచదార వేసి బాగా కలపాలి. అందులో ఆలివ్ నూనె, తర్వాత పెట్రోలియం జెల్లీ వేసి మిక్స్ చేయాలి. ఈ మిశ్రమం కొద్దిగా తీసుకొని దాంతో పెదవులపై మృదువుగా మర్దన చేసుకోవాలి. కాసేపటి తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకొని వెంటనే లిప్‌బామ్ రాసుకోవాలి. ఫలితంగా నిర్జీవమైన పెదాలు మృదువుగా మారతాయంటున్నారు నిపుణులు. అలాగే ఈ ప్రక్రియను వారానికి రెండుసార్లు చేయడం వల్ల మెరుగైన ఫలితం ఉంటుందట. విటమిన్ 'ఇ' నూనెతో పెదవులకు మృదువుగా మర్దన చేసుకోవాలి. అలాగే అధరాలకు పోషణ అందించే సహజసిద్ధమైన లిప్ మాస్క్‌లు, లిప్ బామ్‌లు ఉపయోగించడం మంచిదని చెబుతున్నారు నిపుణులు.



తరచూ ముఖం కడుగుతున్నారా?



ముఖం ఎప్పుడూ తాజాగా ఉండాలన్న ఉద్దేశంతో కొంతమంది తరచూ శుభ్రం చేసుకుంటుంటారు. అయితే దీనివల్ల ప్రయోజనాల కంటే నష్టాలే ఎక్కువంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో ఎక్కువసార్లు ఫేస్‌వాష్ చేసుకుంటే ఏమవుతుందో తెలుసుకుందాం రండి.. మాటిమాటికీ ముఖం కడుక్కోవడం వల్ల చర్మంపై పేరుకున్న దుమ్ము పోయి శుభ్రపడుతుందని చాలామంది అనుకుంటారు. కానీ, అది పొరపాటు. ఎందుకంటే ఎక్కువసార్లు ముఖం కడుక్కోవడం వల్ల చర్మాన్ని పొడిబారకుండా కాపాడే సీబమ్ అనే నూనె పదార్థం తొలగిపోతుంది. ఒక్కొక్కరి చర్మతత్వం ఒక్కోలా ఉంటుంది. కొందరిది జిడ్డు చర్మమైతే, మరికొందరిది పొడిగా ఉంటుంది. ఇంకొందరు సాధారణ చర్మతత్వాన్ని కలిగి ఉంటారు. అయితే చర్మతత్వాన్ని బట్టే రోజుకు ఎన్నిసార్లు ముఖం కడుక్కోవాలనేది ఆధారపడి ఉంటుందంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో సాధారణ చర్మతత్వం గలవారు రోజులో ఒకటి లేదా రెండుసార్లు ఫేస్‌వాష్ చేసుకుంటే చాలు. అలాగే జిడ్డు చర్మతత్వం ఉన్నట్లయితే రెండుమూడుసార్లు ఫేస్‌వాష్ చేసుకున్నా.. ఆ తర్వాత టోనర్‌ని ఉపయోగిస్తే ఎక్కువ సమయం తాజాగా కనిపించే అవకాశం ఉంటుంది. ఇక పొడి చర్మం ఉన్న వారు ఒకట్రెండుసార్లు ముఖం కడుక్కొని.. వెంటనే మాయిశ్చరైజర్ రాసుకుంటే ఫలితం ఉంటుందని చెబుతున్నారు. మీ చర్మతత్వానికి తగిన ఫేస్‌వాష్‌లను ఎంచుకోవడమూ ముఖ్యమే! అయితే కొందరికి ఎలాంటి ఫేస్‌వాష్‌లైనా నప్పుతాయి. మరికొందరికి గాఢత తక్కువగా ఉండే ఫేస్‌వాష్‌లను ఉపయోగించినా సమస్యలొస్తాయి. కాబట్టి మీరు వాటిని కొనే ముందు దానిపై ఉండే లేబుల్‌ని ఓసారి పరిశీలించాలి. తద్వారా అది ఏ చర్మతత్వానికి సరిపోతుందో తెలుస్తుంది. అలాగే వాడే ముందు ఓసారి ప్యాచ్ టెస్ట్ చేయడమూ మర్చిపోవద్దంటున్నారు నిపుణులు. చర్మం తేమగా ఉన్నప్పుడే తాజాగా కనిపిస్తుంది. ఎక్కువ సార్లు ముఖం కడుక్కోవడం వల్ల చర్మంలోని తేమశాతం తగ్గిపోయి లేనిపోని సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. అలా జరగకుండా ఉండాలంటే.. ముఖాన్ని పదే పదే శుభ్రం చేసుకోకపోవడంతో పాటు ఈ చిట్కాను పాటించడం మంచిదంటున్నారు నిపుణులు. పదే పదే నీటితో ముఖం కడుక్కోవడానికి బదులుగా.. ఒక్కోసారి తడిగా ఉండే వైప్స్‌ని ఉపయోగించచ్చు. లేదంటే మరికొన్నిసార్లు టిష్యూస్‌తోనూ ముఖాన్ని శుభ్రంగా తుడుచుకోవచ్చని సూచస్తున్నారు నిపుణులు. ఫలితంగా చర్మ సంబంధిత సమస్యలు తలెత్తే ప్రమాదం ఎక్కువ. అందుకే రోజుకు రెండుమూడు సార్లకు మించి ముఖం కడుక్కోకపోవడమే మేలంటున్నారు నిపుణులు. అది కూడా గాఢత తక్కువగా ఉండే సబ్బు లేదా లిక్విడ్ ఫేస్‌వాష్‌తో కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని పెదవులకు అప్లై చేసుకొని 15 నుంచి 20 నిమిషాలు ఆరనివ్వాలి. తర్వాత నీటితో శుభ్రం చేసుకొని వెంటనే లిప్ బామ్ రాసుకోవాలి. ఇలా చేయడం వల్ల అధరాల్లోని తేమ ఎక్కువసేపు

సెన్సెక్స్ ▲ 81,911.01	గోల్డ్ 1,40,603 (10 గ్రాములు)	యూస్ డాలర్ $ 94.0330	ఎస్ బి ఐ రూ. 1,003.80
నిఫ్టీ ▲ 25,299.35	సిల్వర్ 1,85,900 (1 కిలో)	బ్రిటన్ పౌండ్ £ 124.4393	NTPC రూ. 1,115.00
	చమురు 8,167 (రూ. బ్యారెల్)	యూరో € 104.0409	State Bank of India రూ. 1,086.50
		జపాన్ యెన్ ¥ 0.5878	Nestlé India రూ. 1,260.90
			Mahindra & Mahindra రూ. 3,399.00
			Hindustan Unilever రూ. 1,974.00



గూఢచర్య ఆరోపణల ఒత్తిడిలో తప్పుకున్నా ఎన్విడియా సీఈఓ

▶ గురువారం ప్రీ-మార్కెట్‌లో ఎన్విడియా షేర్లు 13 శాతం పడిపోయాయి



ఎన్విడియా సిఈఓ జెన్సెన్ హువాంగ్ గురువారం పదవి నుంచి తప్పుకున్నారు. గూఢచర్య వ్యవహారంపై వివాదం కొనసాగుతున్న సమయంలో ఈ నిర్ణయం వెలువడింది. కంపెనీ సీఎఫ్ఓ కొలెట్ క్రెస్ తాత్కాలిక సీఈఓగా బాధ్యతలు చేపట్టనున్నారు. శాశ్వత వారసుడి కోసం అంతర్గత, బాహ్య అభ్యర్థులను పరిశీలిస్తామని ఎన్విడియా తెలిపింది. హువాంగ్ కంపెనీ బోర్డులోనూ కొనసాగరని ఎన్విడియా ప్రకటన పేర్కొంది. 63 ఏళ్ల హువాంగ్ ఎన్విడియా సహవ్యవస్థాపకుడు, నాలుగో అతిపెద్ద పెట్టుబడిదారు. తనకు నివేదించే ఉద్యోగినితో వివాహేతర సంబంధం ఉన్నట్లు వచ్చిన ఆరోపణలు ఒత్తిడిని పెంచాయి. రెండో సంబంధంపై వార్తలు రావడంతో బుధవారం ఎన్విడియా బోర్డు సమావేశమైంది. హువాంగ్‌ను తొలగించే అంశాన్ని బోర్డు పరిశీలించింది. చైనా బీజింగ్‌కు సమాచారం చేరిందని అమెరికా నిఘా సంస్థలు గుర్తించినట్లు న్యూయార్క్ టైమ్స్ తెలిపింది. ఎన్విడియా ఆదివారం అంతర్గత దర్యాప్తును ప్రకటించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం ఎఫ్‌బీఐ కూడా దర్యాప్తు చేస్తోందని ధ్రువీకరించారు. జాతీయ భద్రత లేదా అంతర్గత రహస్యాల ఉల్లంఘనకు కారణం కనిపించలేదని కంపెనీ తెలిపింది. దర్యాప్తులో అందుబాటులోని మొత్తం సమాచారాన్ని పరిశీలిస్తామని ఎన్విడియా పేర్కొంది. హువాంగ్‌కు ఆ మహిళ గూఢచారి అని తెలియదని ట్రంప్ చెప్పారు. హువాంగ్ చెప్పిన మాటలను తాను నమ్ముతున్నానని వైట్ హౌస్ సమావేశంలో తెలిపారు. హువాంగ్‌ను ఇబ్బందిపెట్టే ప్రయత్నంలో చైనా పాత్ర లేదని చైనా ఖండించింది. అతని నాయకత్వంలో ఎన్విడియా కృత్రిమ మేధ చిప్‌ల ప్రముఖ తయారీదారుగా ఎదిగింది. ట్రంప్ ప్రభుత్వం అనుమతితో చైనా మార్కెట్‌కు 200 చిప్‌ల ఎగుమతికి హువాంగ్ ఆమోదం పొందారు. గురువారం ప్రీమార్కెట్ లావాదేవీల్లో ఎన్విడియా షేర్లు 13 శాతం పడిపోయాయి. గత నెల రికార్డు గరిష్ఠం నుంచి షేరు విలువ మూడో వంతుకుపైగా తగ్గింది. నవంబర్ 17న మధ్యాహ్నం 1:20 గంటలకు మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలను ప్రకటించనున్నట్లు కంపెనీ తెలిపింది.

నోయెల్ టాటా ఆరు కీలక పదవులకు వీడ్కోలు



టాటా గ్రూప్‌లో భారీ మార్పులు జరగనున్నాయి. నోయెల్ టాటా ఆరు కంపెనీల కీలక పదవులకు రాజీనామా చేయనున్నారు. ట్రెంట్, వోల్టాస్, టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్, టాటా ఇంటర్నేషనల్‌లో చైర్మన్ పదవులు వీటిలో ఉన్నాయి. టాటా స్టీల్, టైటన్ వైస్ చైర్మన్ పదవుల నుంచి నోయెల్ టాటా తప్పుకోనున్నారు. అనంతరం నోయెల్ టాటాకు 'చైర్మన్ ఎమెరిటస్' హోదా ఇవ్వనున్నారు. టాటా ట్రస్ట్స్ అధ్యక్ష పదవిని నోయెల్ టాటా కొనసాగించనున్నారు. టాటా సన్స్ బోర్డులో ట్రస్ట్స్ నామినీ డైరెక్టర్‌గా కూడా కొనసాగుతారు. టాటా సన్స్‌లో టాటా ట్రస్ట్స్‌కు దాదాపు 66 శాతం వాటా ఉంది. టాటా ఇంటర్నేషనల్ చైర్మన్‌గా టి. వి. నరేంద్రన్ బాధ్యతలు చేపట్టనున్నారు. వోల్టాస్ చైర్మన్‌గా సునీల్ డిసూజా నియమితులయ్యారు. ట్రెంట్ చైర్మన్ పదవికి ఏజీబీ అండ్ పార్ట్‌నర్స్ సహవ్యవస్థాపకుడు బ్రహ్మ్ వకీల్ పేరు ఖరారైంది. వోల్టాస్ ఎండీగా జయంత్ బాలన్ 25 మే 2027 నుంచి ఐదేళ్లు బాధ్యతలు స్వీకరించనున్నారు.
ఈ మార్పులు టాటా గ్రూప్ నిర్దేశిత పదవీ విరమణ విధానంలో భాగమని గ్రూప్ తెలిపింది.

హెచ్ఎస్‌బీసీ హురున్ గ్లోబల్ ఇండియన్స్ జాబితాలో సుందర్ పిచాయ్ అగ్రస్థానం

▶ ఆల్ఫాబెట్ విలువ $4.2 ట్రిలియన్‌కు చేరింది



సుందర్ పిచాయ్ 2026 హెచ్ఎస్‌బీసీ హురున్ గ్లోబల్ ఇండియన్స్ జాబితాలో అగ్రస్థానంలో నిలిచారు; ఆల్ఫాబెట్ విలువ $4.2 ట్రిలియన్‌కు చేరింది. మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల $2.6 ట్రిలియన్ విలువతో రెండో స్థానంలో, మైక్రాన్ టెక్నాలజీకి చెందిన సంజయ్ మెహ్రోత్రా $1.4 ట్రిలియన్‌తో మూడో స్థానంలో ఉన్నారు. జాతీయతతో సంబంధం లేకుండా, భారతీయ మూలాలున్నవారు విదేశాల్లో ప్రధాన కార్యాలయాలున్న విలువైన సంస్థలను స్థాపించినా లేదా నడిపినా ఈ జాబితాలో గుర్తింపు పొందుతారు. ఆల్ఫాబెట్ విలువ 98 శాతం పెరిగి మైక్రోసాఫ్ట్‌ను అధిగమించగా, మైక్రోసాఫ్ట్ విలువ 17 శాతం తగ్గింది. ప్రపంచవ్యాప్తంగా భారతీయులు నడిపే సంస్థల మొత్తం విలువ $15 ట్రిలియన్‌గా ఉండి, 2024తో పోలిస్తే 53 శాతం పెరిగింది. అందులో తొలి ఐదు సంస్థల వాటా $9.1 ట్రిలియన్, అంటే మొత్తం విలువలో 61 శాతం; తొలి 10 సంస్థలు దాదాపు 70 శాతం వాటాతో $10.5 ట్రిలియన్ విలువను కలిగి ఉన్నాయి. 2026 జాబితాలో 236 మంది 200 సంస్థలకు నాయకత్వం వహిస్తున్నారు; వారిలో 89 మంది కొత్తగా చేరారు. మహిళలు 16 మంది ప్రవేశికలకు ప్రాతినిధ్యం వహించగా, జేస్‌శ్రీ వి. ఉల్లాల్ నేతృత్వంలోని అరిస్టా నెట్‌వర్క్స్ విలువ $208 బిలియన్‌గా ఉంది.
మహిళలు నడిపే సంస్థల సమిష్టి విలువ $699 బిలియన్. వృత్తి నిపుణులు 53 శాతం, మొదటి తరం వ్యాపారవేత్తలు 44 శాతం, రెండో తరం నాయకులు 3 శాతంగా ఉన్నారు. ప్రవేశికల్లో 58 శాతం మంది భారతదేశంలో అండర్‌గ్రాడ్యుయేట్ విద్య పూర్తిచేశారు. కృత్రిమ మేధస్సు రంగంలో తొలిసారిగా ప్రత్యేక విభాగం ఏర్పడి, 18 సంస్థల విలువ $227 బిలియన్‌గా నమోదైంది; జాబితాలోని సంస్థల్లో 103 కృత్రిమ మేధస్సు ఆధారిత లేదా అనుసంధానిత సంస్థల మొత్తం విలువ $10.7 ట్రిలియన్‌గా ఉంది.

2 బిలియన్ డాలర్ల పెట్టుబడి



ఢిల్లీ: కియా ఇండియా ఆంధ్రప్రదేశ్‌లో రెండో ప్లాంట్‌కు $2 బిలియన్ డాలర్లు పెట్టుబడి ప్రకటించింది. ఈ ప్రతిపాదిత కేంద్రం 2030 ప్రారంభంలో ఉత్పత్తి మొదలుపెట్టనుంది. కియా సరఫరాదారులతో కలిసి ప్లాంట్‌ను ఏర్పాటు చేయనుంది. కియా ఇండియా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గురువారం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. కియా, సరఫరాదారుల భాగస్వామ్య కేంద్రం 465 ఎకరాల్లో విస్తరించనుంది. ఈ ప్లాంట్ ద్వారా సుమారు 12,000 ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు ఏర్పడనున్నాయి. కొత్త కేంద్రం వార్షిక సామర్థ్యానికి 2 లక్షల వాహనాలను జోడించనుంది. రెండు ప్లాంట్లతో భారత్‌లో కియా మొత్తం సామర్థ్యం 6 లక్షలకు మించనుంది. రెండు కేంద్రాలపై కియా సమిష్టి పెట్టుబడి $5 బిలియన్ డాలర్లకు చేరనుంది. కియా ప్రస్తుత ప్లాంట్‌ను అనంతపురంలో 2017లో స్థాపించింది. ఆ కేంద్రం వార్షికంగా 4.3 లక్షల వాహనాలను తయారు చేస్తోంది. అక్కడి పెట్టుబడిలో సరఫరాదారుల వాటాలు కూడా ఉన్నాయి. కియా రెండో ప్లాంట్ ఐసీఈ, ఈవీ నమూనాలకు మద్దతు ఇవ్వనుంది. సరికొత్త కేంద్రం దేశీయ, విదేశీ మార్కెట్ల డిమాండ్‌కు సరళంగా స్పందించనుంది. అనంతపురం కేంద్రం 4.1 లక్షలకు పైగా వాహనాలు, కిట్లను ఎగుమతి చేసింది. ఆ ఎగుమతులు దాదాపు 100 దేశాలకు చేరాయి.

పలు ఎన్‌బీఎఫ్‌సీల్లో ప్రైవేట్ ఈక్విటీ సంస్థల నియంత్రణ

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఒక ప్రైవేట్ ఈక్విటీ సంస్థకు ఒకటి కంటే ఎక్కువ ఎన్‌బీఎఫ్‌సీల్లో నియంత్రణ వాటాలు ఉండకుండా నిషేధాన్ని పరిశీలిస్తోంది. ఈ ప్రతిపాదనపై ప్రజాభిప్రాయం సేకరించిన తర్వాత ముసాయిదాను ఆర్‌బీఐ ఖరారు చేయనుంది. వచ్చే ఏడాది ప్రారంభంలో నిబంధనలు అధికారికంగా వెలువడే అవకాశం ఉందని వర్గాలు తెలిపాయి. ఈ చర్చలు ప్రైవేటుగా సాగుతున్నందున వర్గాలు తమ పేర్లు వెల్లడించలేదు. ప్రతిపాదిత నిబంధనలు నియంత్రణ వాటాలను చిన్న ఆర్థిక పెట్టుబడుల నుంచి వేరు చేస్తాయి. పదిహేను శాతం లేదా అంతకంటే తక్కువ వాటాలకు తక్కువ నియంత్రణ పరిశీలనలు ఉండొచ్చని రాయిటర్స్‌కు వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం లిస్టెడ్ సంస్థలో ఇరవై ఐదు శాతం వాటాను నియంత్రణ వాటాగా పరిగణిస్తున్నారు. తక్కువ వాటా ఉన్నా, ఎక్కువ మంది డైరెక్టర్లను నియమించే లేదా నిర్వహణపై ప్రభావం చూపే పెట్టుబడిదారుడికి నియంత్రణ ఉన్నట్లు భావించవచ్చు. ప్రపంచ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ లేదా దాని అనుబంధాల్లో ఆర్థిక ఒత్తిడి పలు ఎన్‌బీఎఫ్‌సీలకు వ్యాపిస్తుందన్నది ఆర్‌బీఐ ఆందోళన.





భారత హాకి మాజీ కెప్టెన్ ఎం. ఎం. సోమయ్యకు చెందిన 1980 ఒలింపిక్ స్వర్ణపతకం బెంగళూరులోని ఇంటి నుంచి దొంగిలించబడింది. పోలీసులు ఆ పతకాన్ని స్వాధీనం చేసుకున్నారు. దొంగతనం కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు పోలీసులు బుధవారం తెలిపారు.

బెంగళూరులో దొంగిలించిన సోమయ్య ఒలింపిక్ స్వర్ణపతకం స్వాధీనం

రిషబ్ పంత్ న్యూజిలాండ్ టెస్టు సిరీస్‌కు బయలు



న్యూజిలాండ్‌తో నవంబర్ 19న ప్రారంభమయ్యే టెస్టు సిరీస్‌కు రిషబ్ పంత్ సిద్ధమయ్యాడు. బెంగళూరులో బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పంత్‌కు ఫిట్‌నెస్ క్లియరెన్స్ ఇచ్చింది. దీంతో పంత్ న్యూజిలాండ్‌కు బయలుదేరాడు. నవంబర్ 10, 11 తేదీల్లో పంత్ రెండు ఫిట్‌నెస్ పరీక్షలు రాశాడు. మ్యాచ్ పరిస్థితులను పోలిన సిమ్యులేషన్ పరీక్షల్లోనూ పంత్ పాల్గొన్నాడు. రెండు పరీక్షల్లోనూ మంచి ఫలితాలు రావడంతో గురువారం అనుమతి లభించింది. అక్టోబర్ 23న పంత్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు చేరుకున్నాడు. వైద్య బృందం పర్యవేక్షణలో రెండు వారాలకు పైగా పునరావాసం పూర్తి చేశాడు. అక్టోబర్ ప్రారంభంలో ఇరానీ కప్‌లో సైడ్ స్ట్రెయిన్‌తో పంత్ గాయపడ్డాడు.
గాయం కారణంగా పంత్ మూడు అనధికారిక టెస్టులను కోల్పోయాడు. న్యూజిలాండ్‌తో తొలి టెస్టు నవంబర్ 19న వెల్లింగ్టన్‌లో ప్రారంభం కానుంది.
రెండో టెస్టు నవంబర్ 27న క్రైస్ట్‌చర్చ్‌లో జరగనుంది. పంత్ తిరిగి రావడంతో భారత్ బ్యాటింగ్, వికెట్‌కీపింగ్ బలపడనున్నాయి. అయితే తొలి టెస్టు తుది జట్టులో పంత్‌కు చోటుపై ఆసక్తి నెలకొంది.

స్వియాటోలినా రేసులో నిలిచింది



ఎలినా స్వియాటోలినా కరోలినా ముచోవాపై గెలిచి డబ్ల్యూటీఏ ఫైనల్స్ టైటిల్ రేసులో నిలిచింది. ఇండియన్ వెల్స్‌లో తొలి సెట్ కోల్పోయిన స్వియాటోలినాకు ఎనిమిది నిమిషాల వైద్య విరామం అవసరమైంది. అయినా స్వియాటోలినా పుంజుకుని 36, 62తో మ్యాచ్ గెలిచింది. మిర్రా ఆండ్రీవా చేతి తొలి రౌండ్ రాబిన్ మ్యాచ్‌లో స్వియాటోలినా 64, 60తో ఓడింది. ఓటమి తనను గ్రూప్ నుంచి తప్పించే పరిస్థితి తెచ్చిందని స్వియాటోలినా తెలిపింది. అందుకే మూడో సెట్‌లో మొత్తం శక్తిని ఉపయోగించానని స్మైస్పోర్ట్స్‌కు చెప్పింది. స్వియాటోలినా తొలి మ్యాచ్, తొలి సెట్ తర్వాత తనపై కోపంగా ఉందని చెప్పింది. ఆ కోపాన్ని బంతిపైకి మళ్లించి చివరికి తన ఆటను కనుగొన్నానని వివరించింది. సీజన్ చివరి టోర్నమెంట్‌లో చిన్న గాయాలను చూసుకుంటూ ముందుకు సాగాలని స్వియాటోలినా పేర్కొంది. గ్రూప్‌లో రెండో స్థానానికి స్వియాటోలినా, అరినా సబలెంకాతో నేరుగా తలపడనుంది. తదుపరి 48 గంటల్లో ఐస్ బాత్ తీసుకుని కోలుకోవాలని స్వియాటోలినా చెప్పింది. ఫ్రెంచ్ ఓపెన్ విజేత ఆండ్రీవా సెమీఫైనల్ బెర్త్ ఖాయం చేసుకుంది. సబలెంకాను 64, 60తో ఓడించేందుకు ఆండ్రీవా తొలి సెట్‌లో 41 లోటు నుంచి పుంజుకుంది.

ఎంబాపే తొడ గాయం, ఇటలీతో ఫ్రాన్స్ మ్యాచ్‌కు దూరం



మిలాన్‌లో గురువారం జరిగే ఇటలీ మ్యాచ్‌కు కైలియన్ ఎంబాపే దూరమవుతున్నాడు. తొడ కండరాల సమస్యతో బుధవారం శిక్షణకు హాజరుకాలేదు.
ఫ్రాన్స్ కోచ్ జినెడిన్ జిదాన్ ఈ విషయాన్ని ధ్రువీకరించాడు. రియల్ మాడ్రిడ్ స్ట్రైకర్‌పై ఎలాంటి ప్రమాదాన్ని స్వీకరించబోమని జిదాన్ చెప్పారు.
ఎంబాపేకు స్వల్ప అసౌకర్యమే ఉందని తెలిపారు. ఆదివారం బోర్డోలో టర్కియేపై మ్యాచ్‌కు అతను సిద్ధంగా ఉంటాడన్నారు.
ఇటలీ కోచ్ రొబెర్టో మాన్సిని కూడా ఎంబాపే ఆడకపోవడమే మంచిదని సూచించారు. రియల్ మాడ్రిడ్‌కు ఛాంపియన్స్ లీగ్ మ్యాచ్‌లు ఉన్నాయని నవ్వుతూ చెప్పారు.
ఫ్రాన్స్ పద్ద అనేక మంది నాణ్యమైన ఫార్వర్డ్లు ఉన్నారని మాన్సిని వ్యాఖ్యానించారు. పారిస్ సెయింట్ జెర్మెయిన్ ఫార్వర్డ్ సెన్నీ మయులు ఫ్రాన్స్ జట్టులోకి చేరాడు.
20 ఏళ్ల మయులు ఇప్పటికే క్లేర్‌ఫాంటైన్‌లోని అండర్ 21 శిబిరంలో ఉన్నాడు. బుధవారం తరువాత మయులు మిలాన్‌కు ప్రయాణించనున్నాడు.
బోర్న్‌మౌత్ ఫార్వర్డ్ ఎలి జూనియర్ క్రూపీ కూడా 20 ఏళ్ల కొత్త ఆటగాడు. అతను మార్కస్ థురామ్ స్థానంలో జట్టులోకి వచ్చాడు.
ఇంటర్ మిలాన్ స్ట్రైకర్ థురామ్‌కు కూడా తొడ కండరాల గాయమైంది. ఇటలీని సాన్ సిరోలో ఓడిస్తే ఫ్రాన్స్ మార్చిలో క్వార్టర్ ఫైనల్‌కు చేరుతుంది.
నేషన్స్ లీగ్ గ్రూపులో ఫ్రాన్స్ ప్రస్తుతం అగ్రస్థానంలో ఉంది. ఈ నివేదికకు అసోసియేటెడ్ ప్రెస్ సహకరించింది.

రాండల్ రెండు వరుస గోల్స్, వుడ్ కీలక దెబ్బతో ఆక్లాండ్‌లో భారత్‌ను 5-0తో ఓడించిన న్యూజిలాండ్

▶ విశాల్ కైత్ పెనాల్టీని అడ్డుకున్నాడు.

▶ క్రిస్ వుడ్ నాలుగో గోల్ చేశాడు.




ఆక్లాండ్‌లో న్యూజిలాండ్ భారత్‌పై 50తో గెలిచింది. గో మీడియా స్టేడియంలో తొలి ఎఫ్ఐఎఫ్ఏ అంతర్జాతీయ స్నేహపూర్వక మ్యాచ్ జరిగింది.
భారత జట్టు బ్రెజిల్, ఉరుగ్వే చేతిలో ఓడి వచ్చింది. న్యూజిలాండ్ గత అంతర్జాతీయ విరామంలో జపాన్, పనామాపై గెలవలేదు.
భిజోయ్ వర్గీస్ 300 సెకన్లలోపే బంతిని సొంత గోల్‌గా మలిచాడు. భారత్ సమం కోసం ఒత్తిడి పెంచింది.
ఆతిథ్య జట్టు వేగాన్ని తగ్గించలేదు. జెస్సీ రాండల్ మొదటి అర్ధభాగం చివరి 10 నిమిషాల్లో గోల్ చేశాడు.
మొదటి అర్ధభాగం ముగిసేసరికి న్యూజిలాండ్ 30 ఆధిక్యంలో ఉంది. రెండో అర్ధభాగంలో భారత్‌కు పరిస్థితి మరింత దిగజారింది.
క్రిస్ వుడ్ ఆతిథ్య జట్టుకు నాలుగో గోల్ చేశాడు.
75వ నిమిషంలో లాక్లాన్ బేలిస్ వాలీతో ఐదో గోల్ సాధించాడు.
చివర్లో న్యూజిలాండ్‌కు పెనాల్టీ లభించింది. అయితే విశాల్ కైత్ దాన్ని అడ్డుకుని ఆరో గోల్‌ను నిరోధించాడు.
రాండల్ రెండు వరుస గోల్స్‌తో మెరిశాడు. బేలిస్‌కు లియామ్ గిలియన్ సహకారం అందించాడు.
కల్లన్ ఎలియట్ కుడి వైపు నుంచి వేగంగా దూసుకెళ్లాడు.
ఎలియట్ క్రాస్‌పై వుడ్ హెడర్‌తో నాలుగో గోల్ చేశాడు.
ఫ్రాన్సిస్ డి ప్రీస్ రాండల్‌కు మూడో గోల్‌లో సహాయపడ్డాడు. న్యూజిలాండ్ రక్షణ భారత్‌ను క్లీన్‌షీట్‌తో నిలిపింది.
అలెక్స్ పాల్సెన్ గోల్‌పోస్ట్‌ను కాపాడాడు. నాండో పైనాకర్ 80వ నిమిషంలో బయటకు వెళ్లాడు.
భారత్‌పై ఓటమి తర్వాత ఖలీద్ జమీల్‌కు ప్రశ్నలు ఎదురయ్యాయి. కైత్ పెనాల్టీ ఆపినా భారీ ఓటమిని నివారించలేకపోయాడు.
మ్యాచ్ ఫలితం న్యూజిలాండ్‌కు 50గా నమోదైంది. మ్యాచ్ 2026 నవంబర్ 12న ముగిసింది. మాథ్యూ గార్బెట్ రాండల్‌కు రెండో గోల్‌లో సహాయపడ్డాడు. అలెక్స్ రూఫర్ న్యూజిలాండ్ మిడ్‌ఫీల్డ్‌ను నియంత్రించాడు. విశాల్ కైత్‌కు 6.5 రేటింగ్ లభించింది.

భారత్ అండర్-19 జట్టు అఫ్గానిస్థాన్‌పై ఎనిమిది వికెట్ల విజయం



అలోంగ్‌లో నవంబర్ 12న భారత్ అండర్19 జట్టు అఫ్గానిస్థాన్‌పై ఎనిమిది వికెట్ల తేడాతో గెలిచింది. ఆసియా కప్ రెండో సెమీఫైనల్లో భారత్ 79 బంతులు మిగిలుండగానే లక్ష్యాన్ని చేరింది.
నాలుగు రోజుల క్రితం ఇదే మైదానంలో పాకిస్థాన్ భారత్‌ను 208 పరుగులకు ఆలౌట్ చేసింది. 228 పరుగుల లక్ష్యాన్ని భారత్ 36.5 ఓవర్లలో 230/2తో ఛేదించింది.
ఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ పాకిస్థాన్‌తో భారత్ తలపడనుంది.
లక్ష్య ఛేదనలో కెప్టెన్ లక్ష్య రాజ్‌చందానీ 90 బంతుల్లో 93 పరుగులు చేశాడు.
ఆర్యవీర్ సెహ్వాగ్ 57 బంతుల్లో 51 పరుగులతో సహకరించాడు.
ఇద్దరూ తొలి వికెట్‌కు 117 పరుగులు జోడించారు.
బౌలర్లకు అనుకూలమైన పిచ్‌పై అఫ్గాన్ బౌలింగ్‌ను భారత్ సమర్థంగా ఎదుర్కొంది. నూర్ అలీ నియాజీపై రాజ్‌చందానీ వరుసగా రెండు బౌండరీలు కొట్టాడు.
నియాజీ గత ఐదు మ్యాచ్‌ల్లో 19 వికెట్లు తీసి అద్భుతంగా రాణించాడు. 18 ఏళ్ల ఉత్తరాఖండ్ బ్యాటర్ నాలుగు బంతుల్లో 14 పరుగులు సాధించాడు.
భారత్ ఏడు ఓవర్లలోనే 50 పరుగులు పూర్తి చేసింది. పవర్‌ప్లే తొలి తొమ్మిది ఓవర్లలో సెహ్వాగ్ 28 బంతుల్లో 12 పరుగులకే పరిమితమయ్యాడు.
తర్వాత బిలాల్ సల్మాన్‌ఖిల్‌పై రెండు బౌండరీలు కొట్టాడు. రాజ్‌చందానీ 39 బంతుల్లో అర్ధశతకం సాధించాడు.
రెండో వికెట్ భాగస్వామ్యం 77 పరుగుల వద్ద ముగిసింది. ఇషాన్ సూద్ మూడు వికెట్లు, అర్యన్ సావ్‌సాని రెండు వికెట్లు తీశారు.
అఫ్గానిస్థాన్ 35 ఓవర్లకు 140/3తో పటిష్ఠ స్థితిలో ఉంది. చివరి 15 ఓవర్లలో ఆ జట్టు భారీ షాట్లకు ప్రయత్నించి ఏడు బంతుల్లో మూడు వికెట్లు కోల్పోయింది.
అఫ్గానిస్థాన్ 50 ఓవర్లలో 227/8తో నిలిచింది. సెహ్వాగ్ 17వ ఓవర్‌లో సిక్స్ కొట్టిన వెంటనే మరుసటి బంతికి ఔటయ్యాడు.
రాజ్ చందానీ సెంచరీకి ఏడు పరుగుల దూరంలో ఔటయ్యాడు. సోహైల్ ఖాన్ బౌలింగ్‌లో మిడ్‌ఆఫ్‌ను దాటించే ప్రయత్నంలో మహ్మద్ అలీ క్యాచ్ పట్టాడు.
భారత్ ఐదు సంవత్సరాల తర్వాత టైటిల్ గెలవాలంటే పాకిస్థాన్‌ను ఓడించాలి. పాకిస్థాన్ ఈ టోర్నీలో ఓటమి ఎరుగని ఏకైక జట్టు.
ఈ ఎడిషన్‌లో భారత్‌ను ఓడించిన ఏకైక జట్టు కూడా పాకిస్థానే. అఫ్గాన్ టాప్ అర్డర్ 140/3తో నిలిచినా, చివరి దశలో వికెట్లు కోల్పోయింది.

పెళ్లి మండపంలో ఫౌజీ



వుదయం సినిమా: ఇటలీ నుంచి నేరుగా హైదరాబాద్‌లోని పెళ్లి మండపంలోకి ప్రభాస్ అడుగుపెట్టారని తెలిసింది. కానీ ప్రస్తుతానికి ఇది రియల్ లైఫ్‌లో కాదు... రీల్ లైఫ్‌లో అన్నమాట. ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'ఫౌజీ'. ఇమాన్వి ఇస్మాయిల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో జయప్రద, మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రంలో ప్రభాస్ సీక్రెట్ సోల్జర్‌గా కనిపిస్తారని తెలిసింది. ఇక ఇటీవల వెకేషన్ కోసం ఫారిన్ వెళ్లిన ప్రభాస్ ఇండియాకు వచ్చీ రాగానే 'ఫౌజీ' చిత్రీకరణలో పాల్గొంటున్నారని తెలిసింది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. పెళ్లి మండపం సెట్‌లో జరుగుతున్న ఈ సినిమా షూట్‌లో ప్రభాస్‌తో పాటు ఇమాన్వీ పాల్గొంటున్నారు.ఈ కీలక సన్నివేశాల తర్వాత ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను ప్లాన్ చేశారట హను రాఘవపూడి. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 19న విడుదల కానుంది. మరోవైపు 'స్పిరిట్, కల్కి 2' సినిమాల చిత్రీకరణలతో కూడా ప్రభాస్ బిజీగా ఉంటున్నారు. ఇక ప్రభాస్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలోని 'సలార్ 2' సినిమా షూటింగ్ వచ్చే ఏడాది ప్రారంభం కానుంది.

వుదయం సినిమా

అల్లు అర్జున్ హీరోగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో 'ఏఏ 23'



వుదయం సినిమా: అల్లు అర్జున్ హీరోగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో 'ఏఏ 23' (వర్కింగ్ టైటిల్) అనే సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. స్క్రిప్ట్‌కు తుది మెరుగులు దిద్దే పనిలో ఉన్నారు లోకేష్ కనగరాజ్. వచ్చే ఏడాది ప్రారంభంలో ఈ సినిమా చిత్రీకరణను ప్రారంభించేలా సన్నాహాలు చేస్తున్నారట. మరోవైపు ప్రస్తుతం 'రాకా' చిత్రీకరణతో అల్లు అర్జున్ బిజీగా ఉన్నారు. ఈ సినిమా చిత్రీకరణ ముంబైలో జరుగుతోంది. హైదరాబాద్, కేరళ లొకేషన్స్‌లో ఈ సినిమా నెక్స్ట్ షెడ్యూల్స్ ప్రారంభం కానున్నాయని తెలిసింది. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మిస్తున్న 'రాకా' సినిమా వచ్చే ఏడాది విడుదల కానుంది.

డిసెంబర్ 18న 'ఆల్కహాల్'!

వుదయం సినిమా: విభిన్నమైన కథా చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తున్న హీరో అల్లరి నరేష్ మరో ఆసక్తికరమైన చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'ఆల్కహాల్' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. తాజాగా ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా డిసెంబర్ 18న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కానున్నట్లు మేకర్స్ ప్రకటించారు.మెహర్ తేజ్ రచించి, దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం మానవ ప్రవర్తనలోని విభిన్న కోణాలు, నేర ప్రవృత్తి, మనిషి తీసుకునే నిర్ణయాలు వాటి పర్యవసానాల నేపథ్యంలో ఆసక్తికరమైన కథాంశంతో తెరకెక్కుతోంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రా లు, టీజర్ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచాయి. ముఖ్యంగా అల్లరి నరేష్ గత చిత్రాలకు పూర్తి భిన్నంగా స్టైలిష్, సరికొత్త లుక్‌లో కనిపిస్తూ సినిమాపై అంచనాలను పెంచుతున్నారు.ఈ చిత్రంలో అల్లరి నరేష్ సరసన రుహానీ శర్మ నటిస్తుండగా, నిహా రిక ఎన్ఎం, సత్య, గిరీష్ కులకర్ణి, హర్ష వర్ధన్, చైతన్య కృష్ణ, రవీంద్ర విజయ్, రఘుబాబు, వెంకటేష్ కాకుమాను, కిరీటి దమరాజు తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.ఈ సినిమాకు ప్రతిభావంతమైన సాంకేతిక బృందం పనిచేస్తోంది. ఫిబ్రాన్ సంగీతాన్ని అందిస్తుండగా, చేతన్ భరద్వాజ్ నేపథ్య సంగీతాన్ని సమకూరుస్తున్నారు. జిజు సన్నీ సినిమాటోగ్రఫీ, నిరంజన్ దేవరమానే ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. విశాల్ అబాని ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరిస్తున్నారు.సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది. ఆసక్తికరమైన కథాంశం, అల్లరి నరేష్ సరి కొత్త అవతారం, ప్రతిభావంతమైన నటీ నటులు, సాంకేతిక నిపుణుల కలయికలో రూపొందుతున్న 'ఆల్కహాల్' డిసెంబర్ 18న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.



బావోలి ఆర్ట్ సంగంలో చైర్‌పర్సన్‌గా అల్లు స్నేహారెడ్డి


వుదయం సినిమా: భారతదేశంలో తొలిసారిగా నిర్వహిస్తున్న స్టెప్‌వెల్ ఆర్ట్ బినాలే 'బావోలి ఆర్ట్ సంగం'లో అల్లు స్నేహారెడ్డి కీలక బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఆమె కల్చర్ అండ్ హెరిటేజ్ విభాగం చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. ఫ్యాషన్, కళలు, సంస్కృతిపై ప్రత్యేక ఆసక్తి కలిగిన అల్లు స్నేహారెడ్డి ఈ కార్యక్రమంలో భాగం కావడం విశేషం. భారతీయ కళలు, సంస్కృతి, సంప్రదాయ వారసత్వాన్ని మరింత మందికి చేరువ చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. భారతదేశంలోని చారిత్రక మెట్ల బావుల (స్టెప్‌వెల్స్) విశిష్టతను ప్రపంచానికి పరిచయం చేయడంతో పాటు, వాటి అద్భుతమైన నిర్మాణ శైలి, చారిత్రక ప్రాధాన్యత, నీరు, కళలు, నాగరికత మధ్య ఉన్న అనుబంధాన్ని ఈ వేదిక ద్వారా తెలియజేయనున్నారు. ఈ కార్యక్రమంలో అల్లు స్నేహారెడ్డి భాగస్వామ్యం భారతీయ కళా వారసత్వంపై మరింత అవగాహన పెంచడంతో పాటు, మన సంస్కృతి మూలాలను గౌరవించేలా ప్రజలను ప్రోత్సహించనుంది.





"ఇడుపు కాయితం" టీజర్ లాంచ్ ఈవెంట్

వుదయం సినిమా: ప్రొడ్యూసర్ బన్నీ వాస్, జీనియస్ డైరెక్టర్ సుకుమార్ తమ బన్నీ వాస్ వర్క్స్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్ పై ప్రియదర్శి హీరోగా నిర్మిస్తున్న సినిమా "ఇడుపు కాయితం". ఈ సినిమాలో ఫోక్ సాంగ్స్ ద్వారా పేరు తెచ్చుకున్న నటి నాగదుర్గ హీరోయిన్ గా నటిస్తోంది. ఫ్యామిలీ బ్యాక్ డ్రాప్ స్టోరీతో ఎంటర్ టైనింగ్ డ్రామాగా "ఇడుపు కాయితం" సినిమాను యువ దర్శకుడు వంశీరెడ్డి దొండపాటి రూపొందిస్తున్నారు. ఈ సినిమా డిసెంబర్ 11న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ రోజు "ఇడుపు కాయితం" సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్ హైదరాబాద్ లో నిర్వహించారు. ఈ సందర్భంగాకొరియోగ్రాఫర్ శ్రష్టి వర్మ మాట్లాడుతూ – ఈ సినిమాకు వర్క్ చేసే అవకాశం రావడం హ్యాపీగా ఉంది. బారాత్ సాంగ్ కు నాగదుర్గ తన డ్యాన్స్ స్టెప్స్ తో ఆకట్టుకుంటుంది. ఈ టీమ్ అందరికీ థ్యాంక్స్. అన్నారు. నటుడు విద్యా సాగర్ మాట్లాడుతూ – మంచి కుటుంబ కథా చిత్రమిది. ఈ సినిమాను ప్రతి ఒక్కరూ చూడాలి. ఈ చిత్రంలో ఇంపార్టెంట్ క్యారెక్టర్ లో నటించే అవకాశం కలగడం సంతోషంగా ఉంది. అన్నారు.నటి విజయ మాట్లాడుతూ – ఈ సినిమాలో సర్పంచ్ నవ్య పాత్రలో నటించాను. మహిళ సర్పంచ్ అయితే అధికారం భర్త చెలాయిస్తాడు అంటారు కానీ కాలం మారింది. మహిళలు సర్పంచులు అయితే మీరే అన్ని బాధ్యతలు తీసుకోండి. ఇలాంటి మంచి క్యారెక్టర్ చేసే అవకాశం కల్పించిన మా దర్శక నిర్మాతలకు థ్యాంక్స్. అన్నారు.నటుడు మైమ్ మధు మాట్లాడుతూ – మా సినిమా టైటిల్ పై ఆదరణ చూపించారు. శ్రీలత, గడప సాంగ్స్ హిట్ చేశారు. రీసెంట్ గా బారాత్ సాంగ్ ను ఎంజాయ్ చేశారు.



Printed, Published & Owned by Sirikonda Maria, Printed at LAKSHYAM TELUGU DAILY, D. No.1227/1, 11 GPR Flats, Pedakakani Village and Mandal, Guntur, Andhra Pradesh - 522509 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : Sirikonda Augustin, RNI No. APTEL/2014/57702. E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.